దేశంలో అత్యధికంగా చదవబడుతున్న ...

స్వాతి


అక్టోబర్ రూ.3/

10-1980



పీడకల

యర్రంశెట్టి సాయి



సంస్థాపకులు
కీ॥శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతీ
రాఘవయ్య

అక్టోబరు 1980

సంపుటి 18 | సంచిక 9

విషయసూచిక


ఈ నెల నవలానుబంధం

పీడకల

రచన : యర్రంశెట్టి శాయి

ముఖచిత్రం : శ్రీదేవి

జ్యోతి, 1-8-4/1/1, చిక్కడపల్లి, హైదరాబాదు-500 020
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 48 రూపాయలు



ఆగస్టు 17 న మద్రాసులో మరణించిన మహారచయిత కొడవటిగంటి కుటుంబరావుకి శ్రద్ధాంజలి ఘటిస్తూ, "జ్యోతి" మహాకవి శ్రీశ్రీ అక్షరాంజలిని యిక్కడ ప్రచురిస్తోంది. —ఎడిటర్

కుటుంబ స్మృతి!

పెద్ద పెద్ద చెట్లన్నీ ఒక దాని తర్వాత ఒకటిగా కూలిపోతున్నాయి. తెలుగు కథానికా వనంలో మహా వట వృక్షం కొడవటిగంటి కుటుంబరావు. ఆ చెట్టు కూడా ఇప్పుడు నేలవాలింది

చలంవలె, కృష్ణశాస్త్రివలె, అబ్బూరివలె, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మవలె కుటుంబరావు కూడా 80 ఏళ్ళ వయసు పరిమితిని దాటుతాడనుకున్నాను. కాని ఆయన 72 ఏళ్ళకే మరణించాడు.

ఆర్నెల్ల కిందట నేనూ, కుటుంబరావు తెనాలి వెళ్ళాము. అక్కడ డాక్టర్ దక్షిణామూర్తి మా ఇద్దరి హృదయాలను పరీక్షించాడు. నా గుండె పోటు మిల్టన్ కవిత్వంలాగుంటింది, ఎగుడు దిగుడులు లేకుండా! కుటుంబరావు electro card track నేను చూశాను. అప్పుడే అనుకున్నాను— కుటుంబరావు తన మెదడుని ఎంత జాగ్రత్తగా, చక్కదిద్దుకొన్నాడో; అంత అశ్రద్ధగా తన హృదయాన్ని నిర్లక్ష్యం చేశాడని!

కుటుంబరావు కథలు చదవండి. (ఏ కథనయినా సరే). తన గుండెల్ని బాదుకొని, ఎదురు గుండెల్ని బద్దలు చేసే టెక్నిక్ అందులో మీకు దొరకదు. ప్రతి కథా, మీ మెదడుకి మేత పెడుతుంది. మీ చేత ఆలోచించేటట్టు చేస్తుంది. ఆలోచన ఆచరణకి ఆరంభం!

కుటుంబరావు రచనలు వాస్తవానికి నివాళులు. విప్లవానికి స్వాగతాలు!

రమారమి 50 ఏళ్ళుగా నాకు అతనితో పరిచయం ఉంది. ఈ యాభైయేళ్ళ పరిచయం ఒక్క క్షణంలో అంతమయి పోయింది.

కుటుంబరావుని తెలుగువారి చకోవ్ అని ఏనాడో అభివర్ణించాను నేను అతను చకోవ్ మాత్రమే కాదు. అంతరాంతరాల్లో శ్రీ శ్రీ కూడా.

నాది వి[illegible] కవిత్వం
కాకుది వి[illegible]కవిత్వం!


కొడవటి గంటి కుటుంబరావు

తొలిమాట

ఆయన తెలుగు కథకి నడక నేర్పిన వాడు. ఆయన తెలుగుకథా రచనకి ఆలోచన అందించిన వాడు. అలంకరణలు లేని నిరాడంబర వచన శైలికి ఆద్యుడన దగినవాడు. శాస్త్రీయ దృక్పథంలో తెలుగు కథావికాసాన్ని ముందుగానే దర్శించిన అక్షరాల ముక్కంటి కొడవటిగంటి. ఆగస్టు 17న ఆయన అస్తమయంతో ఆంధ్ర సాహిత్యాకాశాన్ని చీకట్లు ఆవరించాయి. ఆయన లేని లోటు తీర్చలేనిది. తెలుగు వచనానికి "చదువు" నేర్పిన, తెలుగు బాలలకి "చందమామ" ద్వారా చదవ నేర్పిన నేర్పరి ఆయన. కొడవటిగంటి కుటుంబరావు గురించి శ్రీ శ్రీ రాసిన "కుటుంబ స్మృతిని" ఈ సంచికలో (పక్క పేజీలో) ప్రచురించాము,

○ ○ ○ ○ ○ ○

"జ్యోతి" మద్రాసునుంచి ఆంధ్ర దేశపు రాజధానికి తరలి వచ్చింది. హైదరాబాదులో జ్యోతి కార్యాలయం పని చేయడం ప్రారంభమైంది. మా పాఠకులు, ఏజంట్లు, ప్రకటన కర్తలు జ్యోతికి ఇతోధికంగా సహకరిస్తారని విశ్వసిస్తున్నాము. "జ్యోతి" కొత్త చిరునామా, ఈ సంచికలో కూడా ప్రచురించాము. గమనించండి.



ఉత్తరాలు

యుగాంతం - ఒక సందేహం,

జ్యోతిలో ఈ మధ్య ప్రచురించబడిన "సైంటిఫిక్ సస్పెన్స్ సీరియల్" యుగాంతం చదివాను. సైన్సుతో కొద్దిగా పరిచయం ఉండడంతో కొన్ని అనుమానాలు వచ్చాయి దయచేసి వీటికి రచయిత, సమాధానాలు పత్రికాముఖంగా యిస్తే సంతోషిస్తాను

ప్రాక్సిమాసాంక్చురీ అనే నక్షత్రం స్థాన భ్రంశంపొంది సౌరకుటుంబ వ్యవస్థ వైపుగా రావడం ప్రారంభించింది. ఈ నక్షత్రం పరిమాణం ఎంతో వివరణ ఇచ్చినట్లులేదు. ఇది బాగా పెద్దది అయితే, గురుత్వాకర్ష సిద్ధాంతం ప్రకారం సౌరకుటుంబ వ్యవస్థ యావత్తు ఆ నక్షత్రం వైపుకు కదలాలి. ఆ నక్షత్రం అంత పెద్దది కాకపోతే- అది సౌరకుటుంబం వైపు వస్తూంది. కనక ఆ నక్షత్రానికి మొట్టమొదటగా దగ్గరగా వచ్చే గ్రహం-యూరేనస్‌గాని మరేదైనా అటువైపుకు ఆకర్షింపబడుతుంది. ఇక్కడ గమనించ వలసినదేమంటే కొన్ని గ్రహాల ఉనికిని గణిత శాస్త్రం ద్వారా ఊహించారు. అంటే సౌరకుటుంబ వ్యవస్థ, గణిత శాస్త్రంలో ఒక వ్యవస్థకు భౌతికరూపం. ఏక ఒక గ్రహం స్థాన భ్రంశం పొందితే దాని ప్రభావం భూమిపై వెంటనే కనిపిస్తుంది అంటే ఏ రకంగా చూసినా ప్రపంచ ప్రజలకు, నక్షత్రం రావడంవలన కలిగే ప్రభావం ఎవరూ చెప్పకుండానే తెలియాలి.

ఇకపోతే నక్షత్రాలన్నీ స్వయం ప్రకాశకాలని చదువుకున్నాము. మరి సూర్యుడికి నక్షత్రం అడ్డువస్తే ప్రపంచం చీకటి ఎలా అవుతుంది? నక్షత్రం నల్లటి ముద్దగా కనిపించటానికి కారణమేమిటి? అసలు నక్షత్రం అంటే ఏమిటి?

ఒక పాఠకుడు,
అమలాపురం.

"సుజాత" ముఖ చిత్రంతో వెలువడిన సెప్టెంబర్ జ్యోతి, నిండుపున్నమి వెన్నెలగా నిండుగా ప్రకాశించింది. "ఉన్నతుడు" కథ చదివాను. వాస్తవానికి చాల దగ్గరగా వుంది శైలి ఎంతో ఉన్నతంగా వుంది. ఇమిటేషన్ ఇష్టం లేదు. కథ ఏమాత్రం బాగులేదు. ఒక భార్య తన భర్తను ఫలానా విధంగా పిలుస్తానని అనడం సబబుగా ఉన్నా, ఈ చిన్న విషయాన్నే ఆధారంగా చేసుకొని కథ రాశారు కాని రచనలో సందేశం కూడ ఏదీ లేదు. ఇలాంటి రచనలు సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడవు.



మద్రాసులోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ "కళాసాగర్" వేదికమీద ఇటీవల నృత్య ప్రదర్శన యిచ్చిన ప్రముఖ నర్తక దంపతులు,
శ్రీ రాజారెడ్డి, శ్రీమతి రాధారెడ్డి.

"ఆకాశాన్ని సరిజేస్తున్నాను." కథ చాలాబాగుంది. "భూమి గుండ్రంగా ఉంది" సీరియల్ ఎంతో చక్కగా

మనసు

పద్మావతీ గంగాధర్

మనిషి, మెదడులోని చిన్న భాగం, అనంతంలోకి తొంగి చూడనూ గలదు. ఎన్నో విషయాలను స్వీకరించనూ గలదు, అనేక విషయాలను భద్రపర్చనూ గలదు. అలా దాచిన విషయాలను అనేక రకాలుగా మార్చనూ గలదు. ఎన్ని విషయాలను అది స్వీకరించ గలదో, ఎన్నింటిని అది భద్రపర్చ గలదో, ఎలా వాటిని మలచగలదో. ఎవరు చెప్పగలరు?

మనిషి కంటిలోని చిన్న భాగం, ఎంతో దూరాన్ని, ఎన్నో వస్తువులనూ చూడగలదు. కాని ఎలాంటిఅనుభూతిని ప్రతిసారీ అది పొంద గలుగుతుందో ఎవరు చెప్పగలరు?

మనిషి గుప్పెడు హృదయం అనేక స్పందనలకు నిలయమంటారు. ఏ స్పందన అగ్నికణికో, ఏ స్పందన మంచు తునకో ఎవరు చెప్పగలరు? ఆ గుప్పెడు గుండె ఎన్ని అగ్ని పర్వతాలకు ఆలయమో, ఎన్ని హిమాలయ పర్వతాలకు నిలయమో ఎవరు చెప్పగలరు?

రాముడు గుర్తుకు వచ్చినప్పుడల్లా యిలాంటి ఆలోచనలతో సతమతమవుతూంటాను.

వేసవికాలం, ఒకనాటి సాయంకాలం ఆఫీసునుంచి తిరిగొచ్చి, శ్రీమతియిచ్చిన కాఫీ తాగి, స్నానంచేసి, ఆరుబయట పడకకుర్చీలో, కాళ్ళు ముందున్న టేబుల్‌పై పెట్టి, కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నా.

"అమ్మా—" అనే జాలి పిలుపుకి కళ్ళు తెరచి చూసాను.

ఎదురుగా గేటుబయట, ఒక కుర్రాడు నిల్చొని ఉన్నాడు.



"ఎవరూ?—" అన్నాడు.

"ఆకలి—బాబూ—" అంది అదే జాలి గొంతుక మరీ జాలిగా, గేటుబైట నుంచే.

లోపలకు రమ్మన్నాను. వచ్చాడు. నిండా ఆరేళ్ళుకూడా ఉండవనిపించింది. అతడు కట్టుకున్న బట్టలు చిరిగి ఎంతో మురికిగా ఉన్నాయి. కాని అతడిముఖంలో ఎంతో ప్రశాంతత. కళ్ళల్లో ఎంతో ఆకర్షణ. అతడిని చూడగానే నాకుచాలా జాలి వేసింది. ఒక పెద్ద యింటి బిడ్డ దారితప్పి వచ్చాడనుకున్నాను.

"పేరేమిటి" అని అడిగాను.

"రాముడు—"

"మీదేవూరు—"

"తెలియదు—"

"మీ అమ్మ పేరు—"

"తెలియదు—"

"మీ నాన్న పేరు-"

"తెలియదు—"

"ఏమిటి—ఏమీ తెలియదంటావ్" కొంచెం గట్టిగా తెచ్చిపెట్టుకున్న కోపంతో అడిగాను

"నిజంగానే సార్—తెలియదుసార్ ఆకలిగా ఉందిసార్—" అన్నాడు జాలిగా.

ఆ పసి హృదయాన్ని నొప్పించినందుకు కొంచెం బాధ పడ్డాను.

మా మాటలువిని, ఎవరోనని బయటకువచ్చిన నా శ్రీమతి అతడినిచూస్తూ ఆశ్చర్యంగా ఒక క్షణం నిలబడిపోయింది. అలాంటిది అతడిలోని ఆకర్షణ.

లోపలకు తీసుకెళ్ళి, అన్నం పెట్టి తను తిరిగి వచ్చింది.

"ఎవరబ్బాయోనండీ—ఎంత అందంగా ఉన్నాడు! — దారి తప్పి వచ్చుంటాడు—ఆ తల్లిదండ్రులు ఎంత దుఃఖపడుతున్నారో—" కన్నీళ్ళు పర్యంతమై అన్నది.

నాకూ అలాగే అనిపించింది. వాడు చెప్పే పద్ధతిచూస్తే అతడు అబద్ధం చెప్పటంలేదని పించింది. మాకు అప్పటికి ప్రసాద్ ఒక్కడే బిడ్డ. సంవత్సరం అయింది వాడు పుట్టి వాడిని ఆడించుతూ, యింట్లో జతగా ఉంటాడనీ, ఎవరైనా రాముణ్ని గురించి వెతుక్కుంటూ వచ్చినా, అతడిని గురించి ప్రకటన ఏదైనా పేపర్లలో వచ్చినా, అతడిని వాళ్ళకు అప్పజెప్పవచ్చుననీ, రాముడిని మా యింటిలోనే ఉండమందాం అనుకున్నాం.

అతడు భోజనంచేసి బయటకొచ్చి "వెళతా" నన్నాడు.

"ఎవరూ లేరన్నావు — ఎక్కడకు వెళతావ్"-అని అడిగాను.

"ఎవరూలేరు - మరి ఎక్కడ ఉండను?-" అన్నాడు.


"మా యింటిలోనే ఉండు-"అన్నా. పద్మకూడ "అవును- నీ యిష్టమొచ్చినంత కాలమే ఉండు-" అంది.

అలా ఆనాడు రాముడు మా యింటిలో ఉండి పోయాడు. మాలో ఒకడిగా కలిసి పోయాడు. మా పెద్దకొడుకులా యింటిలో తిరుగుతూ, ఎంతో యిదిగా ఉండేవాడు. తెలియనివాళ్ళు అతడు మా పెద్దబ్బాయే అనుకునే వారు. అలా రాముడు మా యింటిలో నాలుగు సంవత్సరాలున్నాడు.

పద్మ, వాళ్ళమ్మకు బాగుండకపోతే, ప్రసాదును తీసుకుని ఊరి కెళ్ళింది. నేనూ రాముడూకలసి వంటచేసేవాళ్ళం. నేను ఆఫీసునుండి తిరిగొచ్చేవరకూ, అతడు యింటినికనిపెట్టుకునుండేవాడు.



అమ్మో- సీటుకి చేతిగుడ్డ కట్టిపోతే- సీట్లో కూర్చుండిగాతే బంగారంటి చేతిగుడ్డ తీసి జేబులో పెట్టుకొంటావుటయ్యా



ఒకనాటి సాయంకాలం, నేను బైట కూర్చొని పేపరు చదువుకుంటున్నా. రాముడు నెమ్మదిగా నా దగ్గరకొచ్చాడు.

"ఏం - రాం - బయటకెక్కడికైనా వెళ్తొస్తావా?-'' అని అడిగాను

"లేదుసార్-నేను వెళ్ళిపోతా:"

''వెళ్లిపోతావా!-''

"ఊ-" అన్నాడు తలొంచుకుని.

''ఎవరూ లేరన్నావ్-"

"అవునుసార్-ఎవరూలేరు-"

"అయితే ఎక్కడకు వెళతావ్-''

''అమ్మ దగ్గరకు-"

"అమ్మా?-"

"అవును-సార్-"

"అమ్మ ఎవరురా?-"

''మా అమ్మే సార్-''

"అమ్మ-నాన్న - ఎవరూ తెలియదన్నావ్-"

"అవి నిజమేసార్-మరి-మరి- అ అమ్మ-" నత్తులు కొడుతూ, ఒకనాడు -మా యింటికి వచ్చేముందు-అతడి జీవితంలో జరిగిన సంఘటనను గురించి చెప్పాడు.

o o o

అదొక మెయిన్‌రోడ్డు. ఆ మెయిన్ రోడ్డునుండి చీల్తోగుండా మరొకరోడ్డు అది ఒక ఫర్లాంగు దూరంలో నున్న రైల్వేస్టేషన్‌కు వెళుతుంది. ఆ రెండు రోడ్డులూ కలిసిన చోట, ఒకమూల మెట్ట చేను, ఆ చేలో ఒక మామిడిచెట్టూ, నుయ్యీ ఉన్నాయి. వచ్చే పోయే బాటసారులు వాళ్ళు అక్కడ వాళ్ళుబళ్ళు ఆపుకుని భోజనాలు చేస్తుంటారు. ఆ చుట్టూచేలల్లో పని చేసేవాళ్ళు కూడ అక్కడకు వచ్చే భోజనాలు చేస్తుంటారు. రాము వాళ్ళు పెట్టిన అన్నం తింటూ, స్నేహితులతో పాడుకొంటూ, ఆడుకొంటూ పగలంతా నిశ్చింతగా గడిపేవాడు. రాత్రిళ్ళు తోయిగా స్టేషనులో నిద్రపోయేవాడు. అలా రాముడి జీవితం సాఫీగా సాగిపోతూంది.

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కొరకు పోరాటం జరుగుతున్న రోజులు. రైళ్ళను ఆపటాలూ, ప్రభుత్వఆస్తివిధ్వంసం చేయటం, పోలీసుల కాల్పులూ, పరిస్థితులు చాలా తీవ్రంగా వున్నాయి. స్టేషనుకు పోలీసులు కాపలా, రాముడుకూడ స్టేషను దగ్గరకు వెళ్ళటానికి వీలులేదు. ప్రజలు భయపడి పోయారు. ఇదివరకటిలా, ఆ చెట్టుక్రింద మనుషులు ఉండటం లేదు. అక్కడ ఎవ్వరూ నిలుపుకోటం లేదు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది.

అలాంటి పరిస్థితుల్లో ఒకనాటి సాయంకాలం ఒకమ్మాయి వచ్చి ఆ చెట్టు క్రింద కూర్చొన్నది. అప్పుడు రాముడు ఒక్కడే అక్కడ ఉన్నాడు. ఆమెకు యిరవైయైదు సంవత్సరాలకు పైనుండవచ్చు, అందంగా ఉంది. ముఖంచూడగానే పెద్దింటి ఆడబడుచు అని పిస్తుంది శోకమూర్తిలా కూర్చొన్నది రామువంక చూడనుకూడ చూడలేదు. మొదట్లో, రాము ఆమెనుచూచి భయపడ్డాడు. అందువల్ల మామూలుగా అందరినీ అడిగినట్టు డబ్బు అడగలేదు. ఇద్దరూ అలాగే కూర్చొనుండి పోయారు.

చీకటి పడింది. ఆమె ఆయాస పడుతూంది. రాము పడుకున్నాడు. ఆమెకు ఆయాసం ఎక్కువవుతూంది. రాముడు ఆమె ఏమవుతుందోనని భయపడ్డాడు. అయినా మాట్లాడటానికి భయం. అలాగే బిక్కుబిక్కుమంటూ పడుకొన్నాడు.

ఆమె పమిట జారింది. వంటిపై బట్టలున్నవో, లేవో తెలుసుకోలేని పరిస్థితిలో ఉంది ఆమె. జాకెట్టు అంతా తడిసింది. అంతా చూస్తున్న రాము భయపడి కళ్ళు మూసుకున్నాడు. ఆకలివల్ల నిస్సారంగా ఉండటంతో వెంటనే నిద్రపోయాడు. ఎవరో తన ప్రక్కన పడుకుని తనపై చేయివేసి నట్టనిపించి కళ్ళు తెరచి చూసాడు. ఆమె. పమిట లేదు. జాకెట్టు విప్పి ఉంది, భయపడి జరుగబోయాడు. కాని ఆమె వెంటనే, అతడిని తనకు దగ్గరగా లాక్కొని, తన స్తనాన్ని అతడి నోటిలో పెట్టింది. పసిపాపలా రాము పాలు తాగాడు. మరొక ప్రక్క పాలుకూడ యిచ్చింది. ఆమె తపన తగ్గింది. అక్కడనుంచి కొంచెం దూరంగా వెళ్ళి కూర్చొన్నది.

రాముకు అయోమయంగా ఉంది. కడుపు నిండింది. అర్థం గాని ఆలోచనలతో హాయిగా నిద్ర పోయాడు. తెల్లవారుతుండగా మెలుకువ వచ్చింది. ఆమె అక్కడ లేదు."

"కన్నతల్లి ఎవరో ఎరుగని నేను, ఆ తల్లిని మరచిపోలేను - ఆ అమ్మ ఎక్కడుందో వెతుక్కుంటూ వెళతా - నా అమ్మ నాకు తప్పక ఎప్పుడో ఒకప్పుడు కన్పిస్తుంది — తప్పక కన్పిస్తుంది—'' అన్నాడు కన్నీళ్ళతో.

అది, ఒకనాడు రాము వాడి భాషలో చెప్పింది. నేను యీనాడు నా పరిభాషలో మీకు చెప్పాను, రాము, ఆమెను వెతుక్కుంటూనే అన్నాడు, మా యింటికి వచ్చుండాలి-రాములాంటి మనిషి కన్పించినప్పుడూ వాడు గుర్తుకు వచ్చినప్పుడూ-విచిత్రానుభూతితో నేనుముందుగానే చెప్పిన ఆలోచనలతో సతమతమవుతుంటాను. □



30 సీరియల్

సుధీర్‌కి మళ్ళీ మెలకువ వచ్చేసరికి తను హాస్పిటల్‌లో బెడ్‌మీద వున్నట్టు మెల్లగా అర్థం అయింది.

'సుధీ' తల్లిగొంతు విన్పిస్తోంది.

'అమ్మా' అస్పష్టంగా అన్నాడు తను.

"సుధీ" అహల్యమ్మగారు ఏడుపుగొంతుతో పిలిచింది" ఎలావున్నావురా నాయనా! అంటోంది.

"బాగానేవున్నానమ్మా. అమ్మా నువ్వు.... నువ్వు...నాదగ్గరకు వచ్చావు కదూ," అన్నాడు. అతని కళ్ళు మూతలు పడుతున్నాయి. "అవును తండ్రీ అవును" అంటోంది ఆవిడ.

అరగంట తర్వాత అతనికి మళ్ళీ మెలకువ వచ్చింది. ఈసారి పూర్తిగ స్పృహవచ్చింది. కళ్ళు, చేతులు కదిపి చూసాడు. అవి వాపుగా వున్నా బాగానే కదులుతున్నాయి. అతనికి క్రమంగా, వానలో వెళుతున్న తన కారుకి యాక్సిడెంట్ అయిన సంగతి గుర్తుకు వచ్చింది.

అతను కళ్ళు తెరిచాడు. అక్కడ తల్లి, మేనమామ, అత్తయ్య, విమల, డి. పి. అన్నయ్య అందరూ వున్నారు.

అతను కళ్ళతో ఆగదంతా కలయ చూసాడు. స్వప్న ఎక్కడా కనిపించ లేదు. స్వప్న ఏమైంది. తనకింత ప్రమాదం జరిగి, చావుతప్పి హాస్పిటల్లోవుంటే స్వప్న ఎక్కడికి వెళ్ళింది,

"స్వప్న ఏది!" చెల్లిని స్వరంతో అడిగాడు.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"అమ్మా! స్వప్న ఏది!" తల్లినే అడిగారు.

"ఇంటి దగ్గర వుంది!'' అంది.


"ఇంటి దగ్గర వుందా!" ఇక్కడికి రాలేదా!

"ఊహుఁ"

అతను లేవబోయి ఆగాడు. ఓహో! బహుశా వీళ్ళంతా యిక్కడ వున్నారని, యింటి దగ్గర ఉంది కాబోలు. అంతే! అదే అయివుంటుంది. స్వప్న అలా వుండగలిగింది అంటే అతనికి ఆశ్చర్యం కలిగింది. దెబ్బలు తగిలిన తనని హాస్పిటల్లో వదిలేసి ఎలా వుండగలిగింది! అతనికి చాలా ఆశ్చర్యంగా వుంది.

సాయంత్రానికి అతను లేచి కూర్చో గలిగాడు. ఇంజక్షన్ చేయటానికి వచ్చిన డాక్టరుతో,"డాక్టర్! నేను ఒక్క అరగంట ఇంటికి వెళ్ళివస్తాను" అన్నాడు. డాక్టరు చిత్రంగా చూసాడు.





ఆ చెట్టుకవతలిదేమో తెలుగు పిక్చర్‌కి!! ఇవతలిది - తమిళ్ పిక్చర్‌కి కేటాయించా!!

"మీకేమైనా మతిపోయిందా! ఈ పరిస్థితుల్లో కదలడం జరగకూడని పని. మీకు జ్వరంకూడా వుంది!"

"ఫర్వాలేదు డాక్టర్. నేను వెంటనే వచ్చేస్తాను" అన్నాడు.

'నో!'

"డాక్టర్ ప్లీజ్. నా శరీరంలో యిప్పుడు భరించలేనంత బాధేంలేదు."అతను లేవబోతుంటే మేనమామ వచ్చి ఆపాడు. "సుధీ! ఏమిటా మొండితనం. డాక్టరు గారు చెప్పింది నీ మంచికోసమే!

"నా మంచేమిటో నాకు తెలుసు మామయ్యా. నేను స్వప్నని చూడాలి ముందు. అతను లేచికూర్చున్నాడు.

"ఎక్కడుందని చూస్తావు నువ్వు!"

"ఎక్కడేమిటి! యింటి దగ్గర.

"ఇంటి దగ్గరలేదు."

"నీకెలా తెలుసు.''


ఆయన జేబులోనుంచి చిన్న ఉత్తరం తీసియిచ్చాడు.

సుధీర్ తీసుకుని చదివాడు.

అందులో యిలా వుంది.

ప్రియమైన మీకు,

నేను ఎంతో ఆలోచించి యీ నిర్ణయం తీసుకుంటున్నాను. నా యీ నిర్ణయం మీకు నచ్చదని తెలిసినా నిర్వర్తించక తప్పడం లేదు. నేను వెళ్ళిపో



తున్నాను. ఎక్కడికి వెళ్తానో ఎలా బ్రతుకుతానో నాకు తెలియదు. కానీ ఒకటి మాత్రం మీకు వాగ్దానం చేస్తున్నాను. నేను ఆత్మహత్య చేసుకోవటం లేదు. చేసుకోను! ఎక్కడో అక్కడ సలక్షణంగానే బ్రతుకుతాను. మీ భార్యగా గడిపిన యీ కొద్ది రోజుల స్వర్గం నాకు వేయి జీవితాలు అయినా ఒంటరిగా బ్రతగ్గలిగే ధైర్యం యిస్తుందనిపిస్తోంది!

నన్ను మర్చిపోండి మీరు. నాపరిచయం ఒక కలగా భావించండి! నా అంత దురదృష్టవంతులు ఎవ్వరూ ఉండరేమో!

నేనువచ్చి మీ జీవితం సమస్యలమయం చేసాను. నా నిష్క్రమణతో మీకు ఆ సమస్యలు తొలిగిపోతాయని ఆశిస్తున్నాను.

మీరు చేయూత యిచ్చినా, అది అందుకో లేని
నిర్భాగ్యురాలు – 'స్వప్న'.

ఆ ఉత్తరం చదవడం పూర్తి అయేసరికి, సుధీర్ చేతివేళ్ళు కంపించసాగినాయి. నుదుటి మీద చెమటలు అలుముకున్నాయి.


"స్వప్నా! స్వప్నా!" అతని పెదవులు అస్పష్టంగా కదులుతున్నాయి. అతను లేచి వెళ్ళబోతుంటే, అహల్యమ్మగారు పట్టుకుంది. డాక్టర్‌ని పిలిపించారు. ఆయన ఇంజక్షన్ చేసాడు. సుధీర్ పెనుగులాడుతూనే వున్నాడు. అతనికి క్రమంగా నిద్ర వచ్చేసింది. తల్లినుంచి విడిపించుకోవాలని పెనుగులాడుతున్న అతని చేతివేళ్ళు క్రమంగా పట్టుతప్పి వదులయినాయి.

నిద్రపోతున్న సుధీర్‌ని చూసి అహల్యమ్మగారు నిట్టూర్చింది. అలసినట్టుగా

వాడినట్టుగావున్న కొడుకు ముఖం చూస్తున్న కొద్దీ ఆవిడ కడుపు తరుక్కు పోసాగింది. ఇదెక్కడి దురదృష్టం. ఎంతో సుఖంగా ఉండాల్సిన కొడుకు జీవితం యిలా అయిపోయింది. ఈ వయసులో ఆవిడకది చెప్పలేని బాధగావుంది. ఇన్నేళ్లు, ఆవిడ సుధీర్‌కి పెళ్ళి అవుతుందని, అతని భార్యా పిల్లల మధ్య తను శేష జీవితం వెళ్ళదీయ వచ్చుననే ఆశతో గడిపింది. తీరా, ఆమె అనుకున్నది ఒకటి అయితే జరిగింది మరొకటి అయిపోయింది. "నా ముఖాన అసలు శాంతిఅనే ఆ రెండు అక్షరాలూ లేనే లేవేమో." అనుకుంది.

స్వప్న వెళ్ళిపోయింది అని తెలిసిఅందరూ నిట్టూర్చారు. అందరికీ హాయిగా అనిపించింది. సుధీర్‌కి తమకి యిక విభేదం, అడ్డుగోడా, లేనే లేదు అనుకున్నారు.

కానీ, కోలుకుంటున్న సుధీర్‌ని చూస్తున్న కొద్దీ అహల్యమ్మగారికి బాగా అర్థం కాసాగింది. అతను మౌనమూర్తి అయిపోయాడు. సుధీర్‌లో ఇదివరకటి చిలిపి తనం మాటకారితనం లేనే లేవు. అతను ఎదురు దెబ్బతిన్న మనిషి, ఆ బాధని బలవంతంగా, బైటవారికి తెలియకుండా, దిగమింగుతున్న వ్యక్తిలా వున్నాడు. ఆ బాధని ఎవరికీ తెలియనీయటం లేదు. ఎవరైన స్వప్నమాట ఎత్తితే "ఆ మాట వద్దు మమ్మయ్యా" అంటాడు. స్వప్నని శారీరకంగా అతనిదగ్గర నుంచి దూరంగా వెళ్ళగొట్టగలిగారు. కాని, అతని దగ్గరవుండి పోయిన స్వప్నని



ఎవరూ విడదీయలేక పోతున్నారు.

సుధీర్ త్వరలోనే కోలుకున్నాడు. అతను మామూలుగానే కోర్టుకి వెళ్ళి వస్తున్నాడు. ఎప్పటిలాగానే నవ్వుతూ, తుళ్ళుతూ వుంటున్నాడు. కానీ అహల్యమ్మగారికి, అతన్ని చూస్తున్నకొద్దీ అది బాధని లోపల దిగమింగి, పైకి మామూలుగా వుండటానికి చేస్తున్న ప్రయత్నంలా కనిపించసాగింది.

తల్లితండ్రులకి వార్ధక్యదశలో పిల్లల సుఖానికి మించిన శాంతి యింకేది వుండదేమో! వాళ్ళు బాధపడుతుంటే, వీళ్ళకి అది, చూడలేక, సరిదిద్దలేక నిస్సహాయంగా అన్పిస్తుంది. అదొక నరక యాతన!

కొన్ని రోజులుంటే సుధీరే మారుతాడేమో, ఆ స్వప్నని మరిచిపోతాడేమోనని ఆమె ఆశ! ఆవిడ విమలతో "బావని ఆబాధ మరిపించలేవామ్మా" అనేవి. "మరిపిస్తానత్తా" అనేది విమల. విమల, సుధీర్ ఒంటరిగా వున్నప్పుడు వచ్చేది. సుధీర్ విమలను చూసి తిరస్కారంగా ముఖం తిప్పుకునే వాడు.

"బావా! స్వప్న ఎక్కడుందో తెలిసిందా?" అంది విమల.

''ఎక్కడా వుండదు! అసలు యీ లోకంలోనే వుండి వుండదు. మీ కెవరికీ యికఎప్పుడూ అడ్డు రాదు. సరేనా!" అతను తీవ్రంగా అన్నాడు. విమల ముఖం చిన్నబోయింది.

"ఎందుకలా కసురుకుంటావు బావా! నేనేమన్నానని! స్వప్నని వెతకటంలో

నువ్వు సరిగ్గా ప్రయత్నించలేదని అంటున్నాను. ఇంత పేరున్న రాయరువి. ఒక అమ్మాయి యింట్లోంచి వెళ్ళిపోతే, ఆ అమ్మాయి ఎక్కడ వుందో, ఆ మాత్రం ఆచూకీ తెలుసుకోలేవా?" అంటున్నాను

"ఏమిటి?"

"నిజం బావా! పేపర్లో వేయించ వచ్చుగా! నువ్వు బాధ పడుతున్నావని తెలిస్తే స్వప్న ఎక్కడున్నా వచ్చేస్తుంది."


అతను తల దించుకున్నాడు. "నాకిష్టం లేదు. నన్ను వదిలి వెళ్ళిపోయింది తను నా మీద కాస్తకూడా ప్రేమ లేదా! ఎవరో ఏదో అంటే నేనేం చెయ్యను? నేనేం తప్పు చెయ్యకుండానే నన్ను శిక్షించింది. బాధ అంటూ కలిగితే, నేను భరించాలి. అంతే!"

"అలా అనకు బావా! స్వప్నకి నువ్వంటే ప్రాణం కాబట్టి, తన మూలంగా నువ్వు బాధ పడకూడదు అనుకుందేమో!"


సుధీర్ చేతుంతో తల పట్టుకుని కూర్చున్నాడు.

స్వప్న వెళ్ళిపోయింది. సుధీర్‌కి యిది చాలా అవమానంగా వుంది! అది తన ప్రేమనే కించపరిచినట్టుగా వుంది!

(సశేషం)







నీతి కథ

మినీకథ


పోలాప్రగడ జనార్దనరావు

నేనాయింటి కొచ్చేసరికి చాల చిన్న పిల్లని. బొద్దుగా తెల్లగా ఉండేదాన్ని. తేరగా వచ్చాను కదా అని యింటాయన నన్ను హీనంగా చూడకుండా ప్రేమగానే చూసేవాడు. నేనూ అన్ని విధాల ఆయనపట్ల గౌరవాన్ని ప్రదర్శించేదాన్ని. ఏడాది ఇట్టే గడిచిపోయింది.

ఎందుకో తెలియదు కాని నాకు కీళ్ళ నొప్పులు వచ్చాయి. బక్కగా చిక్కిపోయాను. ఉన్న అందమంతా అంతమయింది. దాంతో యింటాయనకు నా మీద ప్రేమ సన్నగిల్లింది. గెస్టులు ఎవరైనా వస్తే వాళ్ళ ముందర నన్ను తిరగనిచ్చేవాడుకాదు. ఇదివరకు నా గురించి గర్వంగా నలుగురికీ చెప్పుకునే ఆయనకి నా ఉనికి అసహ్యాన్ని కలిగించడం కనిపెట్టా. డాక్టరి దగ్గరికి తీసుకువెళ్ళడం డబ్బు దండగని మానేసాడు. ఇదే తన కడుపున పుట్టిన బిడ్డకు ఈ వ్యాధి వస్తే వైద్యం చేయకుండావుండేవాడా అని వాపోయేదాన్ని. అయినా నా వెర్రిగాని "పూర్వజన్మ సుకృతం" ఉండాలి అనుభవించడానికి అనుకొని సరిపెట్టుకొని నా బాధ్యత నిర్వహించటంలో నేనెప్పుడూ బద్ధకించేదాన్ని మాత్రం కాదు.

కాలం ఒక్కలావుంటే కథే లేదు.

నా కీళ్ళ నొప్పులు మరీ ఎక్కువ



యాృయి.

ఆ రోజు నా జీవితంలో మర్చిపోలేని రోజు. నా జన్మ చరితార్థకం అవడానికి భగవంతుడు నాకు అవకాశం కల్పించిన రోజు.

సాయంత్రం యింటాయన నన్ను కార్లో షికారుకు అన్నట్టు బయటకు తీసుకువెళ్ళాడు. నాకు ఆశ్చర్యం వేసింది, నా మీద యింత ప్రేమ ఏమిటా అని. ఊరికి దూరంగా తీసుకెళ్ళాడు. ప్రక్కనే కూర్చోపెట్టుకొని ఏవేవో తినిపించాడు. ఆత్రుతతో తింటూ నన్ను నేను మర్చిపోయా.... అంతే! ఒక్కసారి కారు స్టార్టు చేసిన శబ్దానికి తలెత్తి చూశా ....అప్పుడర్థమయింది. పిరికివాడు – నన్ను వదిలించుకుందుకా యింత ప్రేమ ఒలకపోసాడనుకొని నీరసంగా నవ్వుకున్నా. చావలేక బతక లేక కాలం వెళ్ళబుచ్చుతున్నా.


నాకంటూ చరిత్ర వుంటే సువర్ణాక్షరాలతో రాసుకోవలసిన రోజు ఆసన్నమయింది.

ఆ రోజు రాత్రి – కీళ్ళ నొప్పులు బాధతో కీచురాళ్ళు అరుస్తున్నట్టున్నాయి. ఎవడో మనిషి రోడ్డుమీద చచ్చినట్టు పడున్నాడు. దూరంనుంచి ఏదో కారు వెలుతురు దగ్గరవుతోంది. ఒక్కసారి గుండె ఆగిపోయే శబ్దం చేస్తూ ఆగిపోయింది కారు. అంత పెద్ద కారులో ఒంటరిగా ఉన్నాయన మెల్లగా తోరు

మెలకువ గొప్పది !
నిద్ర మత్తులో నిర్మించుకున్న
సౌఖ్యహర్మ్యాలని ధ్వంసం చేసి
స్వప్నంగా మిగిల్చి వెళ్ళే ఆక్షణం - మెలకువ !
చీకటి తటి మధ్య
శూన్యంగా వుండే ప్రపంచాన్ని
దృశ్యంగా మలచి
చూపు ప్రసాదించి వెళ్ళే ఆ కిరణం - మెలకువ !
నాగలి చాళ్ళలో పీనుగులా పడివున్న విత్తు
వేళ్ళుతన్నుకుంటూ మొలకెత్తడం - మెలకువ !
బావిలో బంధించబడి
నిశ్చలనంగా బతికిన నీళ్ళు
బయటికి పాకి పొలాల మధ్య వరిగెత్తడం - మెలకువ !
మెలకువ గొప్పది.
మెలకువతో వెలిగే దీపం చూపు గొప్పది !
మెలకువ చూపుకి,
అరచేతిమీద కాయకాసిన రక్తం
ఇంకా మొలవని విత్తులా -
మెలకువ చూపులో అయితే,
చెక్కిళ్ళమీద ఆగిపోయిన కన్నీటి చుక్క
ఇంకా అంటుకోని అగ్గిపుల్లలా గుంటుంది !

నందిని సిధారెడ్డి — మెలకువ!







తెరచుకొని ఒగి రోడ్డుమీద పడున్న మనిషి దగ్గరకు వచ్చి చూపుడు వేలు ముక్కుదగ్గర పెట్టి చచ్చాడో బతికాడో పరీక్ష చేస్తున్నాడు.... ఆ ఆయన మరెవరో కాదు నా బ్రతుకుని పూరికి దూరంగా ఒంటరిగా వదిలేసిన మహానుభావుడు. ఒక్కసారిగా నా ఆలోచనలకి అంతరాయం కలిగింది. క్రింద పడున్న మనిషి నా మాజీయజమాని కాలరు పట్టుకొని కత్తిచూపిస్తూ ఈజీగా డబ్బు గుంజడానికి ప్రయత్నిస్తున్నాడు. చంపడానికైనా వెనుకాడని వాడిలా భయంకరంగా బలంగా వున్నాడు ఆ దొంగ. వెంటనే నాలో ఘర్షణ ప్రారంభమయింది. నేనంటూ ఏదైనా సాయం చేయగలనా అని. మళ్ళీ అసలు నేనెందుకు సాయం చెయ్యాలనిపించింది. కాని వెంటనే నా జాతి నెత్తురు నన్ను మేల్కొలిపింది. నాలో నరనరంలో బలాన్ని పూరించింది. అసలు సాయం చెయ్యాలన్న ఆలోచనవల్లే యింత ఆరోగ్యం వచ్చింది. నిజంగా సాయం చెస్తే నా జన్మ తరిస్తుందనుకుంటూ బలంగా, కీళ్ళులేని కాళ్ళ ఈడ్చుకుంటూ అక్కడికి వెళ్ళా. ఊపిరిని గట్టిగా పీల్చుకొని ఓపికను మరింత ఒడిగట్టుకొని ఘోరంగా అరుస్తూ ఆ దొంగ కాలిని బలంగా నా యిష్ట మొచ్చినట్టు కొరకడం మొదలెట్టా. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనతో ఆ దొంగ కంగారు పడ్డాడు. నా జన్మ సార్థకమయింది, అంతే నాకు గుర్తుంది...!

"టామీ! టామీ!" అంటూ బక్కచిక్కి ఘోరంగా చచ్చిపోయిన కుక్క దగ్గర ఏడుస్తూ, దాని విశ్వాసాన్ని మంచితనాన్ని చచ్చిన తరువాత గుర్తించాడు, తన జాతి లక్షణంగా ఆ బ్రతికున్న మనిషి. ❋

ఇలా చూస్తే యీ దృశ్యం
అతి ఘోరంగా వుందండీ!
దీన్ని కట్ చేసేద్దాం!!



కెమేరా మాన్ చాలా పొడుగు మనిషి!
అంచేత యీ సినిమాలో అన్నీ టాప్ ఏంగిల్
షాట్లే !!!





కొత్త పుస్తకంతో కొంతసేపు

చైనాయానం - శ్రీ శ్రీ
ప్రచురణ : స్వాతి పబ్లికేషన్స్,
ప్రతులకు : నవయుగ బుక్ సెంటర్
ఏలూరురోడ్, విజయవాడ-2
వెల: ఏడురూపాయలు.

1976 డిసెంబరు 7వ తేదీనుండి 27వ తేదీదాక ఇరవై ఒక్క రోజులపాటు చైనాలో పర్యటించి వచ్చిన శ్రీ శ్రీ అక్కడ తాను విన్నవీ కన్నవీ తన జాతి జనులకు వినిపించటానికీ, చూపించటానికీ చేసిన ప్రయత్నంగా వెలువడ్డ పుస్తకం యిది.

ఇందులో మొదటి పదమూడు పేజీల్లో పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు 'ప్రదక్షిణం' పేరుతో వ్రాసిన నాలుగు పేజీల ఉపోద్ఘాతం మినహాయిస్తే శ్రీమతి ఈశ్వరిగారి ఉత్తరాన్ని ప్రస్తావిస్తూ శ్రీ శ్రీ వ్రాసిన ఐదు పేజీలకు అసలు ఆయన చైనాయానానికి అట్టే సంబంధంలేదు.

చైనా ప్రభుత్వం, ఖర్చుమీద విదేశాలతో స్నేహానికి చైనా ప్రజల సమాఖ్య (Chinese people's Association for friendship with foreign countries) అనే సంస్థ ఆహ్వానిస్తే కోట్నిస్ మెమోరియల్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొనబోతున్న భారత ప్రతినిధివర్గంలో నాల్గవ సభ్యుడుగా మహాకవి శ్రీ శ్రీ 1976 డిసెంబరు 6వ తేదీ రాత్రి పెకింగ్‌లో విమానం దిగారు. "చీనా ప్రజలు విముక్తి సాధించటానికి పూర్వం, ఆ దేశానికి వెళ్ళి, అయిదు సంవత్సరాలుగా అయిదు సామ్రాజ్య వాదాలతో పోరాడుతున్న చీనా సైనికులకు వైద్యసహాయం చేస్తూ, తన ఆరోగ్యాన్ని సహా లక్ష్యపెట్టకరేయింబవళ్ళు నిర్విరామంగా పనిచేస్తూ తన 34వ యేట, డిసెంబరు 9వ తేదీ 1942లో డాక్టర్ కోట్నిస్ మరణించారు. చీనా ప్రజలు కోట్నిస్‌ను తమ అభిమాన భారతీయ మిత్రునిగా పరిగణించారంటే ఆశ్చర్యంలేదు. ఆ అభిమానానికి ప్రతిబింబమే డాక్టర్ కోట్నిస్ స్మారక మందిరం" (పుట: 36).

శ్రీ శ్రీ చైనాయానం

'హోపే' (HOPEI) రాష్ట్ర ముఖ్యపట్టణమైన 'షీచియాచాంగ్' (Shihchia Chuang) నగరంలో, ఇరవై ఎకరాల విశాల ప్రదేశంలో భారతీయ మిత్రుడు డాక్టర్ డి. యస్. కోట్నిస్ స్మారక భవనం నిర్మించారు. 9-12-76 ఉదయం 9 నుండి 12 గంటలదాక జరిగిన ఆ స్మారక మందిర ప్రారంభోత్సవంలో పాల్గొనటానికి భారత దేశం నుండి ఆహ్వానింపబడ్డ పదిమందిలో శ్రీ శ్రీ ఉండటం నిజంగా తెలుగు జాతి గర్వించదగ్గ విషయం.

ఆ విధంగా ఆహ్వానింపబడి చైనా వెళ్ళిన అఖిల భారత డాక్టర్ కోట్నిస్ మెమోరియల్ కమిటీ ప్రతినిధివర్గం నెలకుపైగా ఆ దేశంలో పర్యటిస్తూ వుంటే, మధ్యలో మానుకొని ఇరవై రోజులకే శ్రీ శ్రీ తాను ఒక్కడూ భారత దేశానికి తిరిగి వచ్చేశాడు. ఇలా తిరిగి రావటం పొరపాటని తరువాతి సంఘటనలు స్థిరపరిచాయని శ్రీ శ్రీ చెప్పటం ఆయన నిజాయితీకి నిదర్శనంగా వున్నా సమర్థనీయంగా లేదు. అది ఆయన వ్యక్తిగత విషయంగా భావించి వదలి వేయవలసిందే.

పెకింగ్ హోటల్ పద్దెనిమిది అంతస్తులది. అయిదో అంతస్తులో నలభయ్యవ నంబరు గదిలో శ్రీ శ్రీ బస. డిసెంబరు ఏడవ తేదీనుండి మొదలయిన తన పర్యటన విశేషాలను చెబుతూ శ్రీ శ్రీ వ్రాసిన ఈ చైనాయానంలో ఆయనతోపాటు పాఠకులు చైనా చక్రవర్తుల భవనాలనూ, ఆప్టికల్ పరికరాల ఫ్యాక్టరీని, - అక్కడి కార్మికుల జీతభత్యాల వివరాలతో సహా - చూస్తారు. తెలుసుకుంటారు. చైనాలో మారుమూల ప్రాంతాల్లోని గ్రామీణ జనాలకుకూడా వైద్యసౌకర్యాలు ఎంత చక్కగా అందుతున్నాయో వింటే ఆశ్చర్యమూ ఆనందమూ కలుగుతాయి. వైద్యుడు రోగి దగ్గరకు వెళ్ళాలన్న మానవతాదృష్టిగల నార్మన్ బెతూన్ సుభాషిత సిద్ధాంతం అక్కడ ఆచరణలో ఎంత నికార్సుగా అమలు చేయబడుతున్నదీ చూస్తే ఒళ్ళు పులకరిస్తున్నది. చైనా మొత్తంలో వైద్య సదుపాయం ప్రతి ఒక్కరికీ ఉచితమట. మంచినీరూ, విద్యుత్తూ కూడా ఉచితంగానే సరఫరా అవుతాయిట. ఇంత ఆశ్చర్యకరమైన ప్రభుత్వ వ్యవస్థలో పాఠకులను కాసేపు ఈ 'చైనాయానం'ద్వారా తిప్పుతాడు శ్రీశ్రీ. 1949లో విమోచనం పొందిన చైనా జాతీయులు, పాతిక ముప్పై సంవత్సరాల్లో ఎంత అభివృద్ధిని సాధించి ఉన్నత స్థాయినందుకున్నారో శ్రీ శ్రీ ఆయా విషయాలను చెప్పేటప్పుడు వ్యాఖ్యాన ప్రాయంగా కూడా తెలియజేస్తుంటాడు.


చైనా ఇంతటి సర్వతోముఖాభివృద్ధిని సాధించటానికి ఒకే ఒక కారణాన్ని శ్రీ శ్రీ చెబుతున్నాడు "యే దేవుడి గుళ్ళనీ చీనావారు నాశనం చెయ్యటం లేదు, మానవుడి ఈతిబాధలన్నిటికీ మానవాతీతమైన కారణం ఉందనే భావాన్ని నాశనం చేశారు" (పుట: 61) అదీ అసలు కారణం.

ప్రపంచంలోని ఎనిమిది వింతల్లో ఒక వింత గ్రేట్ వాల్ ఆఫ్ చైనా: దాని పొడుగు రెండు వేలమైళ్ళు. అంత గోడను కట్టిన మహాజన సంతానమే ఈ నాడు చైనాను ప్రపంచ అగ్రరాజ్యంగా పునర్నిర్మిస్తున్నది. చైనాలో చూడవలసిన దృశ్యాల్లో చక్రవర్తుల సమాధులు కూడా చేరివుండటం విశేషం.

చైనాలో ఆశ్చర్యకరమైనవి భూగర్భ విమాన దాడుల రక్షక శిబిరాలు (Under ground ajr rajd shelters). అణుయుద్ధ ప్రమాదం ముంచుకు వచ్చినప్పుడు ప్రజానీకాన్ని కాపాడటానికి చైనా ప్రభుత్వం పెకింగ్ నగరం కింద పాతాళంలో ఈ శిబిరాలను నిర్మించి ఆప్రమాదాన్ని ఎదుర్కోటానికి సిద్ధంగా ఉంది.

పెకింగ్ యూనివర్సిటీలో సంస్కృతంతోపాటు భారతీయభాషలలో హిందీ ఒక్కటి మాత్రం బోధిస్తారు. పెకింగ్ రేడియో స్టేషనులో దాదాపు అంతా భారతదేశపు జాతీయ భాషగా హిందీని గౌరవిస్తారు. మాట్లడటం వరకూ నేర్చుకుంటారుకూడా "భారతదేశంలో హిందీ తర్వాత అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాష తెలుగనీ, అటువంటి తెలుగు భాషతోకూడా పెకింగ్ రేడియో నుంచి ప్రసారాలు జరగవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉందని అచ్చటి మిత్రులకి నేను నచ్చజెప్పాను. తెలుగుకు రావలసినంత ప్రాముఖ్యం రాకపోవటానికి మన ప్రయత్నలోపమే తప్ప చైనావారి అశ్రద్ధమాత్రం కారణంకాదు" (పు : 60) అంటున్నారు శ్రీ శ్రీ.

షాంఘైలోని మునిసిపల్ జైలును చూసిన శ్రీ శ్రీ నేరాలగురించీ, శిక్షలను గురించి ఆసక్తిదాయకమైన విషయాలను సేకరించాడు. అక్కడి శిక్షా విధానం నేరస్థుణ్ని మంచి పౌరునిగా మార్చటానికి వుద్దేశించినదనీ, అది ఆచరణలో నిరూపితమవుతున్నదనీ శ్రీ శ్రీ వ్రాశాడు. అందుకనే ఖైదీలను (రాజకీయఖైదీలతో సహా) చిత్రహింసలు పెట్టడం జరగదు. కొట్టడమే కాదు., తిట్టడ కూడా ఉండదు. (పుట:77) చైనాలోని సాంస్కృతిక విప్లవ ప్రభావం మానవుల సత్ప్రవర్తనకు ఎంతగానో దోహదం చేసిందనీ అదే ప్రధానంగా దాని వుద్దేశమనీ శ్రీ శ్రీ తాను చూసిన దాన్నిబట్టి చెబుతున్నాడు. సంఘవ్యతిరేక రచయితలను చైనాలో శిక్షించరనీ



వాళ్ళను తీవ్రంగా విమర్శించటమే జరుగుతుందనీ తాను తెలుసుకున్నట్లుగా కూడా శ్రీ శ్రీ వ్రాశాడు.

షాంఘైలో శ్రీ శ్రీ ఆధునిక చైనీస్ సాహిత్యానికి ఆద్యుడైన లూషన్ స్మారక మందిరాన్ని సందర్శించాడు. ఆయన సాంస్కృతిక విప్లవ విజయ సాధనకు తన సాహిత్యంద్వారా పునాది వేశాడనీ, అందువల్లనే మావో ఆయన్ని సాంస్కృతిక విప్లవానికి సర్వసైన్యాధ్యక్షుడుగా అభివర్ణించాడనీ వ్రాశాడు శ్రీ శ్రీ. సాంస్కృతిక విప్లవం గురించి మెచ్చుకొంటున్న శ్రీ శ్రీ ముఖ్యంగా అక్కడి Part work and part study విద్యావిధాన విశేషాలు గమనించి చెప్పి వుంటే ఎంతో బాగుండేది. షిచియాచాంగ్ పరిసరగ్రామంలో ఒక పాఠశాలను చూశాడు గాని అక్కడి విద్యావిధానం గురించి ఆసక్తికరమైన విషయాలేమీ శ్రీ శ్రీ వ్రాయలేదు. పెకింగ్ యూనివర్సిటీ పేరైనావచ్చింది గాని, ఇందులో ప్రసిద్ధమైన లేబర్ యూనివర్సిటీ గురించి ప్రస్తావనైనాలేదు.

ఈయన చైనా యానంలో చైనా రచయితల నెవరినీ ముఖ్యంగా కలుసుకున్నట్లులేదు శ్రీ శ్రీ. 26వ తేదీన ఒక సినీమారచయితనుకలుసుకొన్నాడు గానీ ఏమీ మాట్లాడుకొనే అవకాశమే లేకపోయింది. 16వ తేదీన మాత్రం ప్రతినిధివర్గంతో కలిసి, రెవీ అలీ (Rewj

Alley) అనే కవి ఆతిథ్యాన్ని స్వీకరించాడు, శ్రీశ్రీ "చైనాయానం" అని వ్రాసినట్లే రెవిఆలీ సాంస్కృతిక విప్లవం సాగుతున్న తొలి సంవత్సరాల్లో (1966-71) తాను చైనాలో విస్తృతంగా పర్యటించి తాను కన్నవీ విన్నవీ ఫోటోలతోసహా రికార్డుచేసుకొని వచ్చి 'చైనాలో ప్రయాణాలు'(Travels in china-1973) అనే పుస్తకాన్ని వ్రాశాడు. చైనా జన జీవితంలో అంత సన్నిహిత సంబంధాలు గల ఒక గొప్ప రచయితను తాను కలిసి మాట్లాడినందుకు విశేషాలు వ్రాసి వుంటే ఈ గ్రంధానికి ఇంకా విలువ ఎక్కువై వుండేది. మరొక ముఖ్యమైన విషయమేమిటంటే రెవీ ఆలీ కోట్నిస్ మెమోరియల్ హాలు ప్రారంభోత్సవంలో పాల్గొంటూ, కోట్నిస్ గురించి ఒక పెద్ద గీతంకూడా వ్రాశాడు. (The Freshening Breeze, 1977. P: 83-86) దీనిని గురించి శ్రీ శ్రీ ఏమైనా చెప్పి ఉంటే బాగుండేది.

ఈ గ్రంధాన్ని చదువుతుంటే కొంత వరకు చైనాలో తిరుగుతున్న అనుభూతి కలుగుతుంది ఆ విధంగా ఈ గ్రంధానికి ఒక ప్రయోజనం వుంది.

నా చైనా ఓ చైనా గేయంలో 'విమానం మీద గగనంలో పయనిస్తూ ఈ విశాలభూమిని చూస్తూ వుంటే చీనామాత తన సుదీర్ఘబాహువులను చాచి తన కవలచెల్లెలు భారతమాతను పరిరంభంలోకి తీసుకోబోతున్నట్టుంది" (పుట: 89) అని చెప్పిన దాన్ని బట్టి 'చైనాయానం'లో శ్రీశ్రీ భారతదేశాన్ని గురించి ఒక మహోన్నతమైన భవిష్యత్తును దర్శించాడనిపిస్తున్నది.

ధర కాస్త ఎక్కువే అయినా తప్పకుండా కొని చదవవలసిన పుస్తకం, 'చైనాయావం'.

—కాత్యాయనీ విద్మహే.

సీరియల్



24

సున్నం ప్రారభించి అప్పుడే రెండు రోజులైంది. యింకా మూడో వంతు కూడా పని కాలేదు. సున్నం వెయ్యని గోడలు చక్కగా నల్లగా నిగనిగలాడుతున్నాయి.

వేసినవి నల్లగా లేవు
తెల్లగానూ లేవు.

బూడిద రంగులో ఉన్నాయి.

ఆ గోడలు చూసిన జానక్కి గుండె ఉసూరుమంది. యింత డబ్బు ఎలాగూ అయింది. పోనీ మరోసారి సున్నం వేయిస్తేనో?

"ఏటీయమ్మ అమాకత్త్వం. మసిబొగ్గుని పాలల్లో ముంచితే మాత్తరం తెల్లగా ఒస్తాదేటి? యిలా ఎయ్యగా ఎయ్యగా ఎప్పటికో తెల్లగౌతాయి" అంది నిచ్చెన మీదున్న కూలీ.

"అంతవొరకు యీ గోడలు నిలవొద్దేటి?" సందేహించింది నిచ్చెన కిందున్నది.

వాళ్ళ మాటలతో మరీ బెంగపట్టుకుంది జానక్కి. తను పొరపాటు చేసింది. సున్నం బదులు ఏ కాషాయరంగో వేయిస్తే కొంతైనా కనిపించేది. యిప్పుడు? "నేను సున్నం వేయించేను" మొర్రో అంటే తప్ప ఎవరూ నమ్మరేమో.

యీ లోపుగా తలుపులు చేయించినా బావుణ్ను. కామేశం తన తప్పు లేకుండా మర్నాడే పంపించేడు ఖాళీ తారు పీపాలు. నిన్ననే కబురు చేసిందికూడాను ఎవరైనా కార్పెంటర్ని పంపించమని.

"అనవసరంగా చాదస్తం పడకు. సోఫాలు, డ్రెసింగ్ టేబిల్‌చేసే వాడక్కరలేదు. కర్రకి మేకు కొట్టడం వచ్చినవాడైతే చాలు" అన్నాడు కామేశం.

యివేళో, రేపో రావాలి వాడు.

రేపటివరకూ ఆగలేదు వాడు. వెంటనే వచ్చి ఎదురుగా నిల్చున్నాడు, "తలుపులకి సెక్కలు బిగించాలట. కావేశం బాబంపినాడు" అంటూ.

చింతమానుని నిలువునా కాల్చి అలాగే ఆర్పేసినట్టున్నాడు వాడు.

నల్లటి మొహంలో ఎర్రటి కళ్ళు భయంకరంగా మెరుస్తున్నాయి.

మొలకి మూరెడు గుడ్డ మాత్రం ఉంది. బహుశా అది కొన్న తరువాత ఉతకలేదోమో. మైనపుగుడ్డలా ఉంది. భుజాన చిన్న గుడ్డసంచి ఉంది. అందులో సుత్తి వగైరా సామగ్రి ఉందేమో అనుకుంది జానకి. అంతే కాకుండా వాడ్ని చూసిన జానక్కి "వీడు పీకలు కోసేవాడిలా ఉన్నాడు. కాని తలుపులు చేసే వాడిలామాత్రం లేడు" అనిపించింది.

"యిప్పుడేం అక్కర్లేద" ని పంపించేస్తే?

కావేశం ఏమనుకుంటాడో?

"డోన్ట్‌బి సిల్లీ. మనక్కావల్సింది వాడి పనికాని అందం కాదు. మనం వాడితో వియ్యం అందుతున్నావా?" అంటాడు కాబోలు.

"ఏటి అప్పన్న మావా. యిలాగొచ్చినావు? మాయప్ప నీక్కాడిందా? బొట్టా? బొట్టిడా? కన్నారింటికాడే ఉందా?" అంటూ పలకరించింది సున్నం కలుపుతున్న చిన్నది.

అప్పన్నమావ ఓ సారి తలెత్తి చూసేడు.

చూసి పలకరింపుగా నవ్వేడు.

"ఓస్! పాకలీది పై డమ్మేటి? పోల్సనేదు. ఏటలా అమ్మోరి పండగలో ప్రభనాగ ఎదిగిపోనావు? మీ అయ్య యింక నీకు మనువు సెయ్యడేటి? నేకపోతే సెప్పుమరి ఎగరేసుకుపోతాను" అన్నాడు నవ్వుతూనే.

సున్నం కలుపుతున్న చిన్నది చేస్తున్నపని తాత్కాలికంగా ఆపింది. ఆపి కలుపుతున్న కర్రకి ఆని సత్యభామలా నిల్చుంది. నిల్చుని అప్పన్నమావ వేపు చూసి "ఎదవ బుద్దులు పోనిచ్చుకున్నావుకాదు. నానడిగిందేటి, నువు సెప్పిం దేటి? మనవాడతాట్ట మమవు,. సేతా వాతాగాని వోడి కిద్దరు పెళ్ళాలని" అని కర్ర తప్పున నేలకేసి కొట్టింది.

పిడుగు పడినట్టు నవ్వేడు అప్పన్న.

ఆ నవ్వుకి నిచ్చెన ఓ సారి జారి మళ్ళీ సర్దుకుంది.

పీపాలో సున్నం గబగబ ఉడకడం మొదలెట్టింది.

నల్లటి మొహంలో తెల్లటి పళ్ళు పిడుగు తర్వాత మెరుపులా మెరిసాయి.

"సేతగాక పోవడవేచే సత్తిబామా. మనువైన కాన్నించి ఏటికో యీత యీనతానే వుందికదే మీ యప్ప. బాలంత, సూలింత యిదే వొరస. నువ్వో పాలి మనువాడి సూడకూడదేటి? నీకే తెలుస్తాది. నచ్చకపోతే అప్పుడే ఒగ్గీ" "ఏటా పోకిరి మాటలూ? అమ్మగోరున్నారనన్నా సూపునేదేటి? పోకిరీ ఎదవ

ఏ సాలు" గయ్యిమంది ఆ చిన్నది.

వాళ్లిద్దరూ జానకి ఉనికిని గుర్తించకుండా చాలా హాయిగా సరసాలాడుకోవటం జానక్కి ఎబ్బెట్టుగా అనిపించింది.

తను కలుగచేసుకోకపోతే వాళ్లిద్దరూ అలా సాయంత్రంవరకు కబుర్లు చెప్పుకోగలరు. అంచేత

"నువ్వు తలుపులు చెయ్యగలవా? అల్లదుగో అక్కడున్నాయి. చూడు తార్పు డబ్బాలు, వాటితో రేకు తలుపులు చెయ్యాలి." అంది డబ్బాలవేపుచూపిస్తూ.

అప్పన్న భుజానవున్న సంచితీసి నేలని పెట్టేడు. తలనున్న గుడ్డముక్క ఓసారి దులిపి మళ్ళీచుట్టుకున్నాడు. నేలని పడిన చుట్టముక్కని తీసి దులిపి చెవివెనక పెట్టుకున్నాడు. తరవాత పీపాల పర్యవేక్షణకి వెళ్ళేడు.

ముందు ఆ పీపాలకి ఓ ప్రదక్షిణం చేశేడు.

తరవాత జానకివేపు చూశేడు.

రెండో ప్రదక్షిణం చేశేడు.

యీసారి ఉడుకుతున్న సున్నంవేపు చూశేడు.

తరవాత ఆ పీపాలని కాలితో ఓసారి తన్నేడు.

చేత్తోతట్టి చూశేడు.

తిరిగివచ్చి జానక్కి కొంచెం దూరంగా నేలని కూర్చున్నాడు.

"ఏవింటంటావు?" అన్నట్టు చూసింది జానకి.


ఏవింటో చెప్పేడు అతను.

"మరండి. తవంతో ఉన్నమాట సెప్పుకోవాల. కావాలంటే 'అమ్మగోరూ కస్టంసాల్దు' అని మరో రూపాయి అడుక్కోవాల. అంతేగాని దగా సెయ్యకూడదు—" అన్నాడు ఉపోద్ఘాతంగా.

యీ ఉపోద్ఘాతం జానక్కి నచ్చలేదు.

"తవంకి తెల్దేటండి. ముందు రేకులన్నీ యిడగొట్టాల. తుప్పంతా గోకి పారెయ్యాల. అనక సెక్క బిగించాల."

"బానోయ్. అందుకే నిన్నుపిలవడం. పీపాలా పాళంగాఅడ్డుపెట్టుకుంటే నువ్వెందుకు?" విసుక్కుంది జానకి.



జానకి విసుగుదల అప్పన్ననేం బాధించలేదు. తనలాంటివాళ్ళ మాటలకి అమ్మగారిలాంటి వాళ్ళు విసుక్కోవడం అతి సహజం అన్నట్లు ఊరుకున్నాడు. తను కూర్చున్నస్థలాన్ని ఓసారి మళ్ళీ దులిపేడు. అతను అ, ఆలు చదువుకోలేదు. అయితే ప్రపంచాన్ని అతి క్షుణ్ణంగా చదివేడు. చదవడమేకాకుండా టీకా, తాత్పర్యంతో సహా అర్థం చేసుకున్నాడు.

అంచేత జానకి విసుగు పోవడానికి కొంత టైమివ్వదల్చుకున్నాడు.

"ఒలే! ఎలపీదిగుంటా? ఏటా రాయడం? అదేం గోడకి సున్నం అనుకున్నావా? మొకానికి పగుడరనుకున్నావా? కుసింత గట్టిగా రాయి. గోడకి నెప్పెట్టదులే." అన్నాడు సున్నం రాస్తున్న అమ్మడితో.

సున్నం రాస్తున్న అమ్మడికి సర్రుమంది. "నువ్వొచ్చిన పని సూసుకోక నీకెందుకు యీ ఊసులన్నీ? అడారి సన్నాసినాగ. ఆ మొకం సూడు. ఆరిపేసిన సుట్టముక్కనాగ ఎలాగుందో" యీసడించింది అమ్మడు.

వాళ్ళ సరస సంభాషణ జానక్కి నచ్చలేదు, అంచేత "యింతకీ ఏమివ్వమంటావో చెప్పలేదు నువ్వు" అంది.

బుర గోక్కున్నాడు అప్పన్న. అక్కడేం తగల్లేదు. నేలని చేత్తో ఏదో రాసేడు. తరవాత "తవఁకి తెల్దేటండి" అన్నాడు.

"నాకు తెలీక్కాదు. నీకు ఎంత కావాలో అడుగు. మాకు యిష్టముంటే చేయిస్తాం. లేకపోతే లేదు." అంది జానకి లౌక్యంగా. నిజానికి ఎంత యివ్వాలో జానక్కి తెలీదు.

"మరండి. ముందు డబ్బావి రేకు సెయ్యాల్నా .. తారంతా గోకాలా—"

వీడు క్రితం జన్మలో కథలురాసి ఉండాలి. చదువొస్తే యీ జన్మలో కూడా కార్పెంటరు కాకుండా కథకుడు అయ్యేవాడు. కాకపోతే కథ అరుపేజీలైతే, ఉపోద్ఘాతం అరవై పేజీలుండేది 'బెర్నార్డ్‌షా' లాగ.

"చూడు బాబూ. నువ్వేం చేస్తావో నాకు తెలీదు. నాక్కావల్సినవి తలుపులు. నీక్కావల్సింది డబ్బు. కర్ర, మేకులు వగైరా అన్నీ కలిపిచెప్పు. బేరం ఆడకుండా ఖచ్చితంగా చెప్పు" అంది జానకి. "మరలాగైతే ఓ యాభై యిప్పించండి. కావేశంబాబు సెప్పినాడుకాని నేపోతే కిట్టదండి మరి" అన్నాడు కన్సెషను చూపెడుతున్నందుకు గర్వంగా.

జానకి బుర్ర గోక్కోలేదుకాని చుట్టూచూసింది. నిజానికి యాభై రూపాయలు ఎక్కువో, తక్కువో తనకి తెలీదు. కాని యిప్పుడు వీడు కాదంటే మళ్ళీ మరోడ్ని వెతకాలి. మళ్ళీ కావేశాన్నే బతిమాలాలి. యిన్నివేలుపోగాలేనిది యింక యీ యాభైకి కక్కుర్తిపడ్డం అనవసరం అనుకున్న జానకి ఒప్పేసుకుంది.

"రెండు మూడు రోజుల్లో మాత్రం అయేటట్లుచూడు" అంది.

అప్పన్న లేచేడు.

లేచి తలగుడ్డతీసి ఓసారి దులిపి మళ్ళీ కట్టుకున్నాడు. తరవాత "అయ్యబాబోయ్ రేపు మాపటేలకియిచ్చినేటండి" అని అభయం యిచ్చేడు. "మేకులవీ కొనాల అందాకా ఓ యిరవైవుంటే యిప్పించండి" అని యిరవై తీసుకొని వెళ్ళిపోయేడు.

(సశేషం)

మనసు సంగతి

డా॥ జయా నాగరాజ్

ఆయన యింజినీరు. భిలాయ్‌లో పనిచేస్తున్నాడు. పెళ్ళి అయింది. ముగ్గురు పిల్లలు. ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు, తండ్రి పోవడం తమ్ముడి చదువు, తల్లి పోషణ అన్ని ఒకేసారిగా మీద పడ్డాయి. డబ్బుకోసం కొంత కక్కుర్తి పడవలసి వచ్చింది. అది అతనితో పని చేసే యింజినీర్లు నేర్పారు. "ఇదంతా మామూలే....అందరూ చేస్తున్న పనే ... మడి కట్టుకు మార్చుంటే లాభంలేదు ... దీని వలన ఎవ్వరికీ నష్టం లేదు; వెర్రి మొర్రి ఆదర్శాలు పట్టుకు వ్రేలాడకు..." అని హితబోధ చేశారు.. పరిసరాల వత్తిడి—తన బాధ్యత-అన్నీ కలిసి తన వ్యక్తిత్వానికి నచ్చనిది—అంతవరకూ ఎప్పుడూ చేసి ఎరగని పని చేయాల్సి వచ్చింది—మనసు బాధతో మూల్గింది. "తప్పు చేస్తున్నావని" హెచ్చరించింది—"జాగ్రత్త!" అన్నది కాని మనసును పక్కకు నెట్టి తన పని చేసుకుంటూ పోయాడు—

పేపరు చదువుకుంటున్నాడొక రోజు రాత్రి వేళ—ఈదురుగాలి—దూరంగా ఉరుముతోంది. కుక్కలు అరుస్తున్నాయి. సన్నగా తుంపర్లుకూడా పడుతున్నాయి- వీధిలో సవ్వడేమీ లేదు— వున్నట్టుండి కిటికీలో నుంచి "నువ్వు చేస్తున్న పనులన్నీ మాకు తెలుసులే" అన్నాయి— నిదానంగా, తగ్గు స్వరంతో నాలుగైదు గొంతుకలు! ఎవ్వరా అని వులిక్కిపడి కిటికీలో నుంచి తొంగి చూశాడు-బయట అనంత శూన్యం తప్ప మరేమీ కనిపించలేదు—కొంచెం చలించినా మరల చదువు కొనసాగించడం మొదలు పెట్టాడు — మరల అగొంతుకలే "అదను కోసం చూస్తూ వున్నాము. యిప్పుడుచిక్కావు-ఇకనిన్ను వదలం" అన్నాయి "బయటకిరా కొంచెం పని వుందినీతో-" అని

దయ్యాలు అతని వెంట పడ్డాయి!


ఆ స్వరాలుపిచిచాయి. ఆగలేక, రమ్మని పిలుస్తున్న గొంతుకలను అనుసరిస్తూ స్కూటరు మీద చాలా రాత్రి వరకు తిరిగి తిరిగి అలసి సొలసి యిల్లు చేరాడు—అలసిన శరీరానికి నిద్ర పట్టేది. కానిరాత్రంతా నిద్రలోవులిక్కి-పడుతూనే వున్నాడు— "మేమిక్కడే వుండి నీచర్యలు కనిపెడు తున్నాము" అని ప్రతి కిటికీలో నుంచి మాటలు వినిపించేవి—అతని ప్రతిపనిలో కల్పించుకుంటూండేవి "మేమున్నాము" అంటూ వేధించుకు తింటూండేవి. ప్రతికిటికీలో నుంచీ వివిధ స్వరాలతో, హిందీ తెలుగు భాషలలో మాట్లాడుతూ దెప్పిపొడుస్తూ, తిండి తిననీక, పనిచేసుకోనీక, నిద్ర పోనీక అతనిని బెంబేలు పరిచాయి—కొంతసేపు, దగ్గరగా—కొంతసేపు దూరంగా వుండి గుసగుసలాడుతూ, మేము చెప్పినట్లు చేయమని ఆదేశిస్తూ—అయన భయపడి బాధపడుతుంటే నవ్వుతూ వెక్కిరిస్తూ ఆయనను కృంగ దీశాయి. ఎవరో స్నేహితుల సలహామీద భూత వైద్యుని కడకు వెళ్ళేడు. ఇంజనీరింగు పనులలో తిరుగుతూ గతంలో ఆయన ఒక పురాతన స్మశాన వాటిక త్రవ్వించాడనీ-అక్కడి పిల్లదయ్యాలన్నీ ఆయనను పట్టుకున్నాయని చెప్పి తాయత్తు కట్టాడు-ఖిల్లాయ్ రాగానే దెయ్యాల గొడవ మామూలే-! ఇల్లు మార్చమనీ, ఆది వాస్తు ప్రకారం కట్ట లేదని సలహా యిచ్చారు- "ఆఫ్పో యిల్లు మారుస్తే మాకు తెలియదా మేము రాలేమా" అని నవ్వు కుంటూ అతని వెంట కొత్త యిల్లు చేరుకున్నాయా దెయ్యాలు—కడకు పుస్తకం చదువుతున్నా పేపరు చదువుతున్నా ఆయనను కాదని తమ కండ్లు పెట్టి చదవడం మొదలు పెట్టాయి, ఆ చదవనేర్చిన దెయ్యాలు! ఇక వుండలేక ఉద్యోగానికి సెలవు పెట్టి వూరువదలి స్వగ్రామం వచ్చాడు—ఆయన కన్నాముందే ఆ వూరుచేరి యింజినీరు గారికి స్వాగతం పలికాయి దయ్యాలు, వాటి పెంకెతనం చెలగాటం మరీ ఎక్కువయింది—భార్యకు గొలుసెందుకు చేయించావని-పిల్లలకు కొత్త బట్టలు ఎలా తెచ్చావని-చెల్లాయికి అంత కట్నం యిచ్చి పెండ్లి చేయాలను కోవడం ఏమి చూసుకొని అనీ—మళ్ళీ యే అవినీతితో డబ్బు తెస్తావు అనిసొంత విషయాలలో చొరవ తీసుకొని అడగడమే కాకుండా "అలా చేయకు ఇలా చెయ్యి" అని ఆదేశించడం మొదలు పెట్టాయి—మిగతా కార్యక్రమాలన్నీ సక్రమంగావున్నాదెయ్యాల సతాయింపు మాత్రం ఆయన తట్టుకోలేకపోయాడు. బావమరిదిడాక్టరు-ఆయన మానసిక శాస్త్ర వేత్తకు చూపించారు. మనసులో మంచి చెడ్డల మధ్య జరుగుతున్న సంఘర్షణ—పరిస్థితుల ప్రేరేపణ వలన చేసిన చెడ్డ పనులు వత్తిడి-

మనసు పై దాడి చేశాయని—వ్యవహారిక ప్రేరేపితమనసు (conscious) విచక్షణారహిత మైనమనస్సు (discriminating faculty of mind) అంతరంగికపు మనసు (Subconscious) మధ్య జరుగుతున్న పోరాటమే అతనికీ దెయ్యాలకీ మధ్య జరుగుతున్న పోరాటమని తేల్చిచెపుతూ, అతని మనసును అకట్టుకొని అన్ని సంగతులూ తెలియ జేశారు మానసిక శాస్త్ర వేత్త (Psychotherapy). మనస్సు సేద దీర్చుకొని వక్రమార్గాలు విడిచి పెట్టి సక్రమంగా పనిచేసే విధానంలో పడిన తరువాత తమ ఆటలు సాగవని తెలుసుకున్నయేమో ఆ "చిలిపి దయ్యాలు" ఇంజనీరుగారికి ఆతరువాత వినిపించడం మానేశాయి!

రజకుల చిన్నది - మోసపోయి మనసు విరిగి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని—కోరికలు తీరలేదు గనుక తప్పనిసరిగా దెయ్యమయి కూర్చుంది! పని చేస్తున్న కంపెనీలో

కానిపనేదో చేసి భయపడివచ్చిన రమణను ఆ ఆడదయ్యం పట్టుకుంది. ఆ తరువాత, సరిగ్గా సాయంత్రం డ్యూటీకి పోవలసిన సమయానికి వచ్చి పట్టేది- దాంతో రమణ ఆడ గొంతుకతో కీచుగా మాట్లాడే వాడు- ఆ దెయ్యం తనకు కావలసినదంతా తెప్పించుకు తింటూ అందరినీ బెదిరిస్తూ రమణను ఆడిస్తూ రాత్రంతా వుండి తెల్లవారగానే వెళ్ళిపోయేది— రమణ సొమ్మసిల్లి పగలంతా పడుకునే వాడు— భూత వైద్యుడొకడు వచ్చి యింట్లోనే మకాం పెట్టాడు —— పూజలు— పురస్కారాలు తావీజులు, దస్తావేజులు, తీర్థాలు ప్రసాదాలూ అన్నీ చేసి.... ఇల్లు వొళ్ళు గుల్ల చేయించి 'రజక భూతం' పకపక నవ్వుతూ వుంటే వున్నదంతా చేజిక్కించుకొని ఎవ్వరికి చెప్పా చేయకుండా వెళ్ళిపోయాడు — భూతవైద్య శిరోమణి. చేసేదిలేక మానసిక వైద్యానికి భూతం లొంగుతుందేమోనని రమణను మానసిక రోగ నిపుణునివద్దకు తీసుకు వెళ్ళారు.

రమణకు అతి కష్టంమీద, లంచాలిచ్చి ఉద్యోగం సంపాయించారు. కొంతకాలం బాగా గడిచింది. పని చేస్తున్నచోట ఒక ఆడ కూలీతో పరిచయం. - జరగరానిది జరిగింది. ఆ అమ్మాయి తరఫు వారికి తెలిసింది. ఆవిడ తాలుకు వారంతా 'చంపుతామని' బెదిరించారు. డ్యూటీకి వస్తూవుంటే దారికాచి పరిష్కారమార్గం చూడకపోతే అంతు చూస్తామన్నారు. రమణ బెదిరిపోయాడు — అసలే కూలినాలి జనం- చెప్పింది చెయ్యక మానరు — తానా బ్రాహ్మణుడు. ఎటూపాలు పోలేదు — ఉద్యోగానికి సెలవు పెట్టి స్వగ్రామం వచ్చేశాడు — రమణ మానసిక క్షోభకి రత్తమ్మ దయ్యంతోడుగా దొరికింది. నిత్యజీవితంలో భూత ప్రేతాలున్నాయనే విశ్వాసం మానవ జీవితంతో చెలగాటమాడడం కద్దు. దీనిబారి నుండి తప్పించుకోవడానికి కావలసింది మానసిక శాస్త్రవేత్తల అండదండలు కాని, భూతవైద్యుడి వాతలు తేలేట్టు కొట్టే వేప మండల దెబ్బలు కాదు.



బ్రహ్మయ్యగారు

మల్లెలు తెలుపనీ
పంచదార తీపనీ
బ్రహ్మయ్యగారు
ఎడిటరనీ
ఎవరు, ఎవరికి చెప్పాలి ?
ఎవరెస్టు శిఖరం ఎత్తనీ
కృష్ణా, గోదావరీ నదులనీ
మేరు పర్వతం
పర్వతనేని బ్రహ్మయ్యగారనీ
ఎవరు, ఎవరికి చెప్పాలి ?
తల్లి హృదయం వెన్నముద్దనీ
చంద్రకాంతి చల్లననీ
: హృదయులు
బ్రహ్మయ్యగారనీ
ఎవరు, ఎవరికి చెప్పాలి ?
ఎందరి
వెలుగు కోసమో
కరిగిపోయిన
కొవ్వొత్తి
బ్రహ్మయ్యగారని
ఎవరికి చెప్పాలి ?
నేను
ఎవరికి చెప్పాలి ?

—పర్వతనేని గంగాధరరావు

మశూచి వ్యాధి తెలుపండి

— ఇచ్ఛాపురపు రామచంద్రం

ఎండ మండి పోతూంది.

నీడలేని రోడ్డుమీద - గుడ్డలేని వీపు మోసుకుంటూ, కరుగుతున్న తారు రోడ్డు మీద దిక్కు తోచకుండా తిరుగుతున్న నూకరాజుకి; భగ భగ మండే గాడి పొయ్యిలో నడక నేర్చుకుంటూ కాళ్ళు కొరకంచులు చేసుకుంటున్నట్లే ఉంది. ఐనా నడుస్తూనే ఉన్నాడు నీరసంగా.

అతన్ని - వేసవి ఎండకంటే మండించే మంటలనేకం ఉన్నాయి. అతని గుండె మండుతూంది. ఆకలితో కడుపు మండుతూంది. బాధ్యతలను తలుచుకుని - నిస్సహాయతతో అతని మనసు మండుతూంది.

ఇరవయ్యేళ్ళ నూకరాజుకి -

అమ్మఉంది. అయ్యున్నాడు. బావలు తన్ని తగిలేసి వదిలేసిన అప్పలున్నారు. బావల్లేని చెల్లెళ్లున్నారు. తమ్ముళ్లున్నారు. బుర్రలు లెక్కేస్తే ఎనిమిదౌతాయి. ఆ బుర్రలకి చెట్టుతొర్రలంతేసి నోళ్లున్నాయి. ఎటొచ్చీ ఆ నోళ్లకి బువ్వేలేదు. నూకరాజుకి లేనివి చాలా ఉన్నాయి.

తినడానికి కూడులేదు. ఉండడానికి గూడులేదు. కట్టడానికి మరో గుడ్డ ముక్కలేదు. చెయ్యడానికి పని (దొరకడం) లేదు. ఈ మనుషుల సంగతేమిటో వాడి కెంతకీ అంతు బట్టడంలేదు. అడుక్కోబోతే - 'దుక్కలా ఉన్నావు. పోయి పన్జేసుకోలేవూ?' అంటారు. పనిమ్మంటే యివ్వరు. అతనికి - తనవాళ్లందరికీ 'ఓ పూటయినా నోటినిండా గెంజో అన్నమో పొయ్యాలని' తాపత్రయం. వాడి గుండెలమీద ఆ కుటుంబం బరువంతా ఉంది. అది మొయ్యలేక వాడు కుయ్యోమంటున్నాడు. కుర్రగాడిదమీద వెర్రి బరువులా వాడిమీద వాడి కుటుంబం బరువు.

ఎప్పుడో చదివిన మూడో క్లాసు.... ఏపుగా పెరిగిన వొళ్లు.... ఏదీ యింత తిండి పెట్టలేదే అని వాడు తెగయిదయి పోతూ, పని దొరుకుతుందేమో అని పొద్దుటినుంచీ చెడతిరుగుతున్నాడు. పని మాత్రం దేవుడిలా - కనపడకుండా పోతూంది.

ఉన్నవాళ్ళు ఏ. సి. లో ఎంజాయి



చేస్తుంటే — లేనివాళ్ళు ఎండకో యాతన పడుతున్నారు. వట్టి కాళ్ళతో.. వొట్టి గుండెతో.... వొట్టి కడుపుతో తిరిగి తిరిగి — ఒకచోట ఆగిపోయాడు. అక్కడ కొంచెం నీడగా ఉంది, ఎదురుగా మున్సిపల్ ఆఫీసుగోడ ఉంది. దానిమీద తలకాయంతేసి అక్షరాలతో ఏదో ఎర్రగా వ్రాసి ఉంది.

చదువు నేర్చుకునే వాడు సినిమా స్లయిడ్స్ చదవాలని కుతూహలపడ్డట్టు వాడా పెద్ద అక్షరాలు చదవాలని సరదా పడ్డాడు. అందుకు కారణం - వాడికి పనిలేక పోవటం. తరువాత .... వాడికి తను ఆ ఎర్ర అక్షరాలు చదవగలడో లేడో తేల్చుకు చూడాలనిపించడం.

కష్టపడి .... ఒక్కో అక్షరమూ చదివాడు - చాలాసేపటికి "మశూచి వ్యాధి తెలుపండి". తెలిపితే? అనుకున్నాడు. కింది అక్షరాలలో జవాబు దొరికింది. "వెయ్యి రూపాయలు గెలవండి."

మునిసిపాలిటీవాళ్ళ భాషనీ, భావాన్నీ సరిగానే గ్రహించగలిగాడు నూకరాజు. వాడికేదో అనుమానం వచ్చినట్లయింది. మళ్ళీ చదివాడు. నిజమే అని నమ్మకం కుదిరినట్లు అక్షరాలవంక చూస్తూ తల పంకించాడు.

వెయ్యి రూపాయలు! దెబ్బకి దరిద్రం తీరిపోతుంది.

నిజానికి, వెయ్యి రూపాయలంటే ఎంతో సరిగ్గా వాడికి తెలియదు. ఎక్కువ అని మాత్రం తెలుసు. వాడి కనిపించింది- ఎయ్యి రూపాయలంటే—రెండు పూటల కాదు ముప్పూటలా ముద్ద తినొచ్చు. చెట్టుకింద నుంచి చుట్టు గుడిసెలోకి మారొచ్చు. చిరుగుగుడ్డలు మానేసి సిల్కు గుడ్డలు కట్టొచ్చు. ఏ టీ బడ్డీయో పెట్టుకుని హాయిగా బతకొచ్చు. ఎయ్యి రూపాయలంటే-ఒకటేటి? లచ్చ జెయ్యొచ్చు.

మశూచమంటే ఏంటి చెప్మా? ... అమ్మోరు... పెద్దమ్మోరు ... పెద్దమ్మోరున్నయిల్లు చెబితే ఎయ్యి రూపాయలు!...నిజంగా యిస్తారా? ఇస్తారు. ఎందుకివ్వరు? అంతలేసి అక్షరాల్లో రాశారు కదా?

నూకరాజు నీరసం ఎగిరిపోయింది. ఓపిక వచ్చేసింది. ఉరికేశాడు-మంటలాంటి మండుటెండలోకి. ఇక వాడికి వొళ్ళు తెలియదు.

మశూచి వ్యాధి మోహినీ, వెయ్యి రూపాయలూ సుధాభాండమూ అయ్యాయి వాడి పాలిట. వీధులన్నీ తిరిగాడు కాళ్ళరిగేలా. జ్ఞానోదయం అయింది. జబ్బులు. వీధుల్లో ఉండవు. గుడిసెల్లో-డబ్బులేని గుడిసెల్లో ఉంటాయి. వాడు మురికి వాడల వేపు పరుగెత్తాడు. వాడి మతి ఎప్పుడో స్తిమితం తప్పింది. వాడు మశూచి మంత్రం జపిస్తున్నాడు.

వ్రతం వెర్రిలో పడి ఫలం మరచినట్లే ఉన్నాడు. కలలోలాగో కథలోలాగో ఏ దేవుడిలాంటివాడో ఎదురై "నీకేం కావాలో కోరుకో" అని అడిగినా వాడు- "మశూచి" అనేటట్లున్నాడు కాని "వెయ్యి రూపాయిలు" అనేటట్లులేడు. మేనమామ చెవిలో వెంట్రుకలు మొలవాలని కోరుకునే మూర్ఖుడిలా ఉంది వాడి మశూచి వాలకం. కాళ్ళూ, కాళ్ళ పీకూ తనవని వాడికి తెలియడంలేదు. కాలిపోతున్న శరీరమూ ఎండిపోతున్న నోరూ తనవే అని వాడు కానుకోలేక పోతున్నాడు.

మురికి వాడలో వాడికి రకరకాల మనుషులెదురయ్యారు. లాటరీ టిక్కెట్లమ్మి పొట్ట పోషించుకుందామనుకునే ఏజంటు, రూపాయితో లక్షాధికారులై పోదామని ఆ పూట కూటికి సీళ్ళాడిలి ఆడబ్బులతో టిక్కెట్టుకొనుక్కుంటున్న అలగాజనం;

బ్రాకెట్ చీటీలు వ్రాసేవాళ్ళు, రాయించుకునేవాళ్ళు .... అదృష్టానికి అడ్డుదార్లు వెదుకుతున్నవాళ్ళు.

"ఇక్కడ మశూచుందా?"

"మీ యింట్లో మశూచుందా?"

అడుగుతునే ఉన్నాడు నూకరాజు. కొందరు — పిచ్చివాడని జాలిపడ్డారు. మరికొందరు కోపంగా కసిరి - తిట్టి కొట్టినంత పనిచేశారు. అయినా వాడు లెక్క చెయ్యలేదు. మశూచిని వదల్లేదు, నిందలూ నిష్ఠురాలూ భరించాడు. పట్టుదలగా తిరిగాడు - సాయంత్రం అయ్యే వరకూ.

వాడి కాళ్ళు తేలిపోతున్నాయి.

కళ్ళు తిరుగుతున్నాయి.

నోరెండి పోయింది. ఇక వాడికి "మశూచి" అనడానికైనా నోరు పెగలడంలేదు. ఎటు పోతున్నాడో తెలియకుండానే గాలిలో తేలిపోతున్నట్లు వెళ్ళి వెళ్ళి - తల్లి వళ్ళో కూలిపోయాడు కుప్పగా.

ముసలి తల్లి తృళ్ళి పడింది. కేక వేసింది.

నలుగురూ పోగయ్యారు శోకంలాంటి ముసల్దాని కేకకి.

"నా బిడ్డ.... అగ్గిలా మండిపోతన్నాదీడివాళ్లు" ఏడిచింది.

ఎవరో ఆచారి దగ్గరికి పరుగెత్తారు. ఆచారంటే ఎమ్. బి. బి. యస్ డాక్టరు కాదు. అలగా జనానికి చవక మందులిచ్చే చదువుకోని డాక్టరు.

నూకరాజు మన లోకంలోలేడు. మశూచిలోకంలో ఉన్నాడు. వాడి మెదడులో ఎందరెందరో మశూచి వాళ్లు నాట్యాలు చేస్తున్నారు. వెయ్యి రూపాయలనోట్లవర్షం కురిపించేస్తున్నారు మునిసిపాలిటీవాళ్లు. వాడికి వెర్రి ఆనందంగా ఉంది.

"జొరం-" అన్నాడెవరో నూకరాజు వొంటిమీద చెయ్యేసి చూసి. ఆ మాట

నూకరాజుకి వినిపించినట్లు కళ్లు తెరిచాడు. అంతవరకూ కన్నుకల చెదిరినందుకు చింతిస్తున్నట్లు ముఖం ముడుచుకున్నాడు. అంతలోనే ఏదో ఆలోచన వచ్చినట్లు ఆనందంగా నవ్వాడు.

'మశూచొచ్చేముందు జ్వరమొస్తుందట్ట.... నాకొచ్చిన జ్వరం మశూచ య్యేలాచెయ్, నల్ల మారెమ్మ దేవతా నీకు నల్లకోడి కోస్తారు మా వాళ్ళు! గొణుక్కుంటూ గాలిలోకి దండాలు పెట్టాడు.

ముసలి తల్లి కంగారు మరింతెక్కువయింది.

ఈ సారి అరుపులే మొదలు పెట్టాడు నూకరాజు, 'నాకు జొరమొంటే మశూచి ... మశూచంటే ఎయ్యి రూపాయిలు, నా కోసం ఏడవకండి. అమ్మా. అయ్యా.... అప్పులూ ... చెల్లెళ్ల .... తమ్ముళ్లు... లగెత్తుకెళ్ళి మునిసిపాలిటీ వాళ్ళకి నాకు మశూచని జెప్పి ఎయ్యి రూపాయిలూ తెచ్చుకోని సుకంగా ఉండండే. అమ్మా.... ఏనుగులాటి కొడుకెళ్ళి పోయాడనేడవకు. ఈ యేనుక్కి బతికుంటే ఏగానీ యిలువ లేదు. మశూచితో చస్తే ఎయ్యి రూపాయల యిలువ, ఎల్లండెల్లండి నాకు మశూచని జెప్పి ఎయ్యి రూపాయలు తెచ్చుకోండి.

పేదవాళ్ళకి పేదపెళ్ళాల్లా పేదవాళ్ళకి పేద డాక్టరయిన అదారి రానే వచ్చాడు.

"సంధి -" అన్నారెవరో.

ఆ మాట అదారి వినిపించుకోలేదు.

నూకరాజు చేతిని తనచేతిలోకి తీసుకుని నాడి చూడసాగాడు.


"మశూచి" అన్నాడు నూకరాజు.

" కాదు. వడదెబ్బ. " అన్నాడు అదారి కచ్చితంగా.

తుపాకి దెబ్బలా తగిలింది ఆ మాట నూకరాజుకి,

'మశూచి కాదూ? మా వాళ్ళకెయ్యి రూపాయిలు రావూ?" అనేసి - ఏదారంగా బాధగా కళ్లు తేలవేశాడు.

''చచ్చిపోయాడు.'' అని అధికారికంగా చెప్పేసి తనవిధి నిర్వర్తించేసుకున్నాడు డాక్టరు. ❋



ఏ దేశచరిత్ర చూసినా...

సాహితి

పేరెందుకుగాని, అదో చరిత్ర ప్రసిద్ధిగాంచిన వూరు. శిల్పసంపద రాశిపోసి వుంది, విదేశీయులు సైతం ముగ్ధులై పోయి, మెచ్చుకుంటూ వుంటారు. "అసలు వారు మెచ్చుకుంటేనే కదండీ మనవారి గొప్ప మనకి తెలిసేది." ఈ మాట కేశవరావు కాస్తకోపంగా అంటూ వుంటాడు. అతగాడు చరిత్ర విద్యార్థి. మన రాజులు, రాణులు, కవిగారన్నట్టు వారి ప్రేమపురాణాలు—వగైరా విషయాలు చదువుతుంటే మంచి థ్రిల్లింగ్‌గా వుంటుందతనికి. ఆ కాలంలో పుట్టక పోతినే అని విచారంగానూ వుంటుంది. అతని స్నేహితుడు రాఘవరావు కిది నచ్చదు. గతాన్ని అవగతం చేసుకొని అంతటితో వదలడమేగాని అనుసరించడం హాస్యాస్పదమని అతని అభిప్రాయం. ఆఖరి పరీక్షరాసి చేతులు దులుపుకొంటుంటే, వారి విదేశీమిత్రుడు రాబర్ట్ వచ్చాడు. "శలవుల్లో ఎక్కడికి కెళ్తున్నారంటూ?" "ఇంకా ఏం తేల్చుకోలేదన్నాడు" కేశవరావు. చరిత్రలో గొప్ప పేరొందిన ఆ వూరు పేరుచెప్పి వెళ్ళి చూసి రండని సలహా యిచ్చాడు." ఏం శిల్పమయ్యా బాబూ! అఖండులు కదా మీ భారతీయులు, అక్కడ ఓ మండపంలో ఒక నాట్యకత్తె శిల్పం వుంది, అబ్బ! ఏం సౌందర్యం! బ్రహ్మాండంగా చెక్కాడనుకో, మరి వదిలి రాబుద్ధి పుట్టలేదు. అహా! నిజంగా ఎవరూ లేకుండా చూసి, ముద్దు పెట్టేసుకొన్నాననుకో! చూసి తీరవలసిన శిల్పం" రాబర్ట్ అరమోడ్పు కన్నులతో ఆ అనుభూతి యొక్క పారవశ్యాన్ని మిత్రులిద్దరి ముందూ ప్రదర్శించేడు. కేశవరావు వళ్ళు ఝల్లుమంది, రోగిముందు పిండివంటల గురించి వర్ణిస్తున్నట్టే వుంది. రాఘవరావులోనూ కుతూహలం రేకెత్తింది. "ఇన్నాళ్ళూ చూడకపోవడం పెద్దతప్పు. పదరా" అన్నాడు కేశవరావు. "యూనివర్శిటీ మూత పడనీ" అన్నాడు రాఘవ. పరీక్షలైన మరునాడు పెట్టెలు లేవుగాని బెడ్డింగ్‌లు మాత్రం సర్ది రైలెక్కేరు.



ఆ వూరులో కాలుపెట్టిన దగ్గర్నుంచీ అడుగడుగునా మూర్ఛపోయినంత పని చేస్తున్నాడు కేశవరావు. "శిలలపై శిల్పాలు చెక్కినారూ ...." అంటూ ఆగకుండా కూనిరాగాలు తీస్తూనే వున్నాడు. గుళ్ళు, గోపురాలు అంతఃపురాలు అన్నీ వరసగా చూసుకుంటూ వస్తున్నారు. గైడు వెంటపడ్డాడు, "వెళ్ళవయ్యా, నీ వ్యాఖ్యానం ఏమీ అవసరం లేదు" కసురుకున్నాడు రాఘవరావు. "వుండనీరా! మనకి తెలియని వెన్ని వున్నాయో! చెప్పనీ." కేశవరావు కుతూహలం పెరిగిపోతోంది. "ఆహా! మన షుతా వాళ్ళు మాంత్రికులా! రాతిలో ఎన్ని భావాలు, ఎన్ని అలంకరణలు, ఎన్ని చిత్రాలు .... వాళ్ళ చేతుల్లో ఏముందో? చూడుచూడు రాఘవా, ఆ రథంమీద రాణి...అదిగో అటుచూడు చల్లి ముంతలు పట్టుకుని వయ్యారి గొల్లభామలు...అబ్బ ఈకృష్ణుడు చూడు ఎంత ముద్దుగా వున్నాడో..." కేశవరావు ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు.



"ఓ పక్క ఈ గైడుగాడు, ఈ పక్క నువ్వూ నన్నిలా వూదరగొట్టేస్తుంటే నాకు మహా బోర్‌గా వుందిరా బాబూ. కాస్సేపు నోరు మూసుకుండికి ఏమివ్వమంటారు మీరిద్దరూ?" "ఛ, పోరా! ఇంత ఉత్కృష్టమైన కళని చూసి ఆనందించలేక పోతున్నావు. నువ్వో భారతీయుడవేనా! నువ్వో తెలుగు వాడివేనా!" దీనికి రాఘవరావు సమాధానం చెప్పలేదు సరికదా పూర్వ వైభవం తలుచుకుని మురిసిపోతున్న కేశవరావుని చూసి కొంటెగా నవ్వాడు. నవ్వి, చిన్నగా పాడాడు. "ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం" అని కాసేపు ఆగి, కళ్ళెగరేసి, మళ్ళీ పాడాడు. "తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?"

"రాఘవా" కేశవరావు పెట్టిన కేకకి చుట్టుప్రక్కలవాళ్ళు అదిరి పడ్డారు.

"కోపం వద్దురా బాయ్! మరీ అంత

పరవశం పనికిరాదని చెప్తున్నానంతే" కేశవరావు భుజంమీద మెల్లిగా తడుతూ, నెమ్మదిగా నవ్వాడు రాఘవ.

"నీ మొహంలే! ఆ రాజులు, రాణులు వారి వైభవం, కళాతృష్ణ, వారి ఔదార్యం, త్యాగం ఏ దేశచరిత్ర కుంటిరా ఇంతటి ఔన్నత్యం? కూరగాయ లమ్మి నట్లు రత్నాలు రాశిపోసి అమ్మతుండే వారట. ఆ రాబర్ట్‌గా డివిని కళ్ళు తేలే లాడు, చూశ్చేదూ....?"

"కాని మనమెందుకు కళ్ళు తేలేయ డం యిప్పుడు?"

"రాఘవా! నిజంగానే నాకిప్పుడు కళ్ళు తేలిపోతున్నాయ్! అదిగో....ఎదురుగా హోటలు కనపడుతోంది పద."


"ఆ మాటన్నావు బాగుంది."

"భోజనంకూడా పూర్వవైభవాన్ని చాటుతోందిరా ఇవాళ, దశాబ్దాలక్రిందటి దొండకాయకూర, శతాబ్దాల క్రిందటి సాంబారూ....అబ్బో బహుశా యివన్నీ అప్పటి రాజులు వండించిన వనుకుంటాను. మనలాంటి యాత్రికులని తరింప చేయడానికని ఇవి వడ్డించి వుంటారు," భోజనం చేస్తున్నంత సేపూ రాఘవరావు ఇలా వెక్కిరిస్తూనే వున్నాడు.

○ ○ ○

"ఈ మంటపంలో కాసేపు రెస్ట్ తీసుకుందాం?" అన్నాడు కేశవరావు చుట్టూ కలయచూస్తూ. జేబురుమాలుతీసి, క్రింద దులిపి, కూర్చున్నాడు. "సరే! అయితే! ఏవయ్యా గైడూ....రెండుగంటల దాకా నీ నోటికి రెస్ట్! ఇకపో!", అన్నాడు రాఘవరావు మండపంలోని ఓ స్తంభానికి జేరబడి కూర్చుంటూ.

"అలాగేనండి! ఈ మంటపంలో శిల్పాలు చూశారా! దేశ, విదేశాలలో ఎంతో పేరుగాంచినవీ శిల్పాలు, ముఖ్యంగా ఇదిగోనండి ... ఈ నాట్యకత్తె శిల్పం దీనికో కథ చెప్తారండీ..." అంటూ గైడు వివరించడానికి పూనుకున్నాడు, కూర్చున్నవాడల్లా కేశవరావు దిగ్గునలేచి, గైడు చూపిన శిల్పానికి ఎదురుగా వెళ్ళి చూస్తూ అట్టే నిలబడ్డాడు. రాబర్ట్ చెప్పిన నాట్యకత్తె ఇదే! ఎంత సౌందర్యం? కన్నుల్లో ఆ శృంగారభావం ఎలావచ్చిందో! ఆ పెదవులంత సుకుమారంగా ఎలా చెక్కగలిగారో? కొద్దిగా వంగి నడుమునున్న చేతిని మరో చేతితో పట్టుకుని, ప్రక్కకి చూస్తూ, చిరునవ్వు నవ్వుతోంది. చటుక్కున చూపరుల నాకట్టుకుని మనసుదోచే అపూర్వమైన నాట్యభంగిమ. అపురూప సుందరి! ఎవరిని దృష్టిలో పెట్టుకుని చెక్కాడో శిల్పి. కేశవరావు తన్మయత్వం నుంచి తేరుకుని చూసే సరికి గైడు లేడక్కడ, రాఘవరావు తల కింద రెండు చేతులు పెట్టుకుని వెల్లకిలా పడుకుని నిద్ర కుపక్రమిం



చాడు. ఇంకా కొందరు యాత్రికులు ఆ మండపంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. కేశవరావుకూడా నెమ్మదిగా నడుం వాల్చాడు. తలని ఆ శిల్పం కాళ్ళ దగ్గర పెట్టుకున్నాడు. కళ్ళెత్తిచూశాడు. ఉన్నతమైన వక్షోజాలు, కొనదేరిన గడ్డం. రెప్ప వాల్చకుండా చూశాడు. చేతితో తాకాడు. ముట్టుకుంటే కందిపోతాయేమో! నవ్వుకున్నాడు, పక్కలకి ఒత్తిగిలి కొద్దిగా ఎత్తివున్న ఆ నాట్యకత్తె పాదానికివున్న మువ్వల పట్టెడలోని మువ్వలను లెక్కపెడుతున్నాడు. మండపం ప్రక్కనున్న కోనేట్లోమీదుగా చల్లని గాలి వీచింది. కళ్ళు మూతలు పడుతున్నాయి.

● ○ ○


కాలి మువ్వలు ఘల్లు మన్నాయి. జరీ అంచు కుచ్చెళ్ళు పాదాల మీదుగా జీరాడాయి. సన్నని నడుమునుచుట్టి ముత్యాల మొలనూలు గర్వంగా వూగుతోంది. రత్నాల కంకణాలు ఎర్రగా చూస్తున్నాయి. పాలలాంటి శరీరపు రంగు వాటి ఎర్రదనాన్ని మరింత ప్రకాశింప చేస్తోంది. పట్టెడు వెడల్పున పాము లాంటి జడ వెనక భాగాన విర్ర వీగుతోంది.

ఘల్ ఘల్.. సుందరి కదిలింది, మైమరచిపోయిచూస్తున్నాడు కేశవరావు. ఎవరీమె? ఎవరో మహారాణి కాబోలు! ఆమె వంటిమీద ఎన్ని రత్నాలు? ఎన్ని! ముత్యాలు? ఎన్ని రవ్వలు? అబ్బ అమె నడకే .. నాట్యం లాగుందే?

ఎక్కడి కలా? కేశవరావు ... తనూ వెళ్ళుతున్నాడు. పెద్దపెద్ద ప్రాకారాలతో, ఆకాశాన్నంటే ఎత్తయిన దర్వాజాలతో ఎంత పెద్ద భవనాలో! అన్నీ రాతి కట్టడాలే! అదేమిటో. వాళ్ళ దుస్తులంత విచిత్రంగా వున్నాయేమిటి ? ఆ తలపాగాలు, పంచెకట్టు అంతా తమాషాగా వుందే! విశాలంగా కళకళలాడుతూ వుంది రాజవీధి కాబోలు. కేశవరావు వింతగా కలియచూస్తూ ఆ సుందరివెనకే వెళుతున్నాడు. అంతలోనే వీధిలో ఓ పక్క కలకలం వినిపించింది. ఏమిటా అని అటు వెళ్ళాడు ఓ మనిషిని రెక్కలు విరిచి పట్టుకుని, దుర్భాషలాడుతున్నారు చుట్టూ జనం. "ఏమిటి జరిగింది?" గుంపులో జొరబడ్డాడు కేశవరావు. అదో కోమటి కొట్టు, మంచి రద్దీగా వున్న సమయం చూసుకుని ఓ పెద్ద బెల్లపు అచ్చు దొంగిలించబోయాడట. పట్టుకున్నారు." "పదండి రాజుగారిదగ్గరికి "అరుస్తూ తిడుతూ తీసుకుపోతున్నారు. కలుక్కుమంది కేశవరావుకి. ఇక్కడకూడా దొంగతనమా? వీళ్ళకూడా ఇలా తిట్టుకుంటారా? ఇంత ఐశ్వర్యం అడుగడుగునా కనిపిస్తోందే! దొంగతనాలుకూడా జరుగుతున్నాయా? ఆలోచిస్తూ వాళ్ళతోపాటే తనూ వెళ్ళాడు.

అదిగో రాజ దర్బారు. ఆ ఎత్తుగా వున్న ఆ సింహాసనంమీద అదిగో... రాజు అయనేనా?

కేశవరావుకి విపరీతమైన నిరాశ ముంచుకొచ్చింది. కావ్యాల్లో యింద్రుడు చంద్రుడని పొగిడారు! అపరమన్మధుడని, కామినీ మానస చోరుడని, అదవిఇదని...అయ్యో! కనీసం. ఎప్పుడూ రాజుల వేషాలువేసే సినిమా యాక్టరు రవిబాబులా కూడా లేడే, సామాన్యమైన ముఖకవళికలు! కేశవరావిలా నిరుత్సాహంగా, నీరసాంబుధిలో మునిగి వుండగానే, ఆక్రందన వినిపించింది చటుక్కున అలాచూసే సరికి రక్తసిక్తమైన మొండి చేతులతో, దీనాతిదీనంగాఏడుస్తూ కనిపించాడు ఇందాకటి ఆ నేరస్తుడు. వికారమొచ్చినంత పనైంది కేశవరావుకి, ఆ దృశ్యంచూడలేక కళ్ళుగట్టిగామూసుకున్నాడు. "ఘోరం! చిన్న దొంగతనం చేయబోయినందుకింత శిక్షా!" వికలమైన మనసుతో వెనుదిరిగాడు. మరో మనిషి దీనంగా ఏడుస్తూ, తలొంచుకుని రక్షకభటుల మధ్యనుంచి నడుస్తూవెళ్తున్నాడు. " ఇతనేం నేరంచేశాడు " స్వగతంగా అనుకున్నాడు. "బాబూ ..... ఈ ఏడు పంటలు పండలేదు ప్రభూ! ఐదవవంతు పన్ను కట్టేస్తే నేనూ....నా కుటుంబమూ ... యీ ఏడాది కట కటలాడవలసి వస్తుంది ప్రభూ! నామనవి.. "ఆ మనిషి ఏడుస్తూ ఏదో మొరపెట్టుకుంటున్నాడు



దర్బారులో.

"మైగాడ్! అంతలేసి పన్నులా?" గుండెలమీద చేయి వేసుకున్నాడు కేశవరావు.

అంతలో సుందరి గుర్తు వచ్చింది. అరెరే! అనుకుంటూ దర్బారు వదిలి, రాజవీధికిపరుగుతీశాడు. అదిగో అల్లంత దూరాన కనిపించింది సుందరి, పరుగు తీశాడు.

○ ○ ○

ఆమె అలంకరించుకొంటోంది అద్దం ముందు కూర్చుని, సాయంత్రం ఆరు గంటలవుతోంది. వాతావరణం ఆహ్లాదంగా వుంది. కేశవరావు ఆమెవెనకే ఆమె ఇంట్లోకి ప్రవేశించాడు. అప్పటికామె గ్రహించింది తన వెనకే అతను వస్తున్నాడని, "ఎవర్నువ్వు?" అనడిగింది వింతగాచూస్తూ.

"నా పేరు కేశవరావు!" అన్నాడు ఆమె గొంతులోని మాధుర్యానికి పరవశిస్తూ.

"ఓ! అవును, నా కాళ్ళదగ్గిర తల పెట్టుకు నిద్రపోయావు! నువ్వే నా !" అంది రెప్పలు అల్లల్లాడిస్తూ.

ముగ్ధుడై పోయాడు కేశవరావు. "ఔను, నేనే! అబ్బ! ఎంత అందంనీది! నీతోపాటే నడిచివచ్చేశాను." అన్నాడు.

"ఔను ! వెనక్కినడిచావు. ఏం ప్రయోజనం?" నవ్వింది ప్రశ్నవేస్తూ.

"మా పూర్వుల వైభోగం కళ్లారా చూద్దామని!"

కిలకిల నవ్వింది.

"నువ్వెవరు? మహారాణివా!"

పెదవి విరిచింది.

"రాజ నర్తకివా?"

తల అడ్డంగా తిప్పింది.

"మరి..."

"సామాన్య నర్తకిని."

'ఆ!'

"ఔను!" ఆమె అద్దంలోకిచూస్తూ తిలకం దిద్దుకుంటూ అంది. "కాని నాకెన్ని ఆశలు! ఎన్ని ఆదర్శాలు! ఆ వగకాడు ఎంత మురిసి, తనిసేడు! చేయి పట్టి వదలనన్నాడు. ఎంత తీవి అనుకున్నావు? తప్పకుండా రాజవంశీయుడే అయివుంటాడు." ఆమె కలలోలామాట్లాడుతోంది.

"ఎవరతను నీ ప్రియుడా!"

"ఊఁ .... ఈవేళ చెపుతానన్నాడు తానెవరో! కలువల కొలను దగ్గర రెండోఝాముువేళ ....నువ్వూచూస్తావా" అతనికేసి తిరిగి ఉత్సాహంగా అడిగింది.

"ఓ తప్పకుండా."

○ ○ ○

వెన్నెలవెల్లువ జగత్తునంతాముంచెత్తుతోంది. దట్టంగా చెట్లతో, లతలతో, గుబురులతో నిండిన పెద్ద ఉద్యానవనమది. ఓ ప్రక్కన కోనేటి నీళ్ళలో చందమామ నవ్వుతూ తేలుతున్నాడు. అక్కడే ఓ చెట్టుకి గుర్రం కట్టివుంది. చెట్టుచాటున నిలబడి కేశవరావు కుతూహలంగా చూస్తున్నాడు.

కోనేటి నీళ్ళలో కాళ్ళు పెట్టుకుని ప్రియునికోసం నిరీక్షిస్తూవుంది నాట్యసుందరి, వెనగ్గావచ్చి నిలబడ్డాడొక పురుషుడు.

"ఎక్కడో చూసినట్టుందే ఇతన్ని!" అనుకున్నాడు కేశవరావు.

ఆ తరువాత వారిద్దరూ సంతోషంగా మాట్లాడుకుంటూ పొదరింటివైపు నడిచారు.

తియ్యని ఊహాలలో తేలిపోతూ చెట్టుక్రిందే కూర్చుండి పోయాడు కేశవరావు.

కొంతసేపటికి అలికిడయింది మాటలు వినవస్తున్నాయి.

"స్వామీ" మత్తుగా ఆమె కంఠం వినిపించింది.


"ఇప్పుడైనా చెప్పరాదా తామెవరో!"

అతను నవ్వి ఆగాడు.

"చెప్పండి."

అతని స్వరం గంభీరంగా, అతి నెమ్మదిగా వినవచ్చింది. "ఈదేశాన్నేలే రాజుని, ఆదిత్యవర్మని. చూడలేదనుకుంటాను నన్నింతకుమునుపు."

చటుక్కున లేచి నిలబడి, తొంగి చూశాడు కేశవరావు. నిర్ఘాంతపోతూ, నిలవునా వణుకుతూ నిల్చింది ఆనాట్యసుందరి. "ఆ! అవును, ఇతను రాజే! పొద్దున్న దర్బారులో చూశానుగా!" అను



కున్నాడు కేశవరావు.

"ప్రభూ...ఐతే....మన ప్రణయం ...." ఆమె ఎంతో ఆందోళనగా భయంగా అడిగింది.

"చెప్పావుగా, నీ కలలన్నీను. నా సహచరిని చేసుకుంటాను నిన్ను!"

"నిజమా ప్రభూ!" ఆనందంతో పొంగిపోయింది. "అబ్బ! ఆ రాజెంత విశాలహృదయుడు." కేశవరావు మనసారా అభినందించాడు.

○ ○ ○

"ఓరేయ్! కేశవా! కేశవా!" రాఘవరావు వంగి కేశవరావువీపుమీదతడుతూ లేపుతున్నాడు. మత్తుగా కళ్ళుతెరిచాడు కేశవరావు. రాఘవరావు మొహం అస్పష్టంగా కన్పించింది. కళ్ళుపూర్తిగా తెరవాలని లేదు.

'అబ్బ! వుండరా! ఇంకా స్వప్న...' మాట పూర్తి చేయకుండానే నిద్రలోకి జారాడు మళ్ళీ అటు ఒత్తిగిల్లి పడుకుంటూ.

"హూ! కానీ," అంటూ, కూడా తెచ్చుకున్న ఇంగ్లీషునవలొకటిచదవడం ప్రారంభించాడు రాఘవరావు.

○ ○ ○

"ఎక్కడా ఆ నాట్యసుందరి.... ఎక్కడ..." తెగ వెతుక్కుంటున్నాడు కేశవరావు. వీధులన్నీ తిరుగుతున్నాడు. ఏదో మార్పు కనిపిస్తోంది. అదేమిటో అర్థంకాలేదు. అంతఃపురభవనాలవేపుగా వెళ్ళాడు. ఏవో అపరిచిత ముఖాలు. దాటి మరో వీధిలోకివెళ్ళాడు. అక్కడ ఇంచుమించు అన్నీ ఒకేలా కట్టిన భవనాలున్నాయి. అయితే అవి అంతఃపుర

భవనాలకంటె చిన్నవి. 'భలే! ఆ కాలంలోకూడా క్వార్టర్సు కట్టేవారన్నమాట" అనుకున్నాడు. అలా చూసుకుంటూ నడుస్తుంటే, ఒకస్త్రీ వాకిట్లోనిలుచుండి, తనని చేయెత్తి పిలవడంచూశాడు. ఆమె వయసు యేభై దాటివుంటుంది. కాని అందంగావుంది. యౌవనపుబిగువు సడలించడం కాలానికికొంతవరకు మాత్రమే సాధ్యం అనిపిస్తుందామెనుచూస్తే.

సందేహంగాచూస్తూ ఆమెను సమీపించాడు,

"ఎవ...ఓ...చూశాను. ఎక్కడా ...అఁ... మీరు ... మీరు ...అతనింకా సందిగ్ధంగా, ఆశ్చర్యంగా ఏదో అనబోతుండగానే ఆమె ఫక్కున నవ్వింది.

"అదేనయ్యా! ఆ నాట్యసుందరిని."

"ఆ!"

ఊఁ!"

"మరి...మరి....ఇంతకాలం....ఊఁ ...సరే! మరి నీ ప్రియుడు...ఆదే ఆ మహారాజు...ఎక్కడ?"ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది. కళ్ళలో నీటిపొరకమ్మింది. "ఆ మహారాజు కోసమే ఈ నిరీక్షణ. అంతులేని నిరీక్షణ."

'అంటే!'

"అంటేఏముంది? ఆనాడు మమ్మల్ని చూశావుగా! ఆయనగారు వాగ్దానం తప్పకుండా, ఈ భవనానికి నన్ను చేర్చారు.'

'నిన్ను వివాహమాడలేదా?'

'పిచ్చివాడా! ఆయనకు రాణులు నలుగురున్నారు. ఇక మేవందరం అంటే... అదిగోచూడు... ఈ వరసన భవనాలన్నీ నాలాంటివారికోసం!"

"అంటే....ఉంపుడు" పూర్తిచేయలేక ఆగాడు కేశవరావు.

"ఔను, ఆయనగారి దర్శనం యీ ముప్ఫైఏళ్ళలోనూ నాకు మూడుసార్లు మాత్రమేకలిగింది. ఇప్పుడాయన అస్వస్థుడుగా వున్నాడు. ఆయన కొడుకు రాజ్యానికి వచ్చాడు. చివరిసారి ఆయనగారిని నేను చూసింది పదేళ్ళక్రితం."

"అయితే మరియింతకాలమూ మీరేం చేస్తారు?"

"ఏంచేస్తాం! దురదృష్టవశాత్తూ-ఎవరేనా వలచిననాడు తటస్థపడితే చెయ్యం దివ్వలేం. ఈ యౌవనభారాన్ని ఒంటరిగామోస్తాం. అడవినికాచిన వెన్నెలమా సౌందర్యం. ఏనాటికి మహారాజుకి మామీద కరుణ కలుగతుందోనని కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తాం. ఈ నిరీక్షణ సంవత్సరాల తరబడి సాగుతుంది. మాజీవితాలకి రాజావారిఉంపుడుగత్తెలమన్న బిరుదే సర్వస్వమూను.

"ఎంతదారుణం? భగవంతుడా ఒక్కవ్యక్తికోసం ఇంత సౌందర్యం ఇంతటి యౌవనం ఇన్ని జీవితాలూ అన్నీ అన్నీ ...వ్యర్థమా?"

ఆమె తనలోతనే చెప్పుకొంటున్నట్లుగా అంది. "ఆ శిల్పి...సుందరుడు. నన్ను వలచాడు. మహారాజు మీద పేరాశలు పెంచుకున్న నామనసూ విరిగింది, శిల్పిమీద మమత చిగురించింది. ఫలితం శిల్పికి శిరచ్ఛేదం."

"ఆపండి." కేశవరావు మరి వినలేకపోయాడు. హృదయం ఆక్రోశిస్తోంది. చరచరా వెనుదిరిగి నడవడం మొదలెట్టాడు. ఎంతదూరం నడిచాడో తెలియదు. వూరు దాటినట్టుంది. అక్కడ భయంకరంగా చప్పుళ్ళు వినిపించాయి. ఓ కొండగుట్ట ఎక్కిచూశాడు. అక్కడ బీభత్సంగా యుద్ధం సాగుతోంది. తలలు తెగుతున్నాయి. మనుషులు క్రూరంగా రాక్షసంగా కన్పిస్తున్నారు. హాహాకారాలు, ఆక్రందనలు, అబ్బ! మనిషిని మనిషి ఎలా నరుక్కుంటున్నాడో! రక్తం కాలువలు కడుతోంది. కళ్ళు తిరిగిపోతున్నాయి కేశవరావుకి. బాబోయ్ ఎంత రక్తం? ఎందుకీయుద్ధం? ఏ దేశ చరిత్రచూసినా....చూసినా...కేశవరావు మరి నిలబడలేక దభాలున కూలిక్రింద పడ్డాడు.

○ ○ ○

'ఒరేయ్! ఏమిట్రా ఆ అరుపులు? ఆ పాటేమిట్రా మధ్యలో! ఈరాత్రి కట్టడాల్లోంచివచ్చి ఏదయ్యమైనా నిన్నావేశించిందేమిటి?"

కేశవరావుక ళ్ళుతెరిచాడు. ఒక్కసారిగా లేచికూర్చుని చుట్టూచూశాడు. ఎదురుగా రాఘవరావు నవ్వుతూ ఏమిటో అంటున్నాడు. మామూలు స్థితికొస్తూ, కళ్ళునులుముకుంటూ అడిగాడు.

"ఏమిట్రా రాఘవా?"

"అదే! ఆ పాటలేమిటి, కేకలేమిటి అనడుగుతున్నాను?"

"పాటలా?' ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును!' ఏ దేశచరిత్రచూసినా ఏమున్నది గర్వకారణం, ఏమున్నది గర్వకారణం?" అంటూ తెగ అరుస్తున్నావు. కలా! ఏం కలగన్నావురోయ్! పగటికల! చెప్పునాకూడా!"

"ఆ!.. కలా ..అవును కలే!" అని మెల్లగా జుట్టుసర్దుకుని, షర్టు దులుపుకుని లేచినిలబడి మళ్ళీ అన్నాడు గట్టిగా, "ఏ దేశ చరిత్రచూసినా ఏమున్నది గర్వకారణం?" ❋



అగ్గిపుల్ల

—విపిన్‌మూర్తి

అదిగో అదే తిమ్మాపురం!

ఆదే ఆ వూరి మంచినీటిచెరువు. దానికి పడమటనా దక్షిణానా ఊరంతా ఉంది. ఉత్తరాన పంటపొలాలున్నాయి. తూరుపున కొద్దిమేర పంటపొలాలూ తరవాత ఊరగాలవ ఉన్నాయి. ఊరగాలవకీ, మరుగుదొడ్డి కాలవకీ మధ్యగా మాలపల్లీ ఉప్పరిగూడెమూ ఉన్నాయి. మాలపల్లిని ఆనుకునే ఉత్తరంగా మాదిగల యిళ్ళున్నాయి. తూరుపునించే ఆ మాలపల్లి మధ్యగా ఊళ్ళోకి సాగివచ్చే మట్టిరోడ్డు ఉంది.

ఆ రోజు-చుక్క పొడిచింది.

పెద్దోడు తోటకాపలానించి ఆ సమయానికే యింటికివచ్చి ఉప్పురాయితోనూ ఉల్లిపాయతోనూ చలిదిగంజి తాగాడు.

"కూంత కూకుని యెల్లగూడదా-" అంది మంగమ్మ.

మీసాలు ఒత్తుకుని, తూరుపు పొలం నించి వస్తూ తెచ్చిన పార అందుకుని జవాబివ్వకుండా బయటపడ్డాడు పెద్దోడు. మొలకి వెండితాడు, కాళ్ళకి కిర్రు చెప్పులూ, ఓ చేత బడితెకర్రా, మరో చేతపార-పొడవుగా, దృఢంగా ఉన్నాడు.

పెద్దోడి నిజనామం బ్రహ్మయ్య. అయితే ఆ గ్రామంలో పెద్ద పెద్దలనించి అట పాపల దాకా వాడేపేర్లు "కందులబెమ్మిగాడు, మాలబెమ్మడు.." యిత్యాదులు

"పనమీదున్న సేనుకి కాపలాయెట్టు; పంటమీదున్న తోటకి కాపలాయెట్టు! యింటికాడ నీకు కంటినిండా నిద్దరట్టక పోతే నన్నడుగు!" అంటుంటాడు బ్రహ్మయ్య గూర్చి యజమాని వీర్రాఘవులు. అంత నమ్మకమూ ఉన్నా, చిన్న పొరపాటు జరిగితే "కడజాతెదవకి నీతా?" అనికూడా అనెయ్యగలడు.

నిజంగానే బ్రహ్మయ్యకి మంచి పేరే ఉంది. "ఆ పేరు సాలదంటే-జలమకి" అంటుంటాడు పెళ్ళాంతో.

అప్పుడే ఊరు నిద్రలేస్తోంది. హోటేలు రాజులు కొట్లో పిండి రుబ్బుతున్నాడు.

పొగాకు కట్ట కోసం షావుకారు బుచ్చిరాజు లోగిలి ముందు ఆగాడు



బ్రహ్మయ్య. అతగాడు విసుగ్గా పందుం పుల్ల నములూ వచ్చి, బేరం గూర్చి యింట్లోకి ఓ అరుపు అరిచి, అరుగుమీద మఠం వేసుకుని కూర్చుని తాపీగాకబుర్లు ప్రారంభించాడు.

"— అదిసరే! యింత పెందరాళే బయల్దేరావేంట్రా?"

"లంకపంపుకి నీళ్ళు కట్టాలన్నారండి యెజమాని"

బుచ్చిరాజు నోట్లోనీళ్ళుఅలాగే ఉండి పోయాయి. తేరుకుని—

"అదేంట్రా? మెరక్కాలవ వంతయితే పల్లపుగాలవ అంటావూ?"

"సిత్తం! యెజమాని సెప్పారండి!"

ముక్కుమీద వేలు వేసుకుని—

"అన్నన్నన్నా! ఊరుకి 'ఓ రీతీ రివాజూ.." మాట మధ్యలోనే అందుకున్నాడు బ్రహ్మయ్య.

"సావుకోరయ్యా! తవఁరు యేటను కొంటే అనుకోండి! ఊరు ఊరంతా కట్టపడిపోతన్నారని దమ్మిడీ ధర తగ్గించి సరుకు అమ్మ గల్డారాండీ....? రివాజులు ఉంటాయండిమరి! సేలూ యెండిపోతాయండి!అందుకే యెవురికాద అరిదండి! గొడవలంటారా? వత్తాయండి! సత్తావున్నోడు గనకనే యెలాగయినా నడగలడండి యీ ర్రాగవులు బాబు..." పొగాక్కట్ట అందుకుని, వాసన జూసి, రొంటిన దోపుకుని నడిచాడు బ్రహ్మయ్య.

"యెక్కడికెక్కడిగ్గట్టావురా! మాల నాయాలా—" గొణుక్కున్నాడు బుచ్చిరాజు.


చెప్పులు తీసి చేత్తో పట్టుకుని, అరుగులమీదకూర్చుని, ముఖాలు కడుక్కుంటున్న ఒకరిద్దరికి దణ్ణాలు పెట్టుకుంటూ, పెద్దవీధి దాటాడు బ్రహ్మయ్య.

పచ్చటి వరి చేల మధ్య నుంచి అతను నడుస్తుంటే, కష్టజీవుల కాళ్ళ చెప్పులను తాకగల్గుతున్న సంబరంతో భూమి చేస్తున్న నాట్యంలా చల్లగాలికి లయగా వంగి లేస్తోంది చేను.

వంతుసీరు అప్పుడే వస్తోంది. పై గుడ్డను విప్పి గట్టునపెట్టి పారతోకాలవలోకి దిగాడు. పల్లపుగాలవకి వేసి ఉన్న ఒడ్డు ముందుగా నరికేడు. మెరకకాలవలోకి నీరు ఎక్కకుండా ఒడ్డు వేసేసరికి తెల్లారి పోయింది. నీరు పల్లపుగాలవలోకి ఉత్సాహంగా పరుగులు తీస్తోంది. ఆ కాలవమ్మటే వెళ్ళి కింద పొలాలకి పోకుండా ఒడ్డు సరిచేయటానికి మరో పావుగంట పట్టింది. నీటిని మళ్ళలోకి మళ్ళించాడు. గట్లు సరిజేశాడు. చుట్టూ తిరిగి వచ్చేసరికి ఏడయింది.

పసిపిల్లవాడు పాకుతుంటూవస్తూంటే సంబరపడే తల్లిలా నీరు నిశ్శబ్దంగా వస్తుంటే బ్రహ్మయ్యమనసు పొంగింది.

కట్ట దగ్గరకు వచ్చాడు. పొగాక్కట్ట



దాన్ని ఊరికే ఎందుకట్టా హైరాన పెడ్తారు! దాని మానాన దాన్ని వదిలి మీరు లోపలికి వచ్చి భోంచెయ్యండి...

తీసి ఆకు సరిజేసి యీనెలు తీసి చివర్లు తుంపి చుట్టచుట్టాడు. బయలు బూమికి పోతున్న ఆసామీ నుంచి అగ్గి సంపాదించి చుట్టముట్టించాడు.

మెరకకాలవ గట్టమ్మటే ఎవరో పరుగెత్తుకు వస్తున్నారు. పరకాయించి "యీరిగాడే" అని తేల్చాడు బ్రహ్మయ్య.

"యెవుర్రా? కట్టేసింది?" వగరుస్తూ అన్నాడు వీరయ్య.

"నానే!"

"అదేటి, నానా! పెతివోంతుకి మీ బూవులే తడిత్తే యీ కాలవకిందయ్య ఏటవుతాయి?"

"అదేవోయ్!— పల్లపుగాలవ్వొంతూ, ఊటనీళ్ళూ మిమ్మల్నే కట్టుకోమన్నాడు మా కాపు!"

"అందాకా మా బూవులెండిపోకుండా ఉంటయ్యా?"

"యెల్లి — మీకాపునడుగు...! ఆరే సెప్తారు?"

యీబూవులు నీయీ కావు నాయీ కావు-అన్నాడు వీరయ్య. మనలో మనకి గొడవేల — అన్నాడు. నీకిది నాయంగాదు! యెందుకు యింత దూరం సెప్పుకొస్తన్నానో కొంత నిదానించు—అన్నాడు.

"నీపెద్దడి! ఎవ్వరి దోవ అరు నూసుకుంటారు— అన్నాడు బ్రహయ్య. నువ్వు నోరు పారేసుకోవద్దు! యెల్లి మీకాపుతో

కేబినెట్ మినిస్టరు! యింకో తమ్ముడి మామగారు కేంద్రంలో యం. పి. ఆ కుంటుంబం యింకా ఉమ్మడిగానే ఉంటోంది. అన్నదమ్ములంతా కసిలి కట్టుగానే ఉంటున్నారు.

యివన్నీ జోగిరాజు మెదడులో మెదిలాయి.

అతను కొంచెం తగ్గాడు.

"బెమ్మయ్యా! కట్టనరకనిత్తే ఆరు కవతం నుంచి తప్పిస్తారని బయపడతన్నావేమో! అరికన్న ఏదుం ఎక్కువ కొలుస్తా! మా కవతంలో సేరుదువుగాని."

"ఆవూసు లన్నీ కొత్తమానకిసూసు కొందారి బాబయ్యా!"

"ఆరు కట్ట యెయ్యమన్నారు బెమ్మయ్యా! నువ్వుయేసావు! కాని.. అది పద్ధతి తప్పి జరిగింది! కట్టడి తప్పి జరిగింది! నువ్వు జేసే వుపకారం మరేటీ లేదు! మేం కట్ట తీసేత్తాం! నువ్వు ఊరుకో! మీ యజమానా? ఊళ్ళో లేడు! సిన్నోళ్ళుఅడుగుతారా..?బలాత్కారంగా తీసేసేరనీ పదిమందొచ్చారని సెప్పు! తప్పు ఆరికిందెట్టుకుని మామీద కలబడలేరుగదా! "అంటూచెప్పుకొచ్చాడు.

"—మాలనాయాలా! నీయమ్మ.! ఆలీ.." అంటూతిట్టాడు.

అన్నింటికీ బ్రహ్మయ్య జవాబు ఒక్కటే.

"నన్ను నరకండి! కట్ట నరకండి!"

కొన్ని కంచెలు చేలు మేస్తాయి!

కొన్ని కంచెలు చేలు కాస్తాయి!

మేసే కంచెలకు కాసే కంచెల అవసరమూ ఉంటుంది. అవి మరెవరి చేలో కాస్తున్నప్పుడు విరోధమూ ఉంటుంది.

"నీ యజమానికున్న పొగరంతా నీకుందిరా.."

ఆమాటకి బ్రహ్మయ్య పిడికిళ్ళుబడితక్రమీద బిగిసాయి!

"నన్నేటన్నా అనండి! తిట్టండి! అరినంటే మాత్రం కుదర్దు!"


"అంటాన్రా! మల్లా అంటాన్రా.."

"అన్నాడండి!"

అని చూడలేదు జోగిరాజు.

వీర్రాఘవులి చేలన్నీ తడిసాయి!

ఆ చేలు తడుపుకున్న పద్ధతిలో కొత్తేం లేదు! తనకన్నలోకు వ్యాళ్ళను బుకాయించి ఎన్నోమార్లు తనూ తడుపుకున్నాడు! యిప్పుడు చాలామందికి బోరింగులున్నాయి! వంతునీళ్ళ గురించి ఎవరూ జీవన్మరణ సమస్యగా భావించటంలేదు. అందువల్లనే మూడొంతుల నీళ్ళు నోరున్నవాళ్ళకీ చెందగా మిగిలినవి చిల్లరమల్లర రైతులు ఉపయోగించుకుంటున్నారు. బోరింగు నీళ్ళు పక్కపొలాలకి అమ్ముకొనేవాళ్ళు కాలవనీళ్ళ గొడవల్లో పెద్దగాముందుకి రావటంలేదు. అందువల్లనే జోగిరాజు కోపం వీర్రాఘ



వులు మీద నిలిచింది.

బ్రహ్మయ్య బోడిగాళ్ళ యజమానులకోసం ప్రాణాల నయినా పణం పెట్టగలగటం ఏనాడూ ఉంది. కాని యీనాడు మారుతున్న పరిస్థితులలో జోగిరాజుకు అదే వేరువిధంగా కన్పించింది.

మాలోడు నా మాట కాదంటాడా— పుండు సలిపినట్టు సలుపుతోంది.

"గొడవ జరిగింది. బెమ్మిగాడికి నాకూనూ....! అడంటే కడజాతోడు. మర్చిపోతాడు! నేనో....!" అనుకున్నాడు.

"యీర్రాగవులుకి నాకూ యియ్యేల కయ్యం వుంటాది! రేపు నెయ్యం ఉంటాది! అరిని జూసుకుని యీడు నన్ను తీసేత్తాడా?"

"యిది యీడికొచ్చిన దొమ్మగాదు! యీడి కులానికి కొత్తగా పుట్టిన దొబ్బు!"

మందు అమిరింది!

జోగిరాజు అదును కోసం చూస్తున్నాడు.

ఆ రోజు రానే వచ్చింది.

ఎముకల గూడుమీద బిగుతుగా తొడిగిన రైల్వే తొగ్గుపనివాళ్ళ డాంగ్రీలాంటి చర్మం! చింపిరి జుట్టు!మెదదగ్గర తన్నుకొచ్చిన ఎముకలు! మట్టిగాజులు! మాసి చిరుగుబట్టిన కోక — ఎండు తాటి మట్టల మోపును నెత్తిన పెట్టుకునిపోతున్న ఆమె,పెద్ద మెతుకును ముక్కుతోదొర్లించుకు పోతున్న చీమలా ఉంది. ఆమె బ్రహ్మయ్య భార్య మంగమ్మ.

పశువులు పుంతమ్మటి యిళ్ళకి నడుస్తున్నాయి! కామేశంబాబుగారి కమతంలో ఉంటున్న అఖరి కొడుకు చెరుకు ముక్క

పెడితే అది నవ్వుల్తా పశువుల వెనక నడవలేక పుంతవదిలి చేలగట్లమ్మట నడిచింది మంగమ్మ.

జోగిరాజు కొడుకు బోరింగు దగ్గర స్నానం చేస్తూ చేస్తూ గట్టమ్మట మంగమ్మను చూసాడు.

"ఎవుత్తే అది, బాబుగోరి సొమ్ములా చెరుకులట్టుకు పోతందీ....?" అంటూ అరిచాడు.

"నాను బాబయ్యా! చెమ్మడి బారియా మంగిని! యిది తవరి తోటలోది కాద య్యా" నడుస్తూనే అంది.

"యేటా యిస్సాటం? నిలబడి సెప్ప గూడదంటే సవ్వాదానం?" మంగమ్మ ఆగింది.

"పొద్దోతంది బాబయ్యా!"

"యెల్లుగాన్లేయే! నువ్వు యేదనించొ త్తన్నావే?" నీట్లోంచి పయికొచ్చి వళ్ళు తుడుచుకుంటూ అడిగాడు.

"నల్లజెరువు కాణ్ణించండి!"

"నల్ల జెరువుకాడ నీకు సెరుకేసిందె వడే? సిన్నముక్క బాబయ్యా అంజెప్పి యెల్లిపోయేదానికి అబద్దాలా? యెదవ బుద్ది! యెదవజాతి!"

"సత్తెపెమానకంగా సెపతన్నాను కొడకా! మా అయ్య కామేశం బాబుగోరి. పశువులకాడ ఉంటన్నాడు! ఆడే యెట్టాడు!"

తరతరాల నుంచి అధికులమన్న నమ్మకంతో పెరుగుతున్న వాళ్ళు, పెంచ బడుతున్నవాళ్ళూ తమ మాట బోటోతే ఊరుకోలేరు! ఆమెయేళయ్యేళ్ళముసలిది! తనతల్లికన్న పెద్దది! తను పద్నాలుగేళ్ళ గుంటడు.... — అన్న చూపు అతనికి యివ్వ బడలేదు!

ఫలితంగా—

"సెరుకుముక్కతింటే, తిన్నావు తప్పుకాయమని అడిగెయ్!" అంటూ జీడిలా వదల్లేదు.

"ఏటండీ! మీ తోటలోది కాదు మొర్రో అంటే దాట్టీకం చేస్తున్నారు" అంది ప్రాణంనిసిగి. అంతకన్న విసురుగా ముందుకు నడవబోయింది.

"నాదంటే దాష్టీకం! మాలనంజా!" అంటూ వాడు మీదకు వెళ్ళాడు.

ఆ సమయానికే మంగమ్మ రెండో కొడుకు ఆదోవన వస్తున్నాడు. కొన్నాళ్ళు అతను పట్నంలో రిక్షా తొక్కాడు! తల్లి మీదకి ఆకుర్రాడు చెయ్యెత్తిన దృశ్యం కంటపడగానే అతనిరక్తంపొంగెక్కింది. ఒక్క ఉదుటున వచ్చి ఆ చెయ్యి పట్టుకుని దించేస్తూ—

"కాపుగోరూ! తల్లిలాటిది! దానిమీద సెయ్యెత్తటం మీకు దగదు! మీకు బాగు కాదు!" అంటూ 'రాయే' అని తల్లిని లాక్కు పోయాడు!

మందుకి పుల్ల అమిరింది!

జరిగిన సంఘటన కడజాతోడు ఆ

కుర్రాణ్ణి కొట్టటం అయింది.

జోగిగాజు అందరి ముందూ జరిగిన దాన్ని విశ్లేషిస్తూ అన్నాడు — "ఆళ్ళలా తిరగ బడతంటే మనం బతకలేం!"

"యియ్యేల మా బుల్లోడు అయాడు! రేపు మీ వోడు అవుతాడు. ఎల్లుండి నువ్వూ నేనూ అవుతాం! తప్పంటి మనతో చెప్పాలి. మొక్కప్పుడువొంగక పోతే మానయ్యాక లొంగదుగాక లొంగదు —" అన్నాడు జోగిరాజు భవిష్యత్తును సూచిస్తూ.

"బగమంతుడు అణ్ణి కడజాతోణ్ణి సేసినందుకు ఆడు కడవానే ఉండాల. అరిజనులని పేరెట్టి గవుర్నమెంటు కూడా ఆళ్ళకు పత్తాపిచ్చి నెత్తికెక్కించు కుంటంద? రేప్పొద్దుట ఆళ్ళు మనిళ్ళలో దూరేత్తారు! ఆపైన జరిగేది ఆ బగమంతుడికే దెలాల" అనీ అన్నాడు.

"పద్దుని ముల్లుగర్రతోటే తోలాల ఏనుగుని అంకుశవెట్టుకువే నడపాల! మాలాణ్ణి యిడదీసే యేలాల! దేనికి తగింది దానికి సెయ్యాల" అంటూ చెయ్యాల్సింది చెప్పాడు!

యిలాంటి సందర్భాలలో ఎందుకు గొడవ చెయ్యాలో ఒక్కడే మాట్లాడతాడు. 'ఎలా చెయ్యాలో' యధాశక్తి అందరూ మాట్లాడతారు. సాధారణంగా వ్యక్తుల స్వంత మనస్తత్వాలకు యిలాంటి చోట ప్రాధాన్యత ఉండదు. వారి కోమలత్వమూ, ఆలోచనా శక్తి ఒక ఊపులో ఒక ఆవేశంలో కొట్టుకు పోతాయి.

కరణంగారి కందువా చాటున, ఆ వూరి పెద్దకాలవ వారనే ఉన్న మామిడి తోటలో సారాబట్టీలున్నాయి. స్మశానం ఆతోటని ఆనుకునే ఉండటం వల్ల దయ్యాలు తిరుగుతుంటాయని జనం అనుకుంటూంటారు.

కొంతమంది పెద్దకాపులతో జోగిరాజు అక్కడసమావేశమయాడు! కరణం సూర్యనారాయణమూర్తి హాజరయేడు! మాదిగలకు కబురెళ్ళింది:

"రారా గున్నయ్యా" అంటూ ఓచిన్న సైజు పెద్దకాపు ఆహ్వానించాడు. గున్నయ్య మాదిగలలో నోటిమీద బతుకొస్తున్నవాడు.

"ఒక్కొక్కలాసుడు పొయ్యవో నూకరాజా!" జోగిరాజు హుకుం జారీ చేసాడు.

తాటాకులు చీరి దొన్నెలు తయారు చేసుకున్నారు మాదిగలు. అందరి దొన్నెలూ, కడుపులూసారాతోనిండాయి తలలను నింపటానికి కరణం లేచాడు.

"—నల్లజెరువులో మనవాళ్ళు వరకట్టుకున్న మాట మన కందరికీ తెలుసు. ఆ భూముల్ని వరకట్టిన మాలాళ్ళను వీరరాఘవులుగారు పట్టాలిప్పిస్తామని— కనీసం పదేళ్ళనించను కుంటాను—

మాలంకీ మధ్య అప్పుడప్పుడు తలెత్తుతూనే ఉన్నాయి.

ఆ రోజు—

మాదిగ గున్నయ్య గుడిసె మాల పోలయ్య గుడిసె పక్క పక్కనే ఉన్నాయి. ఆ యింట్లో అరబెట్టిన గొడ్డు తోలు వాసన ఈ యింట్లోకి వ్యాపిస్తూనే ఉంది. యింటిముందు పోలయ్య భార్య నూకల యెండబెట్టుకుంది, మాయదారి నిద్ర ముంచుకొచ్చింది. చిటికలో గున్నయ్య కోడిపిల్ల వచ్చి నూకల్ని కెలికేస్తూ చేట గుమ్మరించేసింది. అన్నీ దుమ్ముపాలయి పోయాయి.

"ఓలప్పో!తగలేసేసిందల్లో"అంటూ పొరుగింటామె అరుచుకుంటూ వచ్చింది. అదాటున లేచింది పోలయ్య భార్య.

అంతే!

"మా నూకలు దుమ్ములో పోస్తున్నారు! మా బువ్వ లాగేసుకుంటున్నారు! యీళ్ళ జిమ్మడిపోనో! యీళ్ళకి పెద్ద జబ్బురానో! అంటూ తిట్లు లంకించుకుంది.

గున్నయ్య పెళ్ళాం ఊరుకోలేదు!

నోళ్ళు కలిసాయి! చేతులు కలిసాయి!

కొప్పులు విడిపోయాయి! చిరుగులు పట్టివున్న బట్టలు యింకా చిరిగిపోయాయి!

రొప్పుకుంటూ రోజుకుంటూ ఆడాళ్ళు ఎవరి జాగాల్లోకి వాళ్ళు నిష్క్రమించారు!

మగాళ్ళు పనులనించి వచ్చారు!

గున్నయ్య మీద పడిపోయింది పెళ్ళాం!

—నువ్వు బువ్వంల్ని తెస్తాలో తేవో తెల్లేదుగాని ఊళ్ళోజట్టీలు తెస్తున్నావని- తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది.

గున్నయ్య అమెనో నాలుగు తన్ని అరిచి అరిచి ఊరగాలవ గట్టమ్మట నడకపట్టాడు, అట్నుంచి కర్ణమూ జోగిరాజూ కబుర్లుచెప్పుకుంటూ వస్తున్నారు.

"వస్తాడోస స్తాదో తెల్దుగాని వూళ్లోకి ఆడుగెట్ట లేకుండా అయిపోయాం! మాదిగ నాకొడుకులు యిలాంటోళ్ళని పేటపేటంతా ముఖం మీదే దుమ్మెత్తిపోస్తున్నారు! కలో గంజో తాగి కడుపులో కాళ్లెట్టుకు తొంగునీవోళ్ళం!యిలా మాయలో పడిపోయాం! పేటకి సెడ్డయి పోయాం"-అంటూ మొరపెట్టుకున్నాడు గున్నయ్య.

"పవురుసం లేనెదవా!" తిట్టాడు జోగిరాజు.

"ఆ మాత్రం ఊళ్ళో నిభాయించుకోలేకపోతే ఎలాగన్నాడు" ధూములొస్తే అప్పనంగా తిందామనే అనుకున్నావు గానీ చిన్న గొడవ వస్తే ఎదుటివాడి ఎముకలు విరెయ్యక ఊపుకుంటు వచ్చావా? "అంటూ ప్రోత్సహించేడు." నిన్ను తన్నబోతున్న వాణ్ణించి కాసుకోవాలంటే నువ్వే మొదటి దెబ్బతియ్యాలన్నాడు.

"అందుకేగా మీ బతుకులిలాగున్నాయి!" అంటూ జాలిపడ్డాడు."ఎదుటివాడి పళ్ళు పీకెయ్యకపోతే నీకు బ్రతుకు లేనేలేదు" బొమ్మన్నాడు.

బట్టీ దగ్గర చీకటి చీకటిగా ఉంది.

గున్నయ్య మనసునిండా చీకటినీ, కడుపునిండా సారానీ, జేబులో కాస్తంత డబ్బునీ; మెదడులో "మాలాళ్ళ యిళ్ళకి నిప్పెట్టాల"న్న ఆలోచననీ దట్టించి మాలపల్లి మీదకి విసిరాడు. జోగిరాజు.

అగ్గిపుల్ల భగ్గున మండింది.

మాలపల్లి సురసురా అంటుకుంది.

పేపర్లో తిమ్మాపురం హరిజనవాడ కాలిపోయిందని పడింది. కాలిపోయిన యిళ్ళసంఖ్యలో మాదిగల యిళ్ళుకూడా కలిసిపోయి ఉన్నాయి. చనిపోయిన వారిలో పోలయ్య కళ్ళులేని పిల్లాడితో బాటు గున్నయ్య కాళ్ళులేని పిల్లకూడా ఉంది.

ఒకపక్కన జోగిరాజూ ఒకపక్కన వీరాఘవులూ పూనుకుని చెరువుగట్టున మాలంకీ మాదిగలకీ ఒకే పంక్తిన గంజి నీళ్ళు పోశారు! శాంతియుత సహజీవన సౌభాగ్యాన్ని నెమరు వేసుకుంటూ ఎవరి ప్రచారం వాళ్ళు చేసుకున్నారు.


ఎక్కడో తయారయిన మందు, ఎక్కడో పుట్టి ఎక్కడో తయారు చేయబడిన పుల్లతో కలిసి అగ్గిపుల్లగా మారి ఎక్కడో మండి ఏదో చేస్తుంది.

కాలిపోయిన యిళ్ళ శిథిలాలూ, కమురుకంపుకొట్టే మానవ శరీరావశేషాలూ, ఏడుస్తున్న మనుషుల మొగాలూ పైకి దర్శనమిస్తాయేగాని వెనకవున్న అగ్గిపుల్లలు కనిపించవు! ఉపన్యాసాలన్నీ జరిగిన బీభత్సాన్ని వర్ణిస్తూ సాగిపోతాయి గాని నిజాలను బయటకు లాగవు!

రెండేళ్ళు పోయాక వీరాఘవులు సాయంతో జోగిరాజు యమ్మెల్యే అయ్యాడు. యింకాపట్టాలకోసం మాలలూ మాదిగలూ ఇళ్ళు కాల్చుకుంటూనే ఉన్నారు! సగానికిపైగా నల్లజెరువుని ఆక్రమించుకుని పెద్దలిద్దరూ ప్రస్తుతానికి సురక్షితంగానూ సుఖంగానూ ఉన్నారు.

పెద్దపెద్ద నాయకుల సానుభూతి ఉపన్యాసాల, ప్రకటనల, పాదయాత్రల వర్షంలో కూడా చల్లారని అగ్గిమంటలు, కడుపులో దాచుకుని స్తబ్దుగా ఉడుకుతున్న ఎన్నెన్నో భారత గ్రామాల్లో—

అదిగో, అదో తిమ్మాపురం! ❋



నా వెర్రి

'అభిమన్య'

రామారావు, అప్పారావు సుబ్బారావు ముగ్గురూ ఇంటర్వ్యూ బోర్డు సభ్యులు. ఆ కంపెనీలో ముగ్గురూ మూడు సెక్షన్లకు హెడ్స్. ప్యూన్ పోస్టు ఒకటి ఖాళీగా వుంటే పదిమందిని పంపమన్నారు ఎంప్లాయిమెంట్ ఆఫీసు వాళ్ళను. ఇంటర్వ్యూ నిన్ననే అయిపోయింది. రామబాణానికి తిరుగులేదన్నట్లు ఒకే ఒక్క ప్రశ్నతో అభ్యర్థుల్ని పడగొట్టాలని మేనేజ్‌మెంట్ ఆదేశమిచ్చింది ఇంటర్వ్యూ సభ్యులకు ముగ్గురు రావులు బుర్రలను ఏకంచేసి పదినుందికి పది ప్రశ్నలు తయారుచేశారు. ఇంటర్వ్యూ ఐపోయిన మర్రోజు సాయంత్రం ఫైనలైజ్ చెయ్యటానికి ముగ్గురురావులూ ఒక ప్రత్యేకమైన గదిలో సమావేశమైనారు. వాళ్ళ సంభాషణ ఇలా సాగింది.

రామారావు : మన మొదటి ప్రశ్నఏమిటి అప్పారావుగారూ?

అప్పారావు ; (ఫైలు తెరిచి) డా॥సర్వేపల్లి రాధాకృష్ణ ఏ వూళ్లో పుట్టెను?

సుబ్బారావు : గురుడు కళ్ళు తేలేశాడు.

అప్పారావు : మన రెండో ప్రశ్న. బంగాళాఖాతం ఎన్ని మైళ్ళ పొడవుంది?

రామారావు : పాపం, కుర్రాడు జుట్టు పీక్కోలేక నానాయాతన పడ్డాడనుకోండి.

సుబ్బారావు : మూడో ప్రశ్న! అప్పారావు గారూ.


అప్పారావు : శివాజీ ఎన్ని యుద్ధములు చేసెను?

రామారావు : కాండిడేట్ నాలుక తడారిపోయిందంటే నమ్మండి. ఆ నాలుగో ప్రశ్న?

అప్పారావు : వాల్మీకి ఏ పుట్టలో పుట్టెను?

సుబ్బారావు : మనకుమాత్రం తెలుసేమిటండీ. నన్నడిగితే మనం అడిగిన ప్రశ్నల్లో ఒకదానికి తప్ప మనకు సమాధానాలు తెలీవు.

రామారావు : అందుకోసమేగా మనల్ని



నియమించింది మేనేజ్‌మెంట్. నెక్స్టు క్వొశ్చన్ చెప్పండి!

అప్పారావు : మంగళంపల్లి బాలమురళీకృష్ణగారి తండ్రిగారెవరు ?

సుబ్బారావు : మహా మనకు తెలిసినట్టు.

అప్పారావు : ఇక ఆరో ప్రశ్న - మన తెలుగు నాటక రంగస్థలముపై శ్రీకృష్ణపాత్రను ఎందరు ధరించుచున్నారు?

రామారావు : ఎంత తెలివిగా అడిగామండీ.

సుబ్బారావు : కాదామరి! కాండిడేట్‌కు బి.పి. రావటమేగా మన ఆశయం.

అప్పారావుగారూ, ఏడోది విన్పించండి.

అప్పారావు : "బాపు" అని ప్రసిద్ధ చిత్రకారులున్నారే, వారి వయస్సెంత?

సుబ్బారావు ; అయనే మరచిపోయుంటాడు. ఏం ప్రశ్న వేశామండీ?

రామారావు : అదేవిటండీ - మనలక్ష్యం అభ్యర్థిని పడగొట్టటమేగా.

అప్పారావు: మనంకూడ పడిపోతున్నాం కదా.

సుబ్బారావు : మన కెందుకండీ ఈ వాదన. ఎనిమిది, తొమ్మిది ఒక

సారి చదివేయండి అప్పారావుగారూ

అప్పారావు : కూచిపూడి నాట్యానికి, భరతనాట్యానికీ తేడాఏమిటి? ఇది ఎనిమిదవ ప్రశ్న. శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామి హుండీలో ఎన్ని తూర్లు బంగారం వేయబడింది? ఇదండీ తొమ్మిదో ప్రశ్న

రామారావు : చాలాచాలా అన్యాయమైన, ప్రశ్నలు తయారుచేశాం సుబ్బారావు గారూ

సుబ్బారావు : ఎందుకండీ అసందర్భ పశ్చాత్తాపం. పదిమందిని పడగొట్టమని మేనేజ్‌మెంట్ ఆదేశించింది. యూనియన్ వాళ్ళనుకూడ తృప్తి పరచాలికదా! ఇంటర్వ్యూ కందరూ మహాచవటలొచ్చారూ అని సమర్థించుకుని, వాళ్ళ కాళ్ళు పట్టుకున్న వాడినెవరినో ఆ పోస్టులో వేసేసుకుంటారు ఇంతేసంగతులు

అప్పారావు : పోనీ మనం ఒకర్ని సెలక్టుచేసి, రికమెండ్ చేద్దాం!

సుబ్బారావు : ఏ మొహం పెట్టుకుని—

రామారావు : అన్నట్లు పదో ప్రశ్నకు ఆ కుర్రాడెవరో తెలివిగానే జవాబు చెప్పినట్లున్నాడు. ధైర్యంచేసిఅతణ్ణి సెలక్టు చేస్తే?

సుబ్బారావు: అప్పారావుగారూ ఆ పదో ప్రశ్న - దాని సమాధానం వినిపించండి

అప్పారావు : శ్రీశ్రీ ఎవరు? ఇదీ ప్రశ్న ఆ కుర్రాడిజవాబు:"మా మేనమామ"

రామారావు : ఆయన కవిగదండీ

అప్పారావు : మహాకవండీ బాబూ

సుబ్బారావు ; విప్లవకవి మహానుభావా

రామారావు ; మొత్తానికి కవేకదా! మరా కుర్రాడు మేనమావన్నాడే?

సుబ్బారావు : అదే కరెక్టయిన సమాధానమండీ. కాదూ అని ప్రూవ్ చెయ్యాలికదా. ఐనా ఎవర్ని పడితే వాళ్ళను మేనమామ అని చెప్పుకుంటాడేమిటి ?

అప్పారావు : నాకు అలానే అనిపిస్తుందండీ

రామారావు : అనిపించట మేవిటండీ. ముమ్మాటికీ కరెక్టే. లాజిక్‌గా ఆలోచించినా మనకు మన భార్య తప్ప మిగతా స్త్రీలందరూ సోదరీమణులే ఆ లెక్కన ఆ అబ్బాయి సమయస్ఫూర్తి అద్భుతం. ఐ.ఎ.ఎస్ కు పోవల్సినవాడు.

సుబ్బారావు : రాసెయ్యండి. సంతకాలు చేస్తాం

అప్పారావు : ఇదిగోండి ఫైలు

రామారావు : థ్యాంక్స్ ఫరువర్ కోపరేషన్

అ. సు : అ హ హా!

❋

సీరియల్



నాలుగు రోజులూ నాలుగు క్షణాల్లా గడిపి రాజేంద్ర వెళ్ళిపోయాడు. ఆ రోజు అరుణ తేస్తూనే ఎలాగో ఉంది. తల్లి అడిగితే ఏమీలేదంది.

పొద్దెక్కినకొద్దీ కూర్చోలేకా నుంచోలేకా అవస్థ పడుతున్నట్టుగా కనిపించిందావిడకి.

"ఏమిటి పాపా! అలా వున్నావేమిటి"? అంటూ నాలుగుసార్లడిగే సరికి రాత్రినించే ఎలాగో ఉంది. నడుం లాగుతోంది" అని చెప్పింది.

అవిడ శేఖరంతో డాక్టర్ని తీసుకురమ్మని చెప్పింది. "ఈ రోజు నువ్వింట్లోనే ఉండరా బాబూ! నాకేమిటో కాళ్ళూ చేతులూ ఆడట్లేదు" అంది.

"అలాగే. నువ్వేం కంగారు పడకు" అని అతను డాక్టర్ని తీసుకు రావడానికి వెళ్ళాడు.

పావుగంటలో డాక్టర్ని వెంటబెట్టుకొచ్చేడు శేఖరం.

డాక్టరొచ్చేసరికి నిలువలేని పరిస్థితిలో వుంది అరుణ.

డాక్టర్ మాధురి పరీక్షచేసి కాంతమ్మగారితో అంది, "హాస్పటల్‌కి తీసుకెళ్ళడంమంచిదండీ! అక్కడ అన్ని సౌకర్యాలూ వుంటాయి. వూళ్ళోనే కదా! మీరు 'ఊఁ' అంటే తీసుకెళ్తాను. మీకేం భయం లేదు" నచ్చచెప్తున్నట్టుగా అంది.

అదివరకు అరుణ హాస్పటల్‌కి వెళ్ళనని పట్టుబట్టి కూర్చుంది. అందుకే అవిడ అలా అడిగింది. శేఖరం కూడా అదే మంచిదన్నాడు. మొదట అరుణ ఒప్పుకోలేదు. డాక్టర్ నాలుగయిదు సార్లు చెప్పటంతో అయిష్టంగానే "ఊఁ" అంది. హాస్పటలంటేనే అరుణకి ఎందుకో భయం.

కాంతమ్మగార్ని హాస్పటల్‌కి రానీయలేదు. అవిడసలే గుండెదడమనిషి. అందులో అరుణ బిద్దకంగా కనిపించే సరికే అవిడకి కాళ్ళూ చేతులూ ఆడట్లేదు.

"మీ అమ్మాయికేం భయంలేదు. నేనున్నాగా! మీఅమ్మాయినీ, పండంటి మనవడినీ మీకు క్షేమంగా అప్పజెప్తాను" అంది డాక్టర్ మాధురి నవ్వుతూ.


ఒక్కత్తీ వెళ్ళాలంటే అరుణకి భయం వేసింది. మీరాని కూడా రమ్మని అడిగింది.

"నేనా!" తెల్లబోయింది మీరా. "అయినా యింట్లో ఎవరు చేస్తారు? అవిడ అసలే తోచకుండా వున్నారు'."

మీరా యింకేమీ మాట్లడక పోవడంతో శేఖరం తల్లితో అన్నాడు. "అమ్మా! అరుణ భయపడుతోంది. అవిడ వస్తుందేమో అడుగు".

"మీరా, నువ్వెళ్ళు, ఇంట్లో పని నేను చూస్తాను"అంది కాంతమ్మగారు.

ం ం ం



మధ్యాహ్నం రెండు గంటలయింది—

అరుణ యమ యాతన పడుతోంది—

డాక్టర్ మాధురి ధైర్య వచనాలు చెప్తోంది — అంతకన్నా ఎంత డాక్టరయితే మాత్రం ఏంచేయగలదు?

ఇంటిదగ్గరున్న కాంతమ్మగారికి గుండె దడ వచ్చినట్టుగానే వుంది. అవిడసలు అపూట అహారం ఏమీ తీసుకోలేదు. దాంతో మరీ నీరసంగా కూర్చుండిపోయింది. అసలు ఎవరికీ భోజనాలులేవు. డాక్టర్ మాధురికూడా చేయలేదు.

శేఖరం ఇంటికెళ్ళి రెండు మూడు సార్లు ఫ్లాస్కులో కాఫీ తీసుకొచ్చాడు. పన్నెండింటికి హోటల్‌నుండి టిఫిను తెప్పించాడు, బాబి చేత. కాని, మీరా తీసుకోలేదు. అరుణ అలా వుంటే మీరాకి కాఫీకూడా ఎక్కలేదు.

శేఖరం, తను తెప్పించినందుకే మీరా టిఫిన్ టీసుకోలేదనుకున్నాడు.

ం ం ం

మధ్యాహ్నం మూడు గంటలు దాటి ఇరవై నిముషాలు అయింది.

మీరా తలుపులు తెరచుకొని ఇవతలకొచ్చింది.

మీరా ముఖం సంతోషంతో వెలిగిపోతోంది.

శేఖరం గబగబా మీరా దగ్గరగా వచ్చేడు. "ఎలావుంది" ఆత్రుతగా అడిగాడు.

"ఆడపిల్ల. ముందు అమ్మగారికి చెప్పిరండి!" అని క్షణం ఆగి, "ఫ్లాస్కులో కాఫీలేదు. అవసరం అవుతుందేమో!" అని ప్రసన్నంగానే చెప్పింది.

మండే మనసుమీద పన్నీటి వర్షం కురిసినట్టయింది. మీరా నోటివెంట ప్రసన్నమైన ఆ ఒక్కమాటే శేఖరానికి వేయి ఏనుగుల బలమిచ్చినట్టయింది. అతను అలసటంతా మర్చిపోయాడు, "ఫ్లాస్కు ఏది?" అడిగాడు.

మీరా ఫ్లాస్కు తీసుకొచ్చియిచ్చింది.

శేఖరం ఈ రోజు రాఘవరెడ్డి స్కూటరు ఉంచేసుకున్నాడు. ఈ రోజు ఉంచేసుకోకపోతే అతనికి చాల అవస్థే అయేది.

తిరిగి శేఖరం కాఫీ తీసుకొచ్చేసరికి మీరా తెలివిలోకి వచ్చినట్టుగా — మామూలుగా అయిపోయింది. శేఖరం అందిస్తున్న ఫ్లాస్కు ఎప్పట్లా ముడుచుకున్న ముఖంతో అందుకుంది. నవ్వుతూ మాట్లాడిన ఒక్క మాటకే పొంగిపోయిన శేఖరం మనసు—మీరా ముడుచుకున్న ముఖం చూసేసరికి పొంగే పాలమీద నీళ్ళు చిలకరించినట్లే అయింది.

బాచి అక్కడ కనిపించటంతో బాచి దగ్గరకెళ్ళి అడిగింది మీరా "బాచీ ఇప్పుడు నీకేమయినా పనుందా?"

"ఏమక్కా! ఏమైనా కావాలా? చెప్పు" అన్నాడు బాచి.

"మా ఇంటికెళ్ళి రాగలవా?

"వెడతానక్కా! చెప్పు".


"నేను ఇంటికెళ్ళలేదు. అమ్మ కంగారు పడుతూ వుంటుంది. ఒక్కసారి వెళ్ళి అరుణకి పురుడొచ్చిందిట. సాయంత్రం వస్తుందిట. కంగారు పడద్దని చెప్పిరా" అంది.

"అరుణమ్మగారి సంగతి తెలుసా, అమ్మగారికి?" అని అడిగాడు బాచి.

"అరుణ సంగతి చెప్పేన్లే! హాస్పటల్‌కు వచ్చినట్టు మాత్రం చెప్పకు ఇంట్లో ఎవరూ లేర్ట కాస్సేపు సాయం ఉండమన్నార్టని చెప్పు"

"సరేఅక్కా" అంటూ వెనుదిరిగాడు బాచి.

"ఇదిగో" పిల్చింది మీరా.



బాచి వెనక్కి తిరిగాడు.

క్షణం సేపు ఆగి, "ఇక్కడ—అమ్మగారూ, అరుణా, పిల్లలున్నట్లే అమ్మకి తెలుసు-ఇంక నువ్వేం చెప్పకు" తల దించుకుని అంది.

"సరే" అని బాచి వెళ్ళిపోయాడు. మీరా లోపలికెళ్ళిపోయింది.

బాచి శేఖరం దగ్గరికి వచ్చేడు. మీరా బాచిని పిల్చి ఏదో చెప్పటం చూశాడు. ఏమిటో అతనికి అర్థం కాలేదు. "ఏమిటి" అని బాచిని అడిగాడు.

"ఒక్కసారి అక్కయ్య ఇంటికి వెళ్ళొస్తానండి. సైకిల్ మీద తొందరగా వెళ్ళి వచ్చేస్తాను...

"ఏం? ఏమైనా పనుందా?" ఎందుకో తెలుసుకోవాలనే ఆతృతతో అడిగాడు శేఖరం.

"అక్కయ్య ఇంటికి రాలేదని పిన్నిగారు కంగారు పడతారేమోనని అక్కయ్య చెప్పిరమ్మంటుందండి" అన్నాడు.

"చాలా దూరమా?'' ఇల్లు ఎక్కడో తెలుసుకోవాలని అడిగాడు.

"కొంచెం దూరమేనండి-సైకిలుంది—

"బస్సుస్టాండు దగ్గరా?

"అంతదూరం కాదులేండి. మా నిమ్మతోటకి దగ్గిరేలెండి".

"ఆక్కడన్నీ చేలేగా! అక్కడ ఇళ్ళేమున్నాయి" ఇల్లు ఎక్కడో వివరంగా తెలుసుకోవాలని ఆతనికి చాలా కుతూహలంగా వుంది.

"అమ్మవారి గుడికి కాస్త దూరంలో నాలుగిళ్ళు వున్నాయండి. మీరు పొలాలకేసి రానట్టుంది, అక్కడేనండీ—

"సరే! వెళ్ళిరా—తొందరగా వచ్చేయి" అని బాబిని పంపేశాడు శేఖరం.

ఒక్కసారి బాబుని చూడాలని అతనికి ఎంతగానో వుంది. బాబు ఎవరో మీరా నోటిమీదుగా తెలుసుకోందే ఆతనికి నిద్ర పట్టేట్టుగా లేదు.

సాయంత్రం అయిదు గంటలవుతోంది. డాక్టరు మాధురి వచ్చి "మేనకోడల్ని చూడండి" ఆంది నవ్వుతూ.

శేఖరం గుమ్మం వరకూ వచ్చి లోపల్నుంచి మీరా మాట వినపడి ఆగిపోయాడు.

మీరా అంటోంది " అరుణా! ఏమిటలా మొహం ముడుచుకున్నావు. నీకూతుర్ని చూడు".

"నే నెప్పుడో—నీ తన్నముందే చూశాలే!

"ఆహా! మరి, ముక్కు ఇంత పొట్టిగా వుంది గమనించేవా?"

"అలాగే బాగుంటుంది".

"బుగ్గమీద ఈ గాటేమిటే! గిచ్చేవా ఆడపిల్ల ఆని'"! నవ్విన శబ్దం.

"నిజంగానే మీరా! నువ్వు పెళ్ళిచేసుకుని ముందు అబ్బాయిని కనేసి వుంటే నిజంగా నేను బాధపడి వుండను. పోనీ ఇప్పుడైనా సరే! ఇది పెద్దదైనా-నీ కొడుక్కి చేసుకుంటానని మాటియ్యి———" నవ్వుతూ అంటోంది అరుణ.

శేఖరం చప్పున శబ్దంగాకుండా అడుగు పెట్టేడు.

తొంచుకున్న మీరా ముఖం ఎర్రగా కందినట్టుగా వుంది.

అరుణ, పక్కలోవున్న-ఇంకా కళ్ళయినా తెరవని తన కూతురి గుప్పెటగా మూసిన చేతిని తనచేత్తో బుగ్గకి తాకించుకొని తన్మయంగా కళ్ళు మూసుకుంది. 'అప్పుడే ఎంత మమకారం' మంచంమీద అలా అరుణ స్థానంలో మీరా, పాపస్థానంలో తెల్లగా బొద్దుగావున్న బాబూ కనిపించేరు శేఖరానికి.

అరుణ మాట్లాడుతూ ఆగిపోవటంతో మీరా కళ్ళెత్తి అరుణకేసిచూసింది. అరుణ కళ్ళు మూసుకొని కూతురి చెయి చెంపకి అనించుకుంది. ఏదో అనబోతూ వెనక్కి తిరిగిన మీరా ఆగిపోయింది.

శేఖరం నిలబడిన తీరు చూస్తే, అతను వచ్చి చాలా సేపయినట్టు, తమ మధ్య జరిగిన మాటలు విన్నట్టుగా అన్పించింది.

మీరా ముఖం నల్లగా కమిలినట్టుగా అయిపోయింది.

అరుణ కళ్ళు తెరిచి, అన్నగార్ని చూసి సిగ్గుగా నవ్వింది.

తన చేతిలో వున్న, కూతురి చేతిని నింపాదిగా వాల్చింది

శేఖరం మంచం దగ్గర కొస్తోంటే-మీరా పక్కకి తప్పుకుంది. శేఖరం కాస్సేపు అరుణతో మాట్లాడి "ఇంకమేము వెళ్ళొచ్చా అరుణా! వెళ్ళి అమ్మని తీసుకొస్తాను" అన్నాడు.

"అలాగే అన్నయ్యా! పాపం మీరాకి ఈ వేళ భోజనమే లేదు" ఆంది మీరా కేసి ప్రేమగా చూస్తూ.

"చూశావా? నేనన్నమాటలో ఆబద్ధం లేదని ఇప్పుడేనా ఒప్పుకుంటావా! నేను తిన్నానో లేదో నీకక్కరలేదు" అన్నాడు నవ్వుతూ

అరుణ నవ్వింది.

శేఖరం మీరా కేసి చూశాడు. గోడలకేసి పరీక్షగా చూస్తోంది.

ఉలిక్కి పడింది మీరా.

"రిక్షా పిలవచ్చా" అంటూ ఆరుణకేసి తిరిగాడు!

మీరా ఏంమాట్లాడక పోవడంతో అరుణే చెప్పింది "పిలు. ఇప్పటికే చాల ఆలస్యమయి పోయింది."

బయట కెళ్ళిన శేఖరం అయిదు నిముషాల్లో తిరిగి వచ్చేడు.

"రిక్షా వచ్చింది" అన్నాడు.

"వెళ్ళు మీరా " అంది అరుణ.

యాంత్రికంగా కదిలింది మీరా.

"మీరా!" అరుణ పిల్చింది. ఏమిటన్నట్టుగా ఆగి, చూసింది మీరా.

"ఇలారా" అంది అరుణ. మీరా మంచం దగ్గరగా వచ్చింది

"అలా వున్నావేం మీరా" అడిగింది అరుణ. శేఖరం అక్కడే

వున్నాడు.

"ఎలావున్నా-రేపు తొందరగా వచ్చేస్తాలే!" అని శేఖరం పక్కనించే ఇవతలకి వచ్చేసింది. అరుణతో చెప్పి శేఖరం కూడా వచ్చేడు. మీరా అలా వుండటానికి కారణాలు-వాళ్ళ మాటలు తను విన్నాడని-తను మీరాని ఉద్దేశించి మాట్లాడ్డం-శేఖరం మీరా పక్కన ఆగి, "రిక్షా అదిగో! రా! అన్నాడు

మీరా వచ్చి రిక్షాలో కూర్చుంది.

"ఇంటికా! —మీ ఇంటికా" అని అడిగాడు. రిక్షా పక్కకి వచ్చి.

మీరా మాట్లాడలేదు,

రిక్షావాడికి చెప్పాలి".

"అమ్మగారితో చెప్పి వెళ్తాను.

రిక్షా కదిలింది. రిక్షాకన్న ముందుగా శేఖరం ఇంటికి వెళ్ళాడు.

లోపలికొచ్చిన మీరా వెన్నుమీద చేయివేసి ప్రేమగా అంది శాంతమ్మగారు "చిన్న పిల్లవయినా బాలా సహాయం చేశావమ్మా మీరా".

"నే చేసిందేముందండీ—మీరలా నీరసంగా వున్నారేం?" అంది.

"నేను కట్టెనే ఇక్కడున్నాను-నా ప్రాణమంతా అక్కడే వుంది. పోనీ వద్దామా అంటే-ఆ కంగారులో నాకు గుండెదడ వస్తే దాన్ని వదిలి నన్ను చూడాలంటాను" అని, మళ్ళీ "వెళ్దామా! మీరా మేము వచ్చేవరకూ వుంటావా?" అంది.

"అలాగే నమ్మా!" అంది మీరా.

"ఈ వేళంతా కాఫీ మయం-నాకు టీ కావాలమ్మా" అన్నాడు శేఖరం.

మీరా లోపలకెళ్ళి టీ చేసి తీసుకొచ్చింది "మీరేం తీసుకుంటారు" శాంతమ్మగార్ని అడిగింది.

"ఇప్పుడేం తీసుకోను. నువ్వు తీసుకున్నావా?"


"ఆఁ" అంది.

"ఎప్పుడూ!''. చెప్పందే మీరా, యేమీ తీసుకోదని ఆవిడకి తెలుసు.

"వచ్చేముందే-అరుణా, నేనూ...."

శేఖరం మీరా కేసి చూసి, "గ్లాసుకావాలి" అన్నాడు.

గ్లాసు తీసుకొచ్చి అతని దగ్గరపెట్టింది.



సగం టీ అందులో పోసి అక్కడ పెడ్తూ "ఇదిగో! నా కింత అక్కర్లేదు" అన్నాడు.

మీరా తీసుకోలేదు. అలా అతను ఇచ్చింది తీసుకోవటం మీరాకి అసలిష్టంలేదు," నువు తీసుకో చినబాబూ! తను పెట్టుకుంటుంద" అంది శాంతమ్మగారు.

"ఈ వేళ కాఫీలకి లెక్కలేదు-తీసుకోమను".

"తీసుకో మీరా'' అందావిడ.

"నేను—కాస్సేపయినాక పెట్టుకుంటానండీ" బలవంతంగా అంది మీరా.

"పెట్టుకున్నా సరే! తీసుకో! పొద్దుటినుంచీ భోజనం లేదు''.

మీరా తీసుకొనేవరకూ శేఖరం తీసుకోలేదు.

○ ○ ○

టెలిగ్రాం అందుకుని మూడోనాటికల్లా వచ్చేడు మూర్తి.

అరుణ కొడుకు పుడ్తాడని_తను కూతురే పుడ్తుందని పందెం వేసు కున్నార్ట. ఇంటికొచ్చేదార్లో శేఖరానికి చెప్పేడు మూర్తి.

ఇంటికొస్తూనే హాస్పటల్‌కి వెళ్దామని తొందర చేశాడు మూర్తి.

"ఏమిటా తొందర! కాఫీ తాగి వెడదాం" అన్నాడు శేఖరం.

మీరా గబగబా కాఫీ కలుపుతోంది. తెలిసున్న వాళ్ళు వచ్చినప్పుడు వాళ్ళ ఎదుటికి వెళ్ళాలంటే మీరాకి ప్రాణం మీది కొచ్చినట్టుగా వుంటుంది.

మూర్తి తనని చూసి గుర్తుపట్టి అడిగితే—

మీరా కాఫీ అక్కడపెట్టి వచ్చేస్తోంటే మూర్తి శేఖరాన్ని నెమ్మదిగా అడిగాడు "అరుణ స్నేహితురాలనుకుంటా—"

"ఔ" వన్నట్లు తలూపాడు శేఖరం

"నీ కూతురు నీ పోలికేనోయ్" అంది శాంతమ్మగారు.

"ఇప్పుడలా అన్నావంటే కాఫీగ్లాసుతోటే పరుగెత్తుతాడు" అని, మళ్ళీ మూర్తితో అన్నాడు. "ముందు కాఫీకానీ! నువ్వేమన్నా అనుకుంటావని అమ్మ చెప్పట్లేదుకాని-నీ కూతురు రంభ!".

"కాక" అన్నాడు మూర్తి గర్వంతో కూడిన సంతోషంతో.

"ఏంకాకో! ఓ కన్ను చిన్నది_ఓ కన్ను పెద్దదీను. సొట్టముక్కు-మెడమీద తలకాయవున్నవాడెవడూ నీ కూతుర్ని పెళ్ళి చేసుకోడు. నేనే చేసు కోవాలి" అన్నాడు శేఖరం మూర్తి ఆతృతచూసి హాస్యంగా.

"అంటే! నువు మెడమీద తలకాయలేని వాడివన్నమాట" అన్నాడు మూర్తి.

మూర్తి మాటలకి మీరాకి నవ్వువచ్చింది.

"మేనకోడలే కదా! ఆ మాత్రం త్యాగం చేయకపోతే ఎలా?" అన్నాడు శేఖరం.

"అంతేలే! అఖరికి అది పెద్దదయి నీకు బుద్ధి చెప్పాల్సిందే" శాంతమ్మగారు వెనకాలే అంది.

అరుణని మూడోరోజు ఇంటికి తీసుకురావటం కుదరలేదు. అరుణకి టెంపరేచరు వచ్చింది, మూర్తి రెండు రోజులుండి వెళ్ళిపోయాడు.

అయిదో రోజునా అరుణని తీసుకరావటం కుదరలేదు, ఏడో రోజున

తీసుకురావటం శాంతమ్మగారికి ఇష్టంలేకపోయింది.

o o o

ఆ రోజు తెల్లారగట్లనగా వెళ్ళిన శేఖరం సాయంత్రం ఆరవుతుండగా కారులో వచ్చేడు, స్వయంగా నడుపుతూ. అంత క్రితమే శాంతమ్మగారు హాస్పటల్‌నుంచి వచ్చింది. మీరా, శాంతమ్మగారు ముందు వరండాలో కూర్చున్నారు.

తెల్లబోయి చూస్తున్న తల్లి దగ్గరగా వచ్చి "ఎలాగుందమ్మా! బాగుందా?" అని అడిగాడు.

"ఎక్కడ కొన్నావురా! ఎప్పుడు కొన్నావు" అందావిడ వరండా మెట్లు దిగుతూ.

"బాగుందా చెప్పు" అన్నాడు.

"బాగుండకేంరా! పొద్దున్నవెళ్తూ చెప్పనన్నా చెప్పావుకావు! గంగులేడి, కొబ్బరికాయ ఒలవమంటాను" అంటూ గంగుల్ని పిల్చింది.

"అవన్నీ ఎందుకమ్మా! ఇదేం కొత్తకారు కాదు, పాతదే కొని రంగు వేయించాను".

"ఏదయినా సరే! మనింటికొచ్చింది. ఇలాంటివి కొన్నప్పుడు పూజ చేయించాలి'' అని గబగబా కొబ్బరికాయ వలిపించింది.

మీరాని పసుపు కుంకుమ తీసుకరమ్మని—అప్పని పువ్వులు కోసుకరమ్మని పురమాయించింది.

మీరాని చిన్న మాల కట్టమని పురమాయించింది.

మీరా ఆవిడ చెప్పినట్టేచేసింది.

వాళ్ళకాస్త దూరంలో చేతులు వెనక్కి పెట్టుకుని నిలబడ్డ శేఖరం తల్లి చేసే హడావిడీ-తల్లి చెప్పే ప్రతిపనీ శ్రద్ధగా చేసే మీరాని చూస్తోంటే అతని కళ్ళముందు మనోహరమైన దృశ్యాలెన్నో సినిమా రీళ్ళలా మెదిలి అతని మనసుని చల్లగా తాకి హృదయం మీద ఎప్పటికీ చెరగరాని విధంగా ముద్రవేస్తున్నాయి.

శాంతమ్మగారు చెప్పినవన్నీ శ్రద్ధగా చేసిన మీరా, శాంతమ్మగారు కారుకి పూలమాల వేసి కొబ్బరికాయ కొట్టమనే సరికి "నేనా!'' అంది వులికి పడ్డట్టుగా,

గాలికన్న తేలిగ్గా-ఎక్కడెక్కడో విహరిస్తున్న శేఖరం మనసు యధాస్థానానికి వచ్చింది. అతనూ లిప్తకాలం ఉలికి పడ్డట్టుగా అయినాడు.

శాంతమ్మగారు ఇలాంటివేం చేయదు. ఆవిడకి ఇష్టం వుండదు. శేఖరం అరుణకూడా "ఏమిటమ్మా చాదస్తం'' అని అంటూంటారు. అయిన సరే ఆవిడ చేయదు.

మీరాకి ఇష్టం లేకపోయినా శాంతమ్మగారు చెప్పినట్టు చేయక తప్పింది కాదు. కొబ్బరికాయ కొడుతుంటే వినాయకుడిగుళ్ళో గంట గణగణమని వినపడింది.

కొబ్బరికాయకూడా చక్కగా సగానికి పగిలింది,

"సరిగ్గా సమయానికి గుడిగంట మోగిందండే!'' అన్నాడు గంగులు.

ఎవరిమాట ఎలా వున్నా శేఖరానికిది శుభ సూచకంగానే అన్పించింది.

"హారతి కర్పూరం తేలేదా?'' అడిగింది శాంతమ్మగారు.

లేదన్నట్టు తలూపింది మీరా. బిగుసుకుపోయినట్టు నిలబడింది మీరా,

శాంతమ్మగారు లోపలికెళ్ళి హారతి కర్పూరం తీసుకొచ్చి మీరాకి ఇచ్చింది.



మీరా హారతి చూపించి వచ్చేస్తోంటే "ఉండు రాను" అని, శేఖరంతో "ఒకసారి నడపరా'' అంది,

"ఎందుకమ్మా చాదస్తం" అని అనలేదు శేఖరం. వచ్చి స్టీరింగు ముందు కూర్చున్నాడు.

హారతి పళ్ళెంతో తలవంచుకొని ముళ్ళమీద నిలబడినట్టు నిలబడింది మీరా.

మీరా మెడవరకూ వచ్చి శేఖరం చూపులు అక్కడ ఆగిపోయాయి. మీరా ముఖంకేసి చూస్తే-మీరా చూపులు ఎలా వుంటాయో శేఖరం వూహించుకోగలడు. వాటివి ఎదుర్కొని ఈ కాస్త సంతోషాన్నీ పాడు చేసుకోవాలనిపించ లేదతనికి.

కారుముందుకి కదిలి-మీరా పక్కనించి దూసుకుపోయింది.

అతను తిన్నగా రాఘవరెడ్డి ఇంటికి వెళ్ళిపోయాడు.

o o o

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. బాచి చెప్పిన గుర్తుల ప్రకారం అమ్మవారిగుడిదాటాక 'ఏ ఇల్లా' అని చూసీ చూడనట్టు చూసుకుంటూ నడుస్తున్నాడు శేఖరం. మూడు తాటాకుల ఇళ్ళు. ఓ ఇల్లు పెద్దగా వుంది, రెండు చిన్నవి. ఇంకొకటి పెంకుటిల్లు. అది మరీ చిన్నగా ఉంది. "ఆ ఇల్లు అయుంటుందా?" అనుకుంటూ ఏమీ ఎరగనట్లు ఆ ఇంటికేసి నడిచాడు. ఓ కిటికీ రెక్క తీసివుంది. లైటు వెలుగుతూనేవుంది. ఇంటిముందు కొంచెం జాగా వదిలి-ఇంటిచుట్టూ దడిఉంది. గుబురుగా చెట్లున్నాయి. వున్న మూడిళ్ళముందూ ఒక్క మొక్క లేదు. ఆ మూడిళ్ళకీ కొంచెం దూరంలో ఈ ఇల్లు వుంది.

శేఖరం నడుస్తూ కిటికీకి తిన్నగా వచ్చేడు.

విజయ్‌ని మీరా రెండు చేతులతో పట్టుకుని ఎగరేస్తోంది. విజయ్ ముఖం కిటికీకి అభిముఖంగా వుంది. మీరా అటు తిరిగి వుండడంవల్ల శేఖరం కనిపించే అవకాశంలేదు.

విజయ్ నవ్వు-శేఖరాన్ని ముందుకీ వెనక్కీ కదలనీయకుండా చేసింది.

విజయ్ నవ్వుతోంటే పై పళ్ళు వెడల్పుగా వుండి తమాషాగా మెరుస్తున్నాయి.

ఒక అయిదు నిముషాలు అలాగే నిలబడి పోయాడు శేఖరం.

"మీరా! ఎంతసేపూ రా!" సన్నగా-నీరసంగా వున్న గొంతు విని వులిక్కిపడ్డాడు శేఖరం. ఎదరకి వడివడిగా అడుగులువేయసాగాడు.

మళ్ళా ఓ అరగంటకి ఆ ఇంటిదారి పట్టేడు. కిటికీ కేసి చూశాడు. రెండు రెక్కలూ మూసి వున్నాయి. నిరాశ చెందాడు శేఖరం.

ఆ రోజు హాస్పటల్ దగ్గర బాబుని చూశాక మళ్ళీ ఓ సారి చూడాలని అతని మనసు తహతహ లాడుతోంది. రెండు రోజులుగా బాబుని చూడాలనే కోరికని అతను చంపుకోలేక పోయాడు. తను ఆటువైపు వచ్చినట్లు మీరా చూస్తే తనని ఏ విధంగా వూహించుకుంటుందోనని కొంచెం జంకాడు.

(సశేషం)

అంతర్జాతీయ మేధావుల ఆలోచనా మథనం :



చేతవెన్నముద్ద

— వాకాటి

ఆయన చాలా అసాధారణమైన వ్యక్తి.

అంచేత ఆయనను కలవాలన్న ఆతురతతో ఎందరెందరో విందులకు పిలిచేవారు. కాని ఏ విందుకు వెళ్ళినా అతడు మొదట తన ఎదుట వుంచిన కంచాన్ని చేతుల్లోకి తీసుకుని చాల జాగ్రత్తగా పరిశీలించేవాడు. ఆ తర్వాత నేప్‌కిన్‌తో దానిని గట్టిగా తుడిచేవాడు. ఆ తర్వాత తనే దానిలో ఏదయినా వడ్డించమనేవాడు. అతన్ని పిలిచిన ఏ గృహిణికయినా ఈ తతంగం అంతాచూస్తే వళ్ళు మండేది. అయినా ఏం చేయడం? అతడికి ఐద్ధశత్రువు ధూళి.

జీవితమంతా ధూళితో పోరాడిన ఆ వీరుడి పేరు లూయీపాశ్చర్. అంతవరకూ మానవాళి ఎరుగని అనేక మార్పులకు మూలకారణం సూక్ష్మజీవులేనని కనిపెట్టిన ఈ శాస్త్రవేత్త కుక్కకాటు వలన సంక్రమించే రేబీస్ వ్యాధికి చికిత్స కనుగొన్నాడు. మత్తుపానీయాలు నిల్వమీద చెడకుండా వుండేపద్ధతి, పట్టుపురుగులకు ఆధారమైన మల్బరీ చెట్లకు చీడనివారణ, పరాన్నభుక్కులవల్ల వచ్చే కీళ్ళ జబ్బుకోమందు, "యాంటిసెప్టిక్" విధానానికి దారి — ఇన్ని కనుగొన్న లూయీపాశ్చర్ 1822 డిసెంబర్‌లో పుట్టాడు. పాశ్చర్ నాన్న సార్జెంట్ మేజర్ జీన్ జోసెఫ్ పాశ్చర్, నెపోలియన్ క్రింద యుద్ధాలలో పాల్గొన్నాడు. అంచేతనే నెపోలియన్ చక్రవర్తినాటి తన మాతృదేశపు కీర్తి ప్రతిష్ఠలను తండ్రినుండివిన్న లూయీకి — దేశం అంటే ప్రగాఢమైన అభిమానం వుండేది. అయితే ఆ అభిమానాన్ని అతడు తన మతమయిన సైన్సు ద్వారానే ప్రకటించాడు.

1870లో ప్రష్యన్ సైన్యాలు ఫ్రాన్స్‌మీద దాడిచేసి, ఆదేశాన్ని ఆక్రమించుకోసాగాయి. అప్పటికే ప్రపంచ ఖ్యాతినందిన లూయీపాశ్చర్ — పక్షవాతంతో ఎడమకాలు, చేయి చచ్చుపడిపోయినా, తన ఆలోచనా నైశిత్యాన్ని

"నా దేశాన్ని దోచుకుంటున్న మీ రాజు పేరున్న పత్రంలో నా పేరును చూడడంకన్నా అసహ్యకరమైన విషయం లేదు"

కోల్పోలేము.

అతడప్పుడు తన విద్యార్థికిరాసిన ఒక వుత్తరంలో-"ఈనాడింత ఉత్తుంగ తరంగంలా జర్మనీ లేస్తున్నదంటే దానికి కారణం—బుద్ధి, విద్య, క్రమశిక్షణలమీద జర్మనీకున్న గౌరవం. మనమిలా అణగారి పోతున్నామంటే మనలో ఆ గౌరవం సన్నగిల్లడంవల్లనే. బుద్ధికి శిక్షణకావాలి. అలా శిక్షణ పొందిన జ్ఞానం ఆచరణ యోగ్యమయిన ఫలితాలద్వారా దేశానికి దారిచూపాలి. అలా దారి చూపగల దీపమే సైన్సు: సైన్సు అభివృద్ధి అనేది జాతి ప్రగతికెంత ముఖ్యమో నైతిక జీవనానికి అంతే ముఖ్యం!" అన్నాడాయన.

అంతకు రెండేళ్ళముందు అతడి వైజ్ఞానికకృషికి గుర్తింపుగా బాన్‌లోని జర్మన్ విశ్వవిద్యాలయం ఇచ్చినగౌరవ పట్టాను తిరిగి బాన్‌కు పంపించేస్తూ—" నాదేశాన్ని దోచుకుంటున్న మీ రాజు పేరున్న పత్రంలో నాపేరును చూడడం కన్న అసహ్యకరమైన విషయంలేదు" అన్నాడు పాశ్చర్!

1870—71లో ఫ్రాన్స్ పరిస్థితి మరింత దిగజారింది క్షతగాత్రుడయిన కొడుకుతో, భార్యతో స్విట్జర్‌లాండ్ చేరాడు పాశ్చర్. అతడి కొడుకు మామూలు మనిషవగానే మళ్ళీ పోరాటంలోకి వెళ్లాడు. పాశ్చర్ ఫ్రాన్స్‌లోని ల్యాన్స్ నగరం చేరాడు. కావి పారిస్ నగరం జర్మనీకి లొంగిపోయింది. లూయీపాశ్చర్ పదవికి ముప్పు ఏర్పడింది. అంతకు ఆరేడేళ్ళముందు అహర్నిశలు కృషిచేస్తూ, మధ్యలో తనకు పక్షవాతం వచ్చినా, అచంచల దీక్షతో లేచి, అలాగే పరిశోధనలుచేసి మల్బరీ చెట్లను, పట్టు పురుగులను ధ్వంసం చేస్తున్న సూక్ష్మజీవుల ఉనికిని కనుగొని ఆ పట్టు పరిశ్రమను కాపాడి దక్షిణ యూరపు, ఇటలీదేశాలకు మహోపకారం చేసిన ఆమహానుభావుడిప్పుడు చితికిన దశలో వుండడం గమనించిన ఇటలీ—పాశ్చర్‌ను తమ దేశంలోని పిసా నగరంలో ప్రొఫెసర్‌గావచ్చిచేరమని ఆహ్వానించింది.

అందుకాయన—"కష్టకాలంలోవున్న నాదేశం నాకివ్వలేని పదవిని, డబ్బుని ఆశించి నేను పరాయి దేశం వెడితే మాతృద్రోహం చేసిన వాడినవుతాను. సైన్యాన్ని విడిచి పారిపోయిన సైనికుడి వలెనే శిక్షకు అర్హుడి నవుతాను—'' అని నిరాకరించాడు!

ఎంత తేడా!

ఈనాడు అష్టకష్టాలూపడి మనదేశం సమకూరుస్తున్న ఉన్నత విద్యలనభ్యసించి, సుశిక్షితులవగానే పదవికోసం, పణంకోసం పరాయి దేశాల కెగబాకే మన మేధావులకూ, లూయీపాశ్చర్‌కూ

ఎంతిదూరం! ఆయనకు దేశం అమ్మయితే, మనకు దేశం నిచ్చెన. ఆయనకు దేశంయొక్క సుఖంలోను, కష్టంలోను భాగంవుంది. మనకు దేశం యొక్క సుఖంలో మాత్రమే పాలుకావాలి!

"సైన్సుకు దేశంలేదు. కాని సైంటిస్టుకుంది. సైంటిస్టు ఎప్పుడూ తన జాతి వైభవాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ప్రతీ గొప్ప సైంటిస్టులోనూ గొప్ప దేశభక్తుడుంటాడు. తన దేశానికి మేలుచేస్తానన్న మహదానందమే అతడికి ధైర్యస్థైర్యాలనిస్తుంది-'' అన్న పాశ్చర్ మాటలు నేటి మన టోపీదాసులలో ఎంతమందికి రుచిస్తాయి!

జీవితమంతా సూక్ష్మక్రిముల ఉనికిని గుర్తించడానికి వెచ్చించిన పాశ్చర్ మొదటిసారిగా 1864లో - "సూక్ష్మజీవులనేవి శూన్యంనుంచి వస్తాయన్నది భ్రమ: అవి అన్నిప్రాణులవలెనే ఉత్పత్తి అవుతాయి." అన్నసిద్ధాంతాన్ని ప్రతిపాదించగానే — అతడిమీద అనేకులు, ముఖ్యంగా మతం పేరిట కొందరు విరుచుకు పడ్డారు. అప్పుడాయన — నేను ప్రతిపాదించిన దానిలో మతం, వేదాంతం, నాస్తికత్వం, ఆస్తికత్వం .... వీటి ప్రసక్తేలేదు. అది ఒక సత్యం. పరిశోధనలు మొదలు పెట్టినప్పుడు.... ఈ సూక్ష్మజీవులు వాడంతటఅవిగా పుడతాయని ఋజువయితే నమ్మడానికి నేను



లూయీ పాశ్చర్

సిద్ధంగావున్నాను. కాని నా ప్రయోగాల వలన అది అబద్ధం అని తేలింది. ఇంకా అదే నిజం అని నమ్మేవారెవరయినా వుంటే వారిని గుడ్డివారనే అనుకోవలసి వస్తుంది...." అన్నాడు.

పాశ్చర్ కన్న సుమారు శతాబ్దం ముందు, పశువులను దారుణమైన వ్యాధి నుండి రక్షించే 'వేక్సినేషన్' (వెక్కా-పశువు) పద్ధతిని ఎడ్వర్డ్ జెన్నర్ కనుగొన్నాడు; అందులోంచి స్ఫోటకానికి వేక్సినేషన్ రూపొందింది. ఈ పద్ధతిని ఇతర వ్యాధుల నరికట్టడానికికూడా వాడవచ్చునని గ్రహించి లూయీ పాశ్చర్ కుక్క కాటుకు వేక్సిన్ తయారుచేయగలిగాడు.

దానిని మొదటిసారిగా 1885 జులై

౫ న జోసఫ్ మెయిస్టర్ అన్న కుర్రవాడిమీద ప్రయోగించాడు. మెయిస్టర్‌ను ఒక పిచ్చికుక్క చేతులమీద, కాళ్ళమీద తొడమీద విపరీతంగా కరిచింది. ఆ కుక్కను వెంటనే కాల్చి చంపివేశారు. 12 ఇంజక్షన్ల తర్వాత ఆ బాలుడు సంపూర్ణ ఆరోగ్యాన్ని కోలుకుని స్వగ్రామం వెళ్ళిపోయాడు. మానవాళికిలూయీ పాశ్చర్ అలా మరొక వరాన్ని ప్రసాదించాడు.

కాని ఈ కథ ఇక్కడితో ఆగలేదు. డా॥ డ్యుబో అన్న ప్రసిద్ధ జీవశాస్త్రవేత్త...లూయీపాశ్చర్ జీవితచరిత్రను రాశాడు. అందులో ఆయన ఇలా పేర్కొన్నాడు.

"ఆ విధంగా పిచ్చికుక్క కాటునుండి కోలుకున్న జోసెఫ్ మెయిస్టర్ కొన్నేళ్ళకు పారిస్‌లోని 'పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్' గేట్ కీపర్‌గా చేరాడు. అతడికి పాశ్చర్ ఇంజక్షనిచ్చి బాగుచేసిన ౫౫ సంవత్సరాల తర్వాత...1940లో జర్మన్‌లు ఫ్రాన్స్ మీద దాడిచేసి, పారిస్‌ను కైవశం చేసుకున్నారు. వారు, పాశ్చర్ సంస్థలో ప్రవేశించి, ఆ భవనపు నేల మాళిగలో పాశ్చర్ శవపేటికను భద్రపరచిన గదిని తెరవమని ఆజ్ఞాపించగా, ఆ పని చేయ నిచ్ఛగించని జోసఫ్ మెయిస్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు."

పిచ్చికుక్క కాటునుండి రక్షింపబడిన జోసఫ్ పిచ్చిమనుషుల కాటుకు బలికావడం ఎంత శోచనీయం ! ఈ అధికార మదాంధత అనే కాటుకు వేక్సిన్ ఎక్కడ వుంది?

తన యావజ్జీవితమూ విజ్ఞాన శాస్త్ర పాదపీఠంవద్ద నైవేద్యంగాసమర్పించిన మహాయోగి లూయీపాశ్చర్ తన అరవయ్యో ఏట ఒక సన్మాన సభలో చెప్పాడు.

"ఈ ప్రపంచమంతటా ఎటుచూసినా నాకు ఒక అనంత తత్వపు సంకేతాలు అగపడుతున్నాయి. వాటిని చూస్తుండగా ప్రకృతికన్న అతీతమైనది వున్నది అన్న నమ్మకం మన ఎదల్లోపల్లవిస్తూంది. దేవుడంటే వేరేమీకాదు, ఆ అనంతత్వానికి మనం కల్పించుకున్న ఒక రూపం మాత్రమే. మర్మగర్భితమైన ఈ అనంతత్వం మనిషి మనసు నేలినంతకాలమూ మనిషిదేవాలయాలు కడుతూనేవుంటాడు. కనపడే వస్తువుల కనపడని గుణాలను, శక్తులను గ్రహించిన గ్రీకు దేశస్తులు ఇంగ్లీషు భాషకు "Enthusiasm" (ఉత్సాహం) అన్న ఒక అద్భుతమైన పదాన్నిచ్చారు. "En Theos" అన్న గ్రీకు పదానికి "లోపలవున్న దేవుడు" అని అర్థం. సౌందర్యం, కళ, శాస్త్రం-వీటిలో ఏదో ఒకదానికి సంబంధించిన ఆదర్శానికి, ఎదలో గుడి కట్టిన ప్రతివాడూ ఆనందమూర్తి అవుతాడు. సౌందర్యోపాసన అయినా, కళారాధన అయినా, శాస్త్రశోధనయినా...ఏదయినా అనంతత్వపు వెలుగును ప్రతిబింబించేదే కదా!"

....అన్నవాడు లూయీపాశ్చర్.

ఆతడొక విజ్ఞాన శాస్త్రవేత్త.

....అందుకనే


"వస్తువ్యామోహంలో పడి కొట్టుమిట్టాడుతున్న నేటి ప్రపంచంలో పరిశోధనా యోగమగ్నుడయిన మేధావి ఒక్కడే నిజమైన ఆస్తికుడు"-అన్నాడు ఆల్బర్ట్ ఐన్‌స్టిన్‌. ❃

కోడెగాడి గోడు

వచనరూపకం : ఉప్పల లక్ష్మణరావు

కల్లబొల్లి సాకులు సెప్పి నన్నొల్లికుంది, అటకసేసి నన్నేలుకోనంది ఇల్లాలు నన్నొగ్గేసి యెల్లిపోయింది. నట్టింటి లోన బార్లైయెగుతున్న ఆ వాపసికట్లు అడినే గూళ్ళు కట్టుకున్నాయి. ఉడిపి శ్రీక్రిష్ణుడెట్టిన మేకుల మెతుకులు, సెర్లోట ఆడుకొనే డిన గోపికల్లే నా కడుపులోన కేరింతలెడుతున్నాయి. యింట అడదు లేను కమ్మంగ కూడొండి పెట్టేను. మెతుకు సిఫుకినా, కెడు కసింత మాడినా తొడపాశమెడితేను పల్లకు దేవ. నాను కల్లు కుడిసొచ్చి దానొల్లు సితకబాది, ఝల్లిల్లి కక్కి కంగాళిసేసినా. నడుమెల్లవొంచి, నేలల్ల కడిగి, యిల్లంత అలికి వాకల్ల ముగ్గెట్టి. యెంగ మొగ్గల్లే యేగుసుక్క యెలిగి పోతుంటానె, మూడు పొక్కిళ్ళ పొయ్యి రాజేసి — పాలు పొంగించి, నీళ్ళు మరిగించి, పొరుగింటికి పొరెల్లి టీ గుండ దండుకొని తెచ్చి, తిరపమెత్తి చీని అరువు అడిగి తెచ్చి, నాచేత "చా" కుడిపించి పనిలోకి పంపేను నన్ను. బుస్కోటు బొత్తాంవులు సంగ కుట్టి అట్టనాగ "బెల్‌బాటమ్" యిస్త్రీజేసి, బాటాజోళ్ళకంత అంగారు నలుపు రంగేసి, బూడ్సెల్ల నిగనిగ బురుసు కొట్టి, పాదాలు పూతో పూజించి, పాదరక్షలు తొడిగించి లేసులు దూము దేసి, నా సేతి పిడిగుద్దు సద్దిమీద దసి సూసి, నా నోట యీడుకోలు మాటగ "ఖబడ్దార్"! హుషారు యినుకుండి, యీది గుమ్మందాక నా యెంటబడి, నా అడుగులకి మడుగులొత్తి, పనికి నన్ను సాగనంపేను. మరి నాను యీపె తలుపు గొళ్ళెమెట్టి కప్పుతాళం బిగించి, గెట్టిగ లాగి సూసి, "బెల్-బాటమ్" జేబుకోన బీగం భద్రపరసి, సీకు సి తలలేక అఫీసుకెల్లిపోయేను.

తొలికాన్పులు మూడు సిక్కాడి, బొడ్డుకోసిన ఆడపాపల్ని నా సేతుల యెడితేను, కొడుకుని కనలేని కడుపుకంటే గొడ్రాలి కడుపు మేలని తిట్లు పడతిట్టినాను. తొలి కాన్పుకి యింటిదాయి కూతుర్ని పెసవించిందంటేను తొలి తప్పు కాసి మొగోడు సెపింం చొచ్చులే మలి పురిటికి మల్ల ఆ పిల్లనే కన్నదంటేను, పంచాంగ మోగించలేదనీ, కొండమీన ...



పైన దోసం మోపి ఆడదాయిని మన్నించొచ్చు. పరవ నేదునే. మరి మూడో సారి మల్ల పెల్లాం సాకిరేపెట్టి కూతుర్ని కన్నదంటే - నలుగురిలోన తలెత్తుకుని తిరిగే మొగాడు మొకం సూపించ గలడా! — తల తీసి నట్టుంటేను! యేలిన్నాటి శని యిరగడవుతాదని పచ్చిపురటాల పొత్తి కడుపుకి గరిటికాడ కాల్చి వాతలెట్టినా. పాతివ్రత్యం పాలించి, యిల్లాలు పల్లెత్తి పలక నే నేదు. కళ్ళంట తడి కార్సనేనేదు. పసి బిడ్డకి పసుపు రాసి, తొట్టిలోపెట్టిన మరునాటి రాత్తిరికి నా పడక సేరి పతిసేవ సేసింది. నా సీడ యిచ్చాను. కొంప అద్దె తీర్చే సేర్చాను లచ్చనంగ. కట్టు క్ఫందికిచ్చాను. పసందుగ నైలాను కోకలు నాలుగు, జయలచ్చిం వి పాసను రవికలు మరి నాలుగు. నా కళ్ళకి పండుగ సేసుకుందుకి కూడెట్టాను మూడు పూటల కడుపు నిండుగ. కొడుకుని కంటదని నిండాసతో గుండెమీద తలెట్టి కులికినాను. బుగ్గమీద సిటికేసి ముక్కు కొన కొరికినాను. పెదాలు తడిసేసి ముద్దుల ముంచినాను, నాను సేసినలోటేటో సింహాద్రి అప్పన్నకే యెరుక!

బైకలని బొంకి నన్నొల్లకుంది,వలపు సూపులు సూపుతూనే నన్నేలుకోనంది, కట్టుకున్న యిల్లాలు నన్నిడిసెల్లిపోయింది.!

పల్లె యీది పలుగాకి పోకిరి పార్వతీసుతోనే నెగిసిపోనాదో, గాంధినగరం తోట రాంవుడు గిరీసుతోనే లేసిపోనాదో, అసిక రోడ్డు అందాలరాయుడు

అంవిరేసుగాడితోనే సేరి పోనాదో, కస్పులోన ఇస్త్రీవాస్తాదు కురేసుకాడ కులుకు తున్నాదో. రంపసాయిల రౌడి నాయుడు రంగేసుతోకూడి సింగారాలు రుసి సూపుతాంఁదో, సంగ్రమాపేట తోట సంబరాల రాఁవుడు రాఁవేఁసు తొట్టమీద సీత్రై కూర్చుండి సరస వాఁడుతుందో? రోజులు దొర్లినాయి. ఆర్నెల్లు అరిగిపోనాయి. ఆడేటి మరలు మంఁదెట్టినాగో-మరి నా గడప తొక్కనే నేదు, నాయాడది. పండంటి నా కాపు రంలోన నిప్పు లోసింఁది. యెల్లిపోయిన కాలం కలలోనైన మరిరాదు. యేటిలోన పారిననీరు మరి చేలకిరాదు. కొత్త నీటి తోనె పైరు యెట్టాల.

పెళ్లాం నన్నొదిలి పారిపోయింది
వేవిళ్ళని నా కంట దుమ్ముగొట్టి
నన్నొల్లకుంది నా దారిన నన్ను
సూసుకోమంది.

ఊరల్ల వాడల్ల యెతికి మల్లి యింటికి తమ్మంటే మొగోడి ఆ తోరు మంట కలిసి పోదా! మొగుడిఆడాలోంచి పారొచ్చి, పెనిఁవిటి పడకలోంచి నెగి సొచ్చిన ఆడదాయిని రచ్చకీడ్చి కచ్చ తీర్చుకోకుంటే లోకంల నీతి నిలగల్లు తుంటేటి? పగబట్టిన కోడె తాసుని నాను, కాటేయక మానుతానేటి? కోర్టు కెడితేను యిడాకులిడతారు. ఆడ బొట్టెల్ని మొగోడి నెత్తివి రుద్దుతారు.

సెని యిరగడవుతాది. సరికొత్త మగ నాలు కావాలని వూరులోన కబురెట్టాల! పత్రికలోన పెకటన యేయించాల. సినీమాలోన సైడు రాపించి సూపించే యేర్పాటు సెయ్యాల. ఆడ కూతుళ్ళకే కరువొచ్చినాదా తెలుగు నాట? "క్రో" అంటే పాదాల కాడ వాల్తాయి " కోటి పిట్టలు. మందు ధరలూ ఎండినపంటలూ, పేరు సెప్పి ఇంఁడించి ఇరారు నామా రాపించి యిమ్మంటే నా పాదాలకాడ పిట్టతోనే యెడతారు. దొంగ బంగారం పది తులాలు, నగదు మంచి నోట్లు పవ్ యేలు, పెళ్ళిళ్ళ పేరయ్యకి బేరమిస్తేను. అరనిమిసంలోన ఆడబోయిన తీరతం యెదురయేను. మల్లి వొస్తది పరొక బొట్టె. మగరాజు తల్సుకుంటె మనువుకి లోటేటి? నల్లబజారులో అల్లుళ్ళ కోసం వని నోట్లకట్టలు సేతబట్టి బొట్టెల తంద్రులు యెగబడుతుంటే, నాకేటి కొదవ! కొండమీద అప్పడు సల్లగుండాల గాని! నెల జీతం అటుంచి, డియ్యేలు, టియ్యేలు మామూళ్ళతో కలిపి రెండు సేతులా మూడొందలు గడించే మగ మారాజున్నాను.


కడుపులోన కొడుకున్నడని సెప్పి
నన్నొల్లకుంది, కలుకులాడి అలక
నేసి నన్నేలుకోనంది. యిల్లాలు
నన్నొగ్గేసి నెగిసిపోయింది.

(ఇంకా ఉంది)

జ్యోతి

బహుమతి రు. 100

శ్రీశ్రీ నిర్వహిస్తున్న పదబంధ ప్రహేళిక



ఆధారాలు

అక్టోబరు '80

అడ్డం

1. పూర్వం తూర్పు 3. ఆ కెరటం 5. వరూధిని వీణ దేనికి మేళం? 6 తుది చూపు! 8. అకొన్న కంచెకు ఆహారం 9. అధమం 11. పాడితో పేలుతుంది 13. 25. జానకి, ఊర్మిళా 15. అమ్మ 16. అభినందనకి, ఆప్యాయానికి 17. అంటుకుంటే ప్రమాదం 19. అటు వైపునుంచి వచ్చేది 22. మాయించడం మంచిది కాదు 23. రేడు రేరాజు 25. చూ. 13 26. మనసొంతం (తలకిందులు) 28. కొండవారి 30. వినాయకుడు 31. న - రమ్మంటారు (అటునుంచి)

నిలువు

1. తాళ సప్తకంలో ఒకటి 2. గ్రహంలో కుకవి తలపెడితే భారత పాత్ర కనరానిది కలిసి రావచ్చు 4. మూడు మాత్రలు 5 ఇది నేనన్నది. 7. పఁ క్రమ 8 భవుకు మన్మధుడు 10. మధ్యము పుష్టిలేని ఆస్థాన కవి 12. ధ్వని షం 14. సారీ (బహువచనం) 15 అగ్రమేడిస్తే సభలో కేకలు 17. నక్క ఁ 18. ఎలిమన్న తుది పుట్టం? 20 బ్రాహ్మణి 21. రత్నాలుకూడా ఇవే 23. క 24. గరువ మారితే ఆరింట ఒకటి 27. కార్యకూకలు కట్టేది 29. ప్రాప్తించు

సెప్టెంబర్ ప్రహేళిక సమాధానాలు :

అడ్డం: 1. గోవా. 3. తనా. 5. సూరీడు. 6. గడుసు. 8. 9. కటువు. 11. జాగా. 13. విన్నపం. 15. పతనం. 16. దేళాంగ మఁ 17. బంగారు. 19. కమలం. 22. దార. 23. కలుగు. 25. రుచి. 26. డీళ 28. లావత్తు. 30. నడు. 31. బిస. - నిలువు: 1. గోరీ. 2. వాడుక. 3. త 4. నాడు. 5. సూరన్న. 7. సుజాత. 8. జీవి. 10. టుగాగమాలు. 12. గా 14. పందేరు. 15. పత్రిక. 17. బందా. 18. గారడీ. 20. మరుత్తు. 21. ఁ 23. కనుడు. 24. గులాబి. 27. కొన. 29. వస.

సెప్టెంబర్ ప్రహేళిక విజేతలు :

1. "గుమోగా" C/o. జి. ఎం. గాంధీ. నగరం, 2. కుమారి జె. సుబ్బలక్ష్మి, హైదరాబాదు, 3. బి. బి. ఆర్. కృష్ణమూర్తి, తెక్కలి 4. కె. కోటిలింగం, కావలి 5. ఎస్. వి. శ్రీనివాసులు, శ్రీకాకుళం 6. ఎస్. రామళ వరంగల్ 7. కొత్తపల్లి సాంబశివరావు, అమృతలూరు 8. ఆర్. కమల. హ పత్రి 9. ఆర్. శ్రీమన్నారాయణ, నల్లగొండ. 10. వి. భానుమతి, నెల్లూరు అలపర్తి లక్ష్మీతులసి, నందివెలుగు 12. పి. మురళి, వైజాగ్ 13. కుర్రా వెం కేశ్వర్లు, పినపాడు 14 అరికార రామసూర్య సోమేశ్వరావు. విజయనగరం. ❋ బహుమతి మొత్తం రు. 200 ఈ పద్నాలుగు మంది విజేతలకు స నంగా పంచబడుతుంది–ఎడిటర్.

నిబంధనలు గమనించండి :

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తి సెప్టెంబరు 25 లోపు మాకు చేరేట్టు పంపాలి. తెల్లకాగితంమీద గళ్ళు గీసి ప ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే పంపాలి. ఆల్ కరెక్టు ఎంట్రీకి బహుమతి రు. 100. ఆల్ కరెక్టు ఎంట్రీలు ఒ మించి వచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుత

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 1-8-4 Chikkadapally. Hyderabad—500 020 & Printed at CHANDR SEKHARA PRINTING WORKS, Hyderabad-500 001 For RAGHAVA PRINTERS, HYDERABAD-20

OCTOBER Rs.3/ REGD.No. M8669

